www.andhrajyothy.com
వెల (Price): Rs. 6.50
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 45
బుధవారం | 14-5-2025
శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, బహుళపక్షం, తిథి: విదియ రా.2:30 తదుపరి తదియ, నక్షత్రం: అనూరాధ ఉ.11:47 తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం: సా.5.55-7.41, దుర్ముహూర్తం: ఉ.11:45-12:37, అమృతఘడియలు: తె.4:27-6:13, రాహుకాలం: మ.12:00-1:30, సూర్యోదయం: 5:47, సూర్యాస్తమయం: 6:36
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

చార్మినార్ చెంత.. అందాల పుంత


మంగళవారం చార్మినార్ వద్ద మిస్ వరల్డ్-2025 పోటీదారుల గ్రూప్ ఫొటో

వివరాలు 13లో


లాడ్‌బజార్‌లో వివిధ దేశాల సుందరీమణుల షాపింగ్


మిస్ వరల్డ్ పోటీదారుల కోసం చౌమహల్లా ప్యాలె్‌స్‌లో ఏర్పాటు చేసిన విందులో సీఎం రేవంత్‌రెడ్డితో నాగార్జున

ఆపరేషన్ సిందూర్..

పాక్‌కు లక్ష్మణ రేఖ

'భారత్ మాతాకీ జై'.. శత్రువుల వెన్నులో వణుకు పుట్టించింది

వీర సైనికులందరికీ సెల్యూట్ చేస్తున్నా

త్రివిధ దళాలు పాక్ సైన్యాన్ని మట్టికరిపించాయి

అణు బెదిరింపులనూ అపహాస్యం చేశాయి

మరోసారి పాక్ దాడికి యత్నిస్తే వినాశనమే!

అదంపూర్ వైమానిక స్థావరంలో ప్రధాని మోదీ



అదంపూర్, మే 13: భారత్ మాతా కీ జై.. అనే నినాదం శత్రువుల చెవుల్లోనూ మార్మోగిందని, వారి వెన్నులో వణుకు పుట్టించిందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌కు స్పష్టమైన 'లక్ష్మణ రేఖ'ను గీశామన్నారు. "భారతదేశం తన భద్రతా దళాలకు ఎప్పటికీ రుణపడి ఉంటుంది. మన దేశం కోసం వారు చేస్తున్న త్యాగాలు ఎనలేనివి" అని పేర్కొన్నారు. మంగళవారం మోదీ పంజాబ్‌లోని అదంపూర్ వైమానిక స్థావరాన్ని సందర్శించారు. ఇది భారత్‌లోని రెండో అతిపెద్ద ఎయిర్‌బేస్. ఆపరేషన్ సిందూర్, భారత్-పాక్ కాల్పుల విరమణకు అంగీకరించిన నేపథ్యంలో ఆయన పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. పాకిస్థాన్ బలగాలు లక్ష్యంగా చేసుకోవాలని యత్నించిన వాటిలో అదంపూర్ వైమానిక స్థావరం కూడా ఉండడం గమనార్హం. అంతేకాదు.. తాము ఈ స్థావరాన్ని ధ్వంసం చేశామని, ఎస్400 రక్షణ వ్యవస్థను కూడా నాశనం చేశామని పాక్ అబద్ధాలు ప్రచారం చేస్తోంది. ఈ నేపథ్యంలో పాక్ సరిహద్దుకు 100 కిలోమీటర్ల దూరంలోని అదంపూర్ వైమానిక స్థావరానికి ప్రధాని మోదీ వెళ్లి, భద్రతా బలగాలతో

మిగతా 12వ పేజీలో...

భారత ఎస్-400 రక్షణ వ్యవస్థను ధ్వంసం చేశామన్న పాక్ దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ.. అదంపూర్ వైమానిక స్థావరంలో ఎస్-400 ముందు ప్రసంగించిన ప్రధాని మోదీ

పహల్గాం కుట్రదారు హతం

జమ్ము, కశ్మీర్‌లోని షోపియాన్‌లో ఎన్‌కౌంటర్

మా జవాన్లు 11 మంది మృతి

మరో 78 మందికి గాయాలు: పాక్ మిలటరీ 12

అబద్ధాల ఫ్యాక్టరీ.. పాకిస్థాన్

అదంపూర్ స్థావరం నాశనం అంటూ ఫొటోలు

అదంతా అబద్ధమని తేల్చిన ప్రధాని నరేంద్ర మోదీ

ఇతర ఎయిర్‌బేస్‌లపైనా పాక్ తప్పుడు ప్రచారం



రిటైర్మెంట్ తర్వాత..

ఏ పదవీ తీస్కోను

న్యాయరంగానికి సేవలు కొనసాగిస్తా

పదవీకాలం చివరిరోజున సీజేఐ సంజీవ్‌ఖన్నా స్పష్టీకరణ 10

తదుపరి సీజేఐ గవాయ్ బలమైన మద్దతుదారుగా వెంట నిలిచారని వెల్లడి

ఎమర్జెన్సీలో హక్కులకై నిలబడిన జస్టిస్ హెచ్ఆర్ ఖన్నా వారసత్వం నిలబెట్టారు

జస్టిస్ ఖన్నాపై పలువురి ప్రశంసలు

9 రోజుల ముందుగానే

నైరుతి



అండమాన్‌ను తాకిన రుతుపవనాలు

27న కేరళలోకి ప్రవేశించే అవకాశం

జూన్ తొలి వారంలోనే తెలంగాణకు!

రాష్ట్రంలో నేడు, రేపు వర్షసూచన

వడదెబ్బకు నలుగురి మృతి 2


ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కను కలిసిన సందీప్ కుమార్ సుల్తానియా

సందీప్‌కుమార్‌కు ఆర్థిక శాఖ

పూర్తి బాధ్యతలు

ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ 2

సీబీఎస్ఈ 10,12 ఫలితాల్లో

బాలికలదే పైచేయి

10వ తరగతిలో 93 శాతం, 12వ తరగతిలో 88.39% ఉత్తీర్ణత

టాప్‌లో విజయవాడ రీజియన్.. జవహర్ నవోదయ స్కూళ్లు ఫస్ట్ 10

ఏపీలోని కర్నూలు జిల్లా బాలికకు టెన్త్‌లో జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు

ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు

ఈఎస్ఐ ఓపీ కౌంటర్.. జనసముద్రం


చిరు ఉద్యోగులు వైద్య చికిత్సల కోసం వచ్చే హైదరాబాద్ సనత్‌నగర్‌లోని ఈఎస్ఐ ఆస్పత్రిలో ఓపీ కౌంటర్ ఇది. మంగళవారం ఉదయం ఓపీ చీటీల కోసం ఇలా బారులు తీరారు.

ఏసీబీకి పట్టుబడ్డ డీఎస్పీ ఇంట్లో

మందుగుండు

21 లైవ్ రౌండ్లు.. 69 ఖాళీ కాట్రిడ్జ్‌లు

ఆయుధాల చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు

హైదరాబాద్, హయత్‌నగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఒక స్కానింగ్ సెంటర్ నుంచి రూ.25 లక్షలు లంచం డిమాండ్ చేసి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కు పట్టుబడిన సూర్యాపేట డీఎస్పీ కే.పార్థసారథి ఇంట్లో అక్రమ మందుగుండును ఏసీబీ అధికారులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. పార్థసారథిని అరెస్టు చేసిన తర్వాత హయత్‌నగర్‌లోని ఆయన ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో ఆయన ఇంట్లో కొన్ని విలువైన డాక్యుమెంట్లతోపాటు 21 లైవ్ రౌండ్లు, 69 ఖాళీ కాట్రిడ్జ్‌లు, ఒక కాట్రిడ్జ్ స్టాండ్‌ను గుర్తించారు. వీటి గురించి అధికారులు ప్రశ్నించగా ఆయన నుంచి సరైన సమాధానం రాకపోవడంతో హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు పార్థసారథిపై ఆయుధాల చట్టం కింద కేసు నమోదు చేశారు. లైవ్ రౌండ్లు అనధికారికంగా ఆయన ఎందుకు పెట్టుకున్నారనే విషయాలపై పోలీసు ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మృతదేహాలు కొంటాం!

ప్రైవేటు వైద్య కళాశాలల్లో 'అనాటమీ'కి శవాల కొరత

ఒక్కో మృతదేహానికి లక్ష ఇచ్చేందుకూ కాలేజీలు సిద్ధం

నిరుపేద కుటుంబాలే టార్గెట్.. దళారుల ద్వారా దందా

కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల నుంచి కొనుగోలు



హైదరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు వైద్య కళాశాలల్లో మృతదేహాలకు కొరత నెలకొంది. వైద్య విద్యలో భాగంగా శరీర నిర్మాణం, అవయవాల పనితీరుపై విద్యార్థులకు అభ్యసనం (అనాటమీ) కోసం మృతదేహాలు దొరకడం లేదు. ఫలితంగా ఆ కాలేజీలు అడ్డదారులు తొక్కుతున్నాయి. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో.. అలాగే రాష్ట్రంలోని సరిహద్దు గ్రామాల్లో నిరుపేదల కుటుంబాలనే లక్ష్యంగా చేసుకొని శవాల కొనుగోలు దందాకు తెరలేపినట్లుగా ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. భారీగా డబ్బిచ్చి.. మృతదేహాలు కొంటున్నాయని, ఒక్కోసారి మృతదేహానికి రూ.లక్ష దాకా ఇచ్చేందుకు సిద్ధపడుతున్నాయని ఆరోపణలున్నాయి. ఇందుకు సదరు కాలేజీలు దళారులను రంగంలోకి దింపుతున్నాయని చెబుతున్నారు. మృతదేహాన్ని ఖననం చేసే బదులు పరిశోధనల కోసం వైద్య కళాశాలలకు ఇస్తే ఉపయోగం ఉంటుందని.. అంత్యక్రియల ఖర్చు తప్పడమే



కాకుండా, ఉల్టా చేతికి డబ్బులొస్తాయని దళారులు నచ్చజెబుతున్నట్లు సమాచారం. ప్రభుత్వ వైద్య కళాశాలలకైతే రెండు రకాలుగా డెడ్‌బాడీలు వస్తాయి. అనాథల మృతదేహాలు, రోడ్డు ప్రమాదాల్లో గుర్తుపట్టలేని విధంగా మారిపోయి.. కుటుంబసభ్యులూ వాకబు చేయకపోతే ఆ మృతదేహాలు వస్తాయి. కొందరు తాము చనిపోయాక మృతదేహాలను వైద్య కళాశాలలకు ఇవ్వాలని వీలునామా రాస్తే అవీ వస్తాయి. ఈ రెండోరకం మృతదేహాలు కొన్ని పేరొందిన ప్రైవేటు కాలేజీలకూ వస్తాయి కాబట్టి వాటికి కొరత ఉండదు. అయితే కొత్తగా ప్రైవేటు కాలేజీలు బాగా పెరగడంతో వాటికి మృతదేహాల కొరత నెలకొంది. ఇలాంటి కాలేజీలు తమకు మృతదేహాలు కావాలని ఏకంగా వైద్యవిద్య సంచాలకుడికే లేఖలు రాస్తున్నాయి. నిరుడు హైదరాబాద్-విజయవాడ రహదారికి సమీపంలో నగరానికి

మిగతా 3వ పేజీలో...

ఇంజనీరింగ్ ఫీజు

2.5 లక్షలా?

మూడేళ్ల తర్వాత రూ.5 లక్షలు చేస్తారా? 14

ఇష్టానుసారంగా పెంచుతామంటే ఎలా?

కొన్ని కాలేజీల తీరుపై అధికారుల అసంతృప్తి

ఇంజనీరింగ్ ఫీజుల పెంపు నిర్ణయం వాయిదా

సరస్వతి పుష్కరాలకు సర్వం సిద్ధం

జయశంకర్-భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరంలో రేపు ప్రారంభించనున్న శ్రీ మాధవానంద సరస్వతి

17 అడుగుల ఏకశిల సరస్వతీ విగ్రహాన్ని ఆవిష్కరించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 14

భక్తులకోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

200 సీసీటీవీ కెమెరాలతో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు

ఉద్యోగుల్ని దోషులుగా నిలబెట్టొద్దు

ప్రభుత్వ ప్రకటన అలాంటి సంకేతమే ఇచ్చింది

బోనస్‌లు, అదనపు భత్యాలు, వేతనాల పెంపు అడగట్లేదు

బకాయిలనే అడుగుతున్నాం: ఉద్యోగుల జేఏసీ 2

ఉద్యోగులపై సీఎం రేవంత్ వ్యాఖ్యల్ని ఖండిస్తున్నాం!

ఉద్యోగులు, ప్రజల మధ్య వైషమ్యాలు పెంచడం సరికాదు

రాష్ట్ర ఉద్యోగులు, పింఛనుదారుల సమన్వయ కమిటీ

కల్తీ మద్యం తాగి 17 మంది మృతి 10

పంజాబ్‌లో ఘటన.. మృతుల్లో అత్యధికులు కూలీలు

ఇవి మరణాలు కావు... హత్యలు, బాధ్యులను వదిలిపెట్టం

కఠినంగా శిక్షిస్తాం: పంజాబ్ సీఎం భగవంత్ మాన్

బీఆర్ఎస్ నాయకత్వ బాధ్యతలు..

కేటీఆర్‌కు అప్పగిస్తే స్వాగతిస్తా

కేసీఆర్ నిర్ణయానికి కట్టుబడతా.. పార్టీలో విభేదాల్లేవు

సోషల్ మీడియాలో నాపై దుష్ప్రచారం

పాకిస్థాన్‌ను కూడా నమ్మి అప్పులిస్తున్నారు 2

రేవంత్‌రెడ్డిని మాత్రం ఎవరూ నమ్మడం లేదు

అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదు: హరీశ్

9 రోజులు ముందుగానే 'నైరుతి'

అండమాన్‌ను తాకిన రుతుపవనాలు.. 27న కేరళలోకి ప్రవేశించే అవకాశం

» జూన్ తొలి వారంలోనే తెలంగాణకు!

» రాష్ట్రంలో నేడు, రేపు వర్షాలు!

హైదరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఎండలతో మండుతున్న ప్రజలకు చల్లని కబురు! ఊహించిన దాని కంటే చాలా ముందుగానే నైరుతి రుతుపవనాలు వచ్చేస్తున్నాయి. కొద్ది రోజులుగా చురుగ్గా కదులుతున్న రుతుపవనాలు మంగళవారం దక్షిణ, ఉత్తర అండమాన్ సముద్రం, అండమాన్, నికోబార్ దీవులు, దక్షిణ బంగాళాఖాతంలోకి ప్రవేశించాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రకటించింది. రుతుపవనాల ఆగమనం దృష్ట్యా గత రెండు రోజులుగా అండమాన్ నికోబార్ దీవుల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రానున్న 2-3 రోజుల్లో దక్షిణ అరేబియా సముద్రం, మాల్దీవులు, కొమరిన్ ప్రాంతం, అండమాన్ నికోబార్ దీవులు మొత్తం, అండమాన్ సముద్రంలో మిగిలిన ప్రాంతాలు, మధ్య బంగాళాఖాతంలో పలు ప్రాంతాలకు విస్తరించనున్నాయని ఐఎండీ పేర్కొంది. ప్రస్తుత అంచనాల ప్రకారం జూన్ 10 నాటికి రుతుపవనాలు తెలంగాణను తాకుతాయి. అండమాన్ నికోబార్ ప్రాంతంలోని అనుకూల వాతావరణం ఇలాగే కొనసాగితే రాష్ట్రానికి మరింత ముందుగా జూన్ మొదటి వారంలోనే వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. సాధారణంగా అండమాన్ నికోబార్ దీవుల్లోకి మే 22న రుతుపవనాలు ప్రవేశించాలి. అయితే ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉండడంతో 9 రోజులు ముందుగానే వచ్చేశాయి. కేరళను ముందస్తుగా ఈ నెల 27వ తేదీనే (సాధారణ తేదీ జూన్ 1) నైరుతి రుతుపవనాలు తాకుతాయని ఇప్పటికే ఐఎండీ ప్రకటించిన విషయం తెలిసిందే. అలా జరిగితే 2009 తర్వాత అంచనాల కంటే ముందుగానే రావడం మళ్లీ ఇప్పుడే అవుతుంది. ఆ ఏడాది మే 23నే కేరళలోకి ప్రవేశించాయి. మంగళవారం అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తనం ఆవరించింది. దీని ప్రభావంతో ఈ నెల 16 నుంచి 22 మధ్య తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని కొందరు వాతావరణ నిపుణులు అంచనా వేశారు. కాగా, బుధ, గురువారాల్లో తెలంగాణలో చాలా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వచ్చే మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. మంగళవారం ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం పమ్మిలో అత్యధికంగా 42.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్లు తెలిపింది. కాగా, హైదరాబాద్‌లో భిన్న వాతావరణం నెలకొంటోంది. ఐదు రోజులుగా మధ్యాహ్నం 40-41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, సాయంత్రం ఈదురుగాలులతో వర్షాలు కురుస్తున్నాయి. వడదెబ్బ తగిలి మంగళవారం ఖమ్మం జిల్లాలో ఇద్దరు, హనుమకొండ జిల్లాలో ఇద్దరు మృతిచెందారు.

అకాల వర్షం.. అన్నదాత ఆగమాగం

రంగారెడ్డి జిల్లా ఆమనగల్లులో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మార్కెట్ యార్డులో విక్రయానికి తెచ్చిన ధాన్యం తడిసిపోయింది. ఎరన్‌పల్లి, హస్నాబాద్, అంగడిరైచూర్, పర్సాపూర్, పెద్దనందిగామ తదితర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల దగ్గర ఉన్న ధాన్యం తడిసిముద్దయింది.

లోకం తీరు



సందీప్‌కుమార్‌కు ఆర్థిక శాఖ పూర్తి బాధ్యతలు

హైదరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక శాఖ పూర్తి బాధ్యతలను 1998 బ్యాచ్ ఐఏఎస్ అధికారి సందీప్‌కుమార్ సుల్తానియాకు అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణారావు, ముఖ్య కార్యదర్శిగా సందీప్‌కుమార్ కొనసాగుతూ వచ్చిన విషయం తెలిసిందే. అయితే రామకృష్ణారావు ఈ నెల 1న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. దీంతో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బాధ్యతల నుంచి ప్రభుత్వం ఆయనను రిలీవ్ చేసింది. ఆ బాధ్యతలను సందీప్‌కుమార్‌కు అప్పగించింది. ఆయన ప్రజాభవన్‌కు వెళ్లి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు.

రూ.2,500 కోట్ల రుణం తీసుకున్న రాష్ట్రం

హైదరాబాద్, మే 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం రిజర్వు బ్యాంకు నిర్వహించిన ఈ-వేలం ద్వారా రూ.2,500 కోట్ల రుణం తీసుకుంది. ఇందులో 21 ఏళ్ల కాల పరిమితి 6.86 శాతం వార్షిక వడ్డీతో రూ.800 కోట్లు, 22 ఏళ్ల కాల పరిమితి 6.86 శాతం వార్షిక వడ్డీతో రూ.800 కోట్లు, 25 ఏళ్ల కాల పరిమితి 6.85 శాతం వార్షిక వడ్డీతో రూ.900 కోట్ల రుణాలు ఉన్నాయి. తెలంగాణతో పాటు దేశంలోని ఏడు రాష్ట్రాలు రూ.11,500 కోట్ల అప్పులు తీసుకున్నాయి.


విద్యార్థులను అభినందిస్తున్న భాష్యం హనుమంతరావు తదితరులు

భాష్యం బ్లూమ్స్ విజయభేరి

గుంటూరు(విద్య), మే 13(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ స్కూల్ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) విడుదల చేసిన పదవ తరగతి ఫలితాల్లో భాష్యం బ్లూమ్స్ విద్యార్థులు సంచలన ఫలితాలు నమోదు చేశారని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భాష్యం బ్లూమ్స్ విద్యార్థి ఎస్.కె.ఎం.శ్రీహర్ష 500 మార్కులకు గాను 492 మార్కులు సాధించి భాష్యం విద్యా సంస్థలకు గర్వకారణంగా నిలిచారన్నారు. అదే విధంగా ఎ.సాయినిఖిత 490, టి.అనీష్ 489, బి.లిఖిత్ మనోఘ్న 488, పి.శ్రీసాయి మిత్ర 488, ఎ.శ్రీహరిణి 488, యు.యశ్వంత్ సాయి 486, కె.స్నిగ్ధ 485, ఎస్.మణియశ్వంత్ 485, పియూష్ ఫోడికర్ 485, ఇ.రిషిక 485, డి.శ్రీహరిణి 485 మార్కులు సాధించారని తెలిపారు. తమ విద్యార్థులు 23 మంది 480కి పైగా మార్కులు, 470కి పైగా 63 మంది, 450కి పైగా 146 మంది అత్యధిక మార్కులు సాధించారన్నారు. ఇంతటి ఘన విజయానికి తోడ్పడిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు భాష్యం రామకృష్ణ, వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ అభినందనలు తెలిపారు.


జితేశ్ (493), హనిస్విత (492), మాన్విత (490)

విజ్ఞాన్ విద్యార్థుల వికాసం

హైదరాబాద్ సిటీ, మే 13 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ పదోతరగతి ఫలితాల్లో విజ్ఞాన్ విద్యాసంస్థల విద్యార్థులు మరోసారి సత్తాచారు. తమ విద్యార్థి జితేశ్ 493 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచారని పాఠశాల యాజమాన్య తెలిపింది. హనిస్విత 492, ఎస్.మాన్విత, హాసిని, బి.మాన్విత 490 మార్కులు సాధించి తమ ప్రతిభను కనబరిచారని పేర్కొంది. 390 మంది విద్యార్థులు 80 శాతానికి పైగా మార్కులు పొందారని వెల్లడించింది. ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను విజ్ఞాన్ విద్యాసంస్థల వైస్ చైర్‌పర్సన్ రాణి రుద్రమదేవి అభినందించారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రభంజనం

» 498 మార్కులతో ఆలిండియా మొదటి ర్యాంకు

హైదరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ పదోతరగతి ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని శ్రీచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ సీమ తెలిపారు. 498 మార్కులతో తమ విద్యార్థి ఆలిండియా టాపర్‌గా నిలిచారని పేర్కొన్నారు. ఆరుగురు విద్యార్థులు 497 మార్కులు, 10మంది 496 మార్కులు, 26 మంది 495 మార్కులు, 197 మంది 490 మార్కులు, 917 మంది 480 మార్కులు సాధించినట్లు ఆమె వివరించారు. శ్రీచైతన్య బ్రాంచీలలో అధికశాతం బ్రాంచీలు నూరుశాతం ఫలితాలు సాధించాయని తెలిపారు. ఇటీవలే విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లోనూ ఆలిండియా ఓపెన్ కేటగిరిలో శ్రీచైతన్య విద్యార్థులు మొదటి ర్యాంకుతోపాటు వందలోపు 19 ర్యాంకులు సాధించారని డైరెక్టర్ సీమ గుర్తుచేశారు.

సత్తాచాటిన నారాయణ విద్యార్థులు

» అత్యధిక బ్రాంచీలలో వందశాతం ఉత్తీర్ణత

హైదరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు జాతీయస్థాయిలో సత్తా చాటారని ఆ విద్యాసంస్థల డైరెక్టర్లు పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ తెలిపారు. తమ విద్యార్థులు స్పందన, త్రిషా ఘోష్, పార్థ్ బన్సల్ 498 మార్కులు, అధ్రి, యువరాజ్ నితిన్ నాయక్, హరిణి 497 మార్కులు సాధించారని పేర్కొన్నారు. అలాగే 12వ తరగతిలో వాథిన్, రేయాన్ష్ 495 మార్కులు సాధించారని అన్నారు. అత్యధిక బ్రాంచీలలో వందశాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

డాక్టర్ కేకేఆర్ విద్యార్థుల ప్రతిభ

హైదరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ పదోతరగతి ఫలితాల్లో డా. కేకేఆర్ గౌతమ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. తమ విద్యార్థి జె.లక్ష్మి నరసింహ భరద్వాజ్ 490 మార్కులు, ఎం.అక్షయప్రియ, ఆర్.వివేక్ 488 మార్కులు సాధించారని పాఠశాల యాజమాన్యం తెలిపింది. 24 మంది 480కి పైగా మార్కులు, 52 మంది 475 మార్కులు, 81 మంది 470కి పైగా మార్కులు, 165 మంది 460కి పైగా మార్కులు సాధించారని వెల్లడించింది. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ అభినందించారు.

బీఆర్ఎస్ నాయకత్వ బాధ్యతలు..

కేటీఆర్‌కు అప్పగిస్తే స్వాగతిస్తా

కేసీఆర్ నిర్ణయానికి కట్టుబడి ఉంటా.. పార్టీలో విభేదాలు లేవు: హరీశ్‌రావు

హైదరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌లో ఎలాంటి విభేదాలు లేవని, అంతా సోషల్ మీడియా ద్వారా కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారమని ఆ పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. పార్టీ నాయకత్వ బాధ్యతలను కేటీఆర్‌కు అప్పగిస్తే.. స్వాగతించి సహకరిస్తానని చెప్పారు. తమ అధినేత కేసీఆర్ ఏ నిర్ణయం తీసుకున్నా.. శిరసావహిస్తానని, తాను క్రమశిక్షణ కలిగిన కార్యకర్తనని స్పష్టం చేశారు. మంగళవారం తెలంగాణభవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. తనపై వస్తున్న తప్పుడు ప్రచారాలను ఇప్పటికే ఖండించానని, సోషల్ మీడియా దుష్ప్రచారాలపై స్వయంగా డీజీపీకి ఫిర్యాదు చేశానని తెలిపారు. తాను పార్టీ మారతాననే చిల్లర ప్రచారాన్ని ఇప్పటికైనా ఆపాలని హెచ్చరించారు. ఇక సీఎం రేవంత్‌రెడ్డి.. ప్రతిపక్షంపై బురద చల్లబోయి తానే గోతిలో పడ్డారని ఎద్దేవా చేశారు. "ఢిల్లీకి వెళ్తే చెప్పులు ఎత్తుకెళ్తే వారిలా చూస్తున్నారని, ఎవరూ నమ్మి అప్పు ఇవ్వడంలేదని రేవంత్‌రెడ్డి అంటున్నారు. చివరికి పాకిస్థాన్‌ను కూడా నమ్మి అప్పులిస్తున్నారు కానీ, రేవంత్‌రెడ్డిని మాత్రం ఎవరూ నమ్మడంలేదు" అని అన్నారు.

రైతాంగం యుద్ధం చేస్తోంది..

ఓవైపు మన సైన్యం దేశం కోసం సరిహద్దుల్లో యుద్ధం చేస్తుంటే.. కాంగ్రెస్ అసమర్థ పాలన కారణంగా తెలంగాణలోని రైతాంగం తమ పంట అమ్ముకొనేందుకు కొనుగోలు కేంద్రాల్లో యుద్ధం చేస్తోందని హరీశ్‌రావు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి మాత్రం ఇవేమీ పట్టడంలేదని, ఆయన కమాండ్ కంట్రోల్ రూమ్, జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లలో ప్రపంచ సుందరి అందాల పోటీలపై సమీక్షలతో బిజీగా



ఉన్నారని విమర్శించారు. ధాన్యపు రాశుల చుట్టూ తిరగాల్సిన ముఖ్యమంత్రి, ప్రభుత్వ యంత్రాంగం విస్ వరల్డ్ పోటీలంటూ.. అందాల రాశుల చుట్టూ తిరుగుతోందని తప్పుబట్టారు. రైతుల కష్టం తీర్చడానికి ముఖ్యమంత్రికి సమయం లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ యాసంగికి 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొంటామన్న ప్రభుత్వం.. 40 లక్షల మెట్రిక్ టన్నులు కూడా కొనలేదని, కొన్న వడ్లకు రూ.4 వేల కోట్లు బకాయి పడిందని ఆరోపించారు. కొన్న పంటకు రైతుల ఖాతాల్లో పది రోజులైనా డబ్బులు వేయలేదన్నారు. గత కొద్ది నెలలుగా సీఎం సచివాలయం ముఖం చూడటంలేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వాన్ని నడపడమంటే ప్రతిపక్షాలపై దుమ్మెత్తి పోసినంత సులువుకాదని, ఇప్పటికైనా ముఖ్యమంత్రి పాలనపై దృష్టి సారించి రైతుల కష్టాలను తీర్చాలని హితవు పలికారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తమపై విమర్శలకు దిగి రైతుల సమస్యలను పక్కదారి పట్టించడం తగదన్నారు. తడిసిన ప్రతి గింజనూ కొని.. రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని, వారి ప్రాణాలు పోకుండా కాపాడాలని కోరారు. చనిపోయిన రైతుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతుల మరణాలు...

10 కిలోల తరుగు తీస్తున్నారంటూ ములుగు జిల్లా గోవిందరావుపేటలో జెట్టి రాజు అనే రైతు ఆత్మహత్యా యత్నం చేశాడని హరీశ్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో వేసిన తూకం కంటే మిల్లర్లు తక్కువ ధాన్యాన్ని చూపుతూ నష్టం కలిగిస్తున్నా.. ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోవడం లేదన్నారు. ఆన్‌లైన్ ట్రక్‌షీట్ విధానం అమలు చేస్తామన్న ప్రభుత్వం ఇప్పటివరకు చేయలేదని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు లేక రైతులు రోజుల తరబడి ఎండలో ఉంటూ పిట్టల్లా రాలిపోతున్నారని తెలిపారు. మహబూబాబాద్ జిల్లా పోచంపల్లిలో గుగులోతు కిషన్, తొర్రూరు చెర్లపాలెంలో హనుమాండ్ల ప్రేమలత, మదనతుర్తిలో బిర్రు వెంకన్న, జగిత్యాల జిల్లా కథలాపూర్‌లో జలపతిరెడ్డి, సిద్దిపేట జిల్లా ఆకునూరులో చింతకింది హనుమయ్య అనే రైతులు మృతి చెందారని వివరించారు. సర్కారు నిర్లక్ష్య వైఖరే ఇందుకు కారణమని, ఈ మరణాలన్నీ ప్రభుత్వ హత్యలేనని ఆరోపించారు. వీటికి ముఖ్యమంత్రి బాధ్యత వహించాలన్నారు. రైతు సమస్యలపై పోరాడేందుకు బీఆర్ఎస్ త్వరలో కార్యాచరణ ప్రకటించనుందని చెప్పారు.

రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్సలు

» కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, మే 13: రోడ్డు ప్రమాద బాధితులకు నగదు ప్రమేయం లేకుండా చికిత్సలు అందించే పథకాన్ని స్ఫూర్తితో అమలు చేయాలని సుప్రీంకోర్టు మంగళవారం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ పథకం కింద ప్రతి ప్రమాద బాధితుడు గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకు సహాయం పొందడానికి అవకాశం ఉంది. దీని అమలు తీరుపై ఆగస్టులోగా ప్రమాణ పత్రం సమర్పించాలని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం సూచించింది. ఈ పథకం కింద ఎంత మంది లబ్ధి పొందారో వివరించాలని తెలిపింది. ప్రమాద బాధితులకు నగదు తీసుకోకుండానే చికిత్సలు అందించేలా చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు జనవరి 8న ఆదేశించింది. ఆ ఆదేశాల అమలులో జాప్యం జరగడంతో ఏప్రిల్ 28న కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసింది. 2022లో ఆమోదించిన మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 164ఏలో చికిత్సల ప్రస్తావన ఉన్నా ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించింది. దాంతో నగదు రహిత చికిత్సలపై నూతన విధానాన్ని రూపొందించినట్టు ఈ నెల అయిదో తేదీన కేంద్రం సర్వోన్నత న్యాయస్థానానికి తెలిపింది. దీని అమలుపైనే సమాచారం ఇవ్వాలని ప్రస్తుతం ఆదేశించింది.

రైతులపై హరీశ్ కపట ప్రేమ

» ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

హైదరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు రైతులపై కపట ప్రేమ చూపిస్తూ.. ధాన్యం సేకరణపై పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 43 లక్షల టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో సమయానికి పంట కొనుగోళ్లు చేయకపోవడంతో అనేక మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. హరీశ్ వీటన్నింటినీ మరిచి పోయారన్నారు. ముందుగా బీఆర్ఎస్‌లో తన సీటు ఉంటుందో, చిరిగిపోతుందో హరీశ్ చూసుకోవాలన్నారు.

రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయంలో వృద్ధి

» ఏప్రిల్‌లో ఒక శాతం పెరిగిన రాబడి

హైదరాబాద్, మే 13(ఆంధ్రజ్యోతి): కొత్త ఆర్థిక సంవత్సరం తొలి నెలలోనే రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయంలో వృద్ధి సాధించింది. గత ఏప్రిల్‌తో పోల్చితే ఈ ఏప్రిల్‌లో రాబడి ఒక శాతం పెరిగింది. రియల్ ఎస్టేట్‌లో క్రయ విక్రయాలు పెరగడం, డిజిటలైజేషన్ దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఇందుకు కారణమని అధికారులు భావిస్తున్నారు. కొంత కాలంగా స్తబ్ధుగా ఉన్న రియల్ ఎస్టేట్ రంగం ఊపందుకోవడం, ప్రజల్లో కొనుగోలు శక్తి పెరగడంతో రిజిస్ట్రేషన్ల లావాదేవీలు గణనీయంగా పెరిగాయని, ఆర్థిక పురోగతికి ఈ వృద్ధి సంకేతంగా ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. గత ఏడాది ఏప్రిల్‌లో రిజిస్ట్రేషన్ శాఖకు రూ.1,115.22 కోట్ల ఆదాయం రాగా, ఈ ఏప్రిల్‌లో రూ.11.32 కోట్లు అదనంగా వచ్చింది. మరోవైపు, గత ఏప్రిల్‌లో రాష్ట్రవ్యాప్తంగా 1,24,157 దస్తావేజులు రిజిస్టర్ కాగా ఈ ఏడాది ఏప్రిల్‌లో మరో 18,755 డాక్యుమెంట్లు అదనంగా రిజిస్టర్ అయ్యాయి. ఇదే ఒరవడి ముందు కూడా ఉంటుందని జూన్ తర్వాత ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశాలు ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాదికి రిజిస్ట్రేషన్ శాఖ రూ.19,087 కోట్లు ఆర్జించాలని ప్రభుత్వం లక్ష్యం పెట్టింది. గత ఏడాది రూ.18 వేల కోట్లు లక్ష్యంగా నిర్ణయించగా, రూ.14,307 కోట్ల ఆదాయం వచ్చింది.

16 నెలల్లో ఆరుగురు సీఈవోలు!

ఆరోగ్యశ్రీకి ప్రస్తుతం ఇన్‌చార్జి కూడా లేరు.. సీఈవో లేక ఆగిన 1300 మంది వేతనాలు

» ఆస్పత్రులకు చెల్లింపులూ నిలిచిపోయాయ్

» సీఈవో పోస్టుపై ఆసక్తి చూపని ఐఏఎస్‌లు?

హైదరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్టు ప్రధాన కార్యనిర్వహణ అధికారి (సీఈవో) పోస్టు ఖాళీగా ఉంది. ఇన్‌చార్జి బాధ్యతలు కూడా ఎవరికీ అప్పగించలేదు. దీంతో ఆరోగ్యశ్రీ ట్రస్టు రోజువారీ కార్యకలాపాలు స్తంభించిపోయాయి. సిబ్బంది వేతనాలతో పాటు ఆరోగ్యశ్రీ అనుసంధాన ఆస్పత్రులకు చెల్లింపుల దాకా అన్నీ నిలిచిపోయాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 16 నెలల్లో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవోలుగా ఆరుగురు ఐఏఎస్ అధికారులు ఇలా వచ్చి, అలా వెళ్లిపోవడం గమనార్హం! ఇటీవల జరిగిన ఐఏఎస్‌ల బదిలీల్లో ఇన్‌చార్జి సీఈవో కర్ణన్‌ను మార్చి, ఆయన స్థానంలో మరో ఐఏఎస్ అధికారి సంగీతా సత్యనారాయణకు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగిస్తూ సర్కారు జీవో జారీ చేసింది. అయితే కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ (డీవోపీటీ) శిక్షణ నిమిత్తం ఆమె ఢిల్లీ వెళ్లారు. సంగీతకు వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ పోస్టుతో పాటు ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవోగా కూడా అదనపు బాధ్యతలు అప్పగించింది. కానీ, కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న వెంటనే ఆమె డీవోపీటీ శిక్షణకు వెళ్లిపోయారు. ఆరోగ్యశ్రీ బాధ్యతలు తీసుకోనే లేదు. జూన్ 13 వరకు సెలవు పెట్టడంతో కమిషనర్‌గా అదనపు బాధ్యతలను కూడా ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తుకి అప్పగిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఆరోగ్యశ్రీ సీఈవో బాధ్యతలను ఎవరికీ అప్పగించలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి ఆరోగ్యశ్రీ సీఈవోగా భారత తపాలా సర్వీసుల అధికారిణి విశాలచ్చి ఉన్నారు. తర్వాత ఆమె బదిలీ అయ్యారు. దాంతో ట్రస్టు అదనపు బాధ్యతలను కొద్ది రోజుల పాటు ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చూశారు. అనంతరం సర్కారు ఐఏఎస్ అధికారి కర్ణన్‌కు ఆ బాధ్యతలను అప్పగించింది. ఆయన్ను బదిలీ చేసి.. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు కేటాయించిన ఐఏఎస్‌ల్లో ఒకరైన శివశంకర్‌కు సీఈవోగా పోస్టింగ్ ఇచ్చింది. అయితే ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్తల నియామకాల్లో జరిగిన అవకతవకల నేపథ్యంలో ఆయనపై సర్కారు వేటు వేసింది. ఆ తర్వాత ఇన్‌చార్జి బాధ్యతలను కర్ణన్‌కు అప్పగించింది. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో మళ్లీ కర్ణన్‌కు ఉన్న అదనపు బాధ్యతలను తప్పించి, సంగీతా సత్యనారాయణకు అప్పగించింది. ఇలా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు మొత్తం ఆరుగురు అధికారులు మారారు. ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవోగా పనిచేసేందుకు ఐఏఎస్ అధికారులు ఇష్టపడడం లేదని సమాచారం. బదిలీపై వచ్చిన ఒక అధికారి అయితే చాలారోజుల పాటు బాధ్యతలే తీసుకోలేదు. మరో అధికారి అసలు బాధ్యతలు తీసుకోకుండానే సెలవుపై వెళ్లిపోయారు. దీంతో ఆ పోస్టుపై ఎవరికీ ఆసక్తి లేదన్న చర్చ వైద్యవర్గాల్లో నడుస్తోంది.

నిలిచిన వేతనాలు, చెల్లింపులు..

ఆరోగ్యశ్రీ ట్రస్టు పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1300 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రస్తుతం సీఈవో లేకపోవడంతో వారి జీతాలు నిలిచిపోయాయి. అలాగే ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు ప్రతినెలా కనీసం రూ.90-100కోట్ల బిల్లులు చెల్లిస్తుండగా.. ప్రస్తుతం ఇవీ నిలిచిపోయినట్లు ఆరోగ్యశ్రీ అనుసంధాన ప్రైవేటు ఆస్పత్రుల వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వం అన్ని ప్రాంతాల్లో ఆరోగ్యశ్రీ సేవలందించాలనే లక్ష్యంతో మండల, నియోజకవర్గ కేంద్రాల్లో 50పడకలు దాటిన ప్రైవేటు ఆస్పత్రులకూ అనుసంధానమయ్యే అవకాశాన్ని కల్పించింది. పెద్ద సంఖ్యలో ఆస్పత్రులు దరఖాస్తు చేసుకున్నాయి. ప్రస్తుతం ఆ ప్రక్రియ కూడా నిలిచిపోయింది.

ఉద్యోగులను దోషులుగా నిలబెట్టొద్దు!

ప్రభుత్వ ప్రకటన అలాంటి సంకేతమే ఇచ్చింది.. బోనస్‌లు, అదనపు భత్యాలు, వేతనాల పెంపు అడగట్లేదు

» రావాల్సిన బకాయిలనే అడుగుతున్నాం

» మీడియాతో ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులు

హైదరాబాద్/పంజాగుట్ట, మే13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేసిన ప్రకటన.. ఉద్యోగులను ప్రజల ముందు దోషులుగా చూపేలా ఉందని ఉద్యోగ సంఘాల ఐకాస ఆరోపించింది. తాము బోనస్‌లు, అదనపు భత్యాలు, జీతాలు పెంచాలని కోరడం లేదని.. పెరిగిన ధరలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా డీఏలు ప్రకటించాలని కోరింది. 5 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, ఇంకో నెల గడిస్తే ఆరో డీఏ కూడా వస్తుందని గుర్తుచేసింది. నాంపల్లిలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఐకాస చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాస్‌రావు మాట్లాడారు. ప్రజాప్రయోజనాల విషయంలో ప్రభుత్వాలకు అండగా ఉంటూనే.. ఉద్యోగుల హక్కుల విషయంలో పోరాటం చేస్తామన్నారు. ఈ ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడిచిందని, ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకొనే సంయమనం పాటిస్తున్నామని చెప్పారు. తప్పనిసరి పరిస్థితుల్లోనే ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నామన్నారు. తమ 57 డిమాండ్లపై అధ్యయనానికి అధికారుల కమిటీని ఏర్పాటు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మారం జగదీశ్వర్, ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులు

చేసినందుకు సీఎం రేవంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 47 ఆర్థికేతర సమస్యలు, పెండింగ్‌లో ఉన్న రూ.10 వేల కోట్ల బిల్లుల చెల్లింపు, 5 డీఏలు, పీఆర్సీ నివేదిక అమలు, ఉద్యోగులకు ఆరోగ్య పథకం, జీవో 317 బాధితులకు బదిలీల్లో అవకాశం కల్పించడంపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశంలో 5 తీర్మానాలు చేశామని, వాటిని మంత్రివర్గ ఉపసంఘానికి, అధికారుల కమిటీకి అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వం అధికారుల కమిటీని నియమించినందున 15న నిర్వహించ తలపెట్టిన నిరసనను వాయిదా వేసినట్లు చెప్పారు. కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా తక్షణమే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తీర్మానించినట్లు చెప్పారు. మాజీ ఉద్యోగ సంఘాల నేతలు, ఉద్యోగుల సమన్వయ కమిటీల పేరుతో ప్రెస్‌మీట్లలో మాట్లాడేటప్పుడు ఉద్యోగుల పక్షపాతులుగా వ్యవహరిస్తే బాగుంటుందని.. ప్రభుత్వానికి, ఉద్యోగ సంఘాలకు మధ్య చిచ్చుపెట్టేలా వ్యవహరించవద్దని కోరారు.

వైషమ్యాలు పెంచడం సరికాదు

ఉద్యోగులు, పింఛనుదారుల సమస్యలను పరిష్కరించాలని, బకాయిలు వెంటనే చెల్లించాలని తెలంగాణ ఉద్యోగులు, పింఛనుదారుల సమన్వయ కమిటీ డిమాండ్ చేసింది. ఉద్యోగులకు, ప్రజలకు మధ్య సీఎం వైషమ్యాలు పెంచడం సరికాదంది. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యోగులపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా, ఉద్యోగ సంఘాలను పిలిచి మాట్లాడాలని సూచించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిటీ సభ్యులు, ఉద్యోగ సంఘాల నాయకులు, మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్సీలు స్వామిగౌడ్, సుధాకర్‌రెడ్డి, సి.విఠల్, రాజేందర్, రవీందర్‌రెడ్డి, సుమిత్ర తదితరులు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి మాటలు ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. కమిటీల పేరుతో కాలయాపన వద్దని సూచించారు. ఉద్యోగులకు ధర్నా, నిరసన, సమ్మె చేసే హక్కు ఉంటుందని తెలిపారు. సోనియా మీద కేసు పెడితే టీపీసీసీ అధ్యక్షుడు, మంత్రులు రోడ్లపైకి వచ్చి ఎందుకు ధర్నా చేశారని ప్రశ్నించారు. ఉద్యోగులను చులకనగా చూస్తే సహించబోమని హెచ్చరించారు. త్వరలో గవర్నర్, సీఎం, మంత్రులు, సీఎస్‌ను కలుస్తామని.. పార్టీల నాయకులను కలిసి ఉద్యమిస్తామని చెప్పారు. తమ వెనక ఏ పార్టీ లేదని.. ఉద్యోగ సంఘాలను దోషులుగా నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.


నార్సింగ్ వీధుల్లో పడుకున్న కొమురయ్య, లక్ష్మమ్మ దంపతులు

ఇల్లు పిల్లల పాలు.. కన్నవాళ్లు రోడ్లపాలు!

నార్సింగ్, మే 13 (ఆంధ్రజ్యోతి): నవమాసాలు మోసి పెంచి పెద్ద చేశారు. కష్టపడి కూడబెట్టిన ఆస్తులిచ్చి పెళ్లిళ్లు చేశారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రుల ఆలనాపాలనా చూడాల్సిన సంతానం వారిని రోడ్డుపాలు చేసింది. దీంతో వారు రోడ్లపైనే కాలం వెళ్లదీయాల్సిన దుస్థితి నెలకొంది. నార్సింగ్ గ్రామానికి చెందిన కొమురయ్య, లక్ష్మమ్మ దంపతులకు ముగ్గురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. నార్సింగ్‌లో సొంత ఇంటిని పిల్లలంతా కలసి అమ్మేసి డబ్బులు పంచుకుని, తల్లిదండ్రులను ఇంట్లో నుంచి బయటకు గెంటివేశారని స్థానికులు పేర్కొన్నారు. దీంతో రెండ్రోజులుగా వీరిద్దరూ ఫుట్‌పాత్‌పైనే పడుకుంటున్నారు. గుడి దగ్గర అడుక్కుని తినాల్సిన దుస్థితి ఏర్పడిందని, ఫోన్లుచేస్తే ఎవరూ స్పందించడం లేదని లక్ష్మమ్మ వాపోయారు. వారి దుర్భర పరిస్థితిని ఫొటోలు, వీడియోల రూపంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పలు వాట్సప్ గ్రూప్‌లలో పోస్టు చేశారు. వారికి తగిన న్యాయం చేయాలని మాజీ కౌన్సిలర్ ఉషారాణి నార్సింగ్ ఆర్డీవోకి ఫిర్యాదును అందజేశారు.

అంతర్గత నిర్వాసితులు గతేడాదే అధికం

» ఐడీఎంసీ నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ, మే 13: వరదలు, తుఫాన్‌లు, ఇతర వైపరీత్యాల కారణంగా భారత్‌లో నిర్వాసితులైన వారి సంఖ్య గతేడాదే అధికంగా ఉంది. మొత్తం 50.4 లక్షల మంది నిర్వాసితులయ్యారు. 12 ఏళ్ల గణాంకాలను అధ్యయనం చేస్తే 2024లోనే నిర్వాసితుల సంఖ్య అధికంగా ఉన్నట్టు తేలింది. జెనీవాలోని అంతర్గత నిర్వాసితుల పర్యవేక్షణ కేంద్రం (ఇంటర్నల్ డిస్‌ప్లేస్‌మెంట్ సెంటర్-ఐడీఎంసీ) నివేదికలో ఈ విషయం వెల్లడైంది. హింస కారణంగా నిర్వాసితులైన ఘటనలు 2023లో 1,700 నమోదు కాగా, 2024లో వాటి సంఖ్య 1,000కి తగ్గింది. మణిపూర్‌లోని అల్లర్లే ఇంతటి భారీ సంఖ్యకు కారణం. వరదలతో 2024లో అస్సాంలో 20.5 లక్షల మంది నిర్వాసితులయ్యారు. త్రిపురలో 40 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా భారీ వర్షాలు కురవడంతో 2వేల ప్రదేశాల్లోని ప్రజలను ఖాళీ చేయాల్సి వచ్చిం ది. ప్రకృతి వైపరీత్యాలు, అల్లర్ల ప్రభావం ఈశాన్య రాష్ట్రాల్లో అధికంగా కనిపించింది.

ఆధారాలు సమర్పించేందుకు మరికొంత సమయం ఇవ్వండి

» వామనరావు దంపతుల హత్య కేసులో సుప్రీంకోర్టుకు తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి

» తదుపరి విచారణ ఆగస్టు 12కు వాయిదా

న్యూఢిల్లీ, మే 13 (ఆంధ్రజ్యోతి): న్యాయవాద దంపతులు గట్టు వామనరావు, నాగమణిల హత్య కేసుకు సంబంధించిన ఆధారాలు సమర్పించేందుకు మరికొంత సమయం కావాలని సుప్రీంకోర్టుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. పెద్దపల్లి జిల్లా మంథనిలో 2021 ఫిబ్రవరి 17న జరిగిన న్యాయవాది గట్టు వామనరావు దంపతుల హత్య కేసు దర్యాప్తును సీబీఐకి ఇవ్వాలని కోరుతూ ఆయన తండ్రి గట్టు కిషన్‌రావు 2021 సెప్టెంబర్ 18న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గత ప్రభుత్వం ఉన్నప్పుడు బీఆర్ఎస్ నేత పుట్ట మధుకర్ ప్రమేయంతోనే హత్య జరిగిందని, సీబీఐ విచారణ జరిగితే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి సుదీర్ఘకాలంగా వాదనలు వినిపిస్తున్నారు. విచారణను సీబీఐకి అప్పగించడంలో తమకు ఎలాంటి అభ్యంతరం లేదని కాంగ్రెస్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. న్యాయస్థానం ఆదేశిస్తే విచారణకు తాము సిద్ధమేనని సీబీఐ సైతం అంగీకరించింది. దీంతో ఆధారాలన్నీ సమర్పిస్తే, పరిశీలించి కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించడంపై నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆ కేసు మంగళవారం జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ రాజేష్ బిందాల్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. కేసుకు సంబంధించిన వీడియో రికార్డింగ్ ఆధారాలను సమర్పించడానికి తమకు మరో అవకాశం కావాలని తెలంగాణ ప్రభుత్వం తరఫున న్యాయవాది విజ్ఞప్తి చేశారు. ఇదే చివరి అవకాశమని, మరోసారి సమయం ఇచ్చేదిలేదని జస్టిస్ సుందరేశ్ స్పష్టం చేశారు. ఇరుపక్షాల వాదనల అనంతరం ఈ కేసును ధర్మాసనం ఆగస్టు 12కు వాయిదా వేసింది.

అటవీ హక్కులపై జూన్‌లో అవగాహన కార్యక్రమాలు

» నెలంతా నిర్వహించాలని రాష్ట్రాలకు కేంద్రం ఆదేశం

న్యూఢిల్లీ, మే13: అటవీ హక్కుల చట్టం (ఎఫ్ఆర్ఏ)పై అవగాహన కలిగించేందుకు జూన్ 1 నుంచి నెలంతా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలను ఆదేశించింది. ఈ కార్యక్రమాల్లో గిరిజనులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొనేలా చూడాలని సూచించింది. అటవీ హక్కుల చట్టం అమలులో గ్రామసభల పాత్ర, పరిహారాలు పొందే విధానం, పట్టాల పంపిణీ, భూసార కార్డులు, పీఎం కిసాన్, ఆధార్ కార్డులు తదితర అంశాలపై అవగాహన కలిగించాలని పేర్కొంది. జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ, ఇతర శాఖల అధికార్లతో సమన్వయం చేసుకోవాలని తెలిపింది.

అప్పులు తీర్చలేక అన్నదాత ఆత్మహత్య

వీణవంక, మే 13 (ఆంధ్రజ్యోతి): సాగు కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఓ రైతు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలోని ఘన్ముక్ల గ్రామానికి చెందిన కట్కూరి సరేందర్‌రెడ్డి (53) ఐదెకరాల్లో పంట సాగు చేశాడు. పెట్టుబడి కోసం రూ. 8లక్షల వరకు అప్పు చేశాడు. దిగుబడి సరిగా రాకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలనే మనోవేదనతో మంగళవారం పురుగు మందు తాగాడు. వెంటనే కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

చనిపోయినా.. మూడేళ్లుగా పెన్షన్!

» నెలనెలా మృతుడి ఖాతాకు ఆసరా డబ్బులు

» ప్రస్తుతం బ్యాంకు ఖాతాలో రూ.71,337

రెజిమెంటల్‌బజార్, మే 13(ఆంధ్రజ్యోతి): ఆ వృద్ధుడు చనిపోయి మూడేళ్లవుతున్నా.. ఆసరా పథకం పెన్షన్ డబ్బులు ఇంకా బ్యాంకు ఖాతాలో జమ అవుతూనే ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శంగా ఉన్న ఈ ఉదంతం వివరాలు ఇలా వున్నాయి. హైదరాబాద్ రెజిమెంటల్ బజార్‌కు చెందిన అరుణ్ అంథోని ఆసరా పెన్షన్ లబ్ధిదారుడు. అతనికి కుటుంబ సభ్యులు లేక పోవడంతో ఒంటరిగా ఉంటూ రాష్ట్ర ప్రభుత్వం అందించే ఆసరా పెన్షన్‌తో జీవనం సాగించేవాడు. అతనికి ఫోన్ కూడా లేక పోవడంతో ఇంటి దగ్గర ఉన్న గౌరీశంకర్ అనే వ్యక్తికి చెందిన ఫోన్ నెంబరును బ్యాంకులో ఇచ్చాడు. అయితే, అరుణ్ అనారోగ్యంతో మూడేళ్ల క్రితం మృతి చెందాడు. అయినా నెలనెలా పెన్షన్ రూ.2016 లు సెబాస్టియన్ రోడ్డులోని యూనియన్ బ్యాంకులోని అతని ఖాతాకు జమ అవుతున్నాయి. ప్రస్తుతం అతని బ్యాంకు అకౌంట్‌లో రూ.71,337 బ్యాలెన్స్ ఉంది. ఈ విషయాన్ని గౌరీశంకర్.. బ్యాంకు అధికారులకు తెలియజేసినా ప్రయోజనం లేకపోయింది. ఈ విషయమై బ్యాంకు మేనేజర్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. పెన్షన్‌కు సంబంధించిన విషయాలు తమ పరిధిలోకి రావని, పెన్షన్ అందజేసే అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే వారే చర్యలు తీసుకుంటారని చెప్పారు.

దుబాయ్ జైల్లోని మా కుమారుడిని విడిపించండి

» ప్రజావాణిలో జగిత్యాల వాసుల వినతి

బేగంపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లి, అనుకోకుండా జైలుపాలైన తమ కుమారుడిని రక్షించాలని బాధితుడి తల్లిదండ్రులు ప్రజావాణిలో విజ్ఞప్తి చేశారు. జగిత్యాల జిల్లా పెగడపెల్లి మండలం ఎల్లాపూర్ గ్రామానికి చెందిన మల్లారపు మధుకర్(27) ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. అతడి బ్యాంక్ ఖాతాను మరొకరు దుర్వినియోగం చేసి లావాదేవీలు జరిపినందున అజ్మాన్‌లోని కోర్టు మధుకర్‌పై ప్రయాణ నిషేధం(ట్రావెల్ బ్యాన్) విధించింది. భారత్‌కు వచ్చేందుకు ప్రయత్నించిన అతడిని పోలీసులు అరెస్టు చేశారు. దీంతో మధుకర్ తల్లిదండ్రులు మల్లవ్వ, అంజయ్య మంగళవారం బేగంపేటలోని ప్రజాభవన్‌కు వచ్చారు. అక్కడ ఎన్నారై అడ్వైజరీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి వారికి సహకరించారు. బాధితులను ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డికి పరిచయంచేసి, అవసరమైన సహాయం చేయాలని కోరారు. మధుకర్‌కు కాన్సులర్ సహాయంతో తెలంగాణకు రప్పించాలని అతడి తల్లిదండ్రులు అభ్యర్థించారు. ఢిల్లీలోని భారత విదేశాంగ శాఖతో పాటు దుబాయ్‌లోని భారత రాయబార కార్యాలయంతో సమన్వయం చేసి తమ కుమారుడిని ఆదుకోవాలని కోరారు. సీఎంవో ద్వారా సమస్య పరిష్కారానికి చర్యలను తీసుకుంటామని చిన్నారెడ్డి వారికి భరోసా ఇచ్చారు.

మృతదేహాలు కొంటాం!

(మొదటి పేజీ తరువాయి)



దగ్గరగా ఉండే ఓ కొత్త మెడికల్ కాలేజీ తమకు 15 డెడ్‌బాడీలు కావాలని ప్రభుత్వానికి లేఖ రాసింది. సర్కారు దాన్ని తిరస్కరించింది. ఇలాంటి మెడికల్ కాలేజీలు దొడ్డిదారిన డెడ్‌బాడీలు కొనుక్కుంటున్నట్లు వైద్య వర్గాలు వెల్లడించాయి. కాగా, జాతీయ వైద్య కమిషన్ నిబంధనల మేరకు ప్రతి వైద్య కళాశాలో ఉండే ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య ఆధారంగా అనాటమీ విభాగానికి మృతదేహాలు కావాల్సివుంటుంది. ప్రతి 25 సీట్లకు ఒక మృతదేహం అవసరం. అంటే 250 సీట్లుండే ఒక మెడికల్ కాలేజీకి ఏడాదికి సగటున 10 శవాలు కావాలి. వైద్యవిద్యార్థులు ఎంబీబీఎస్‌లో చేరిన మొదటి సంవత్సరంలోనే అనాటమీ ఒక సబ్జెక్టుగా ఉంటుంది. వైద్య విద్య బోధనలో భాగంగా మృతదేహాలను కోసి.. శరీర నిర్మాణం గురించి విద్యార్థులకు చెబుతారు. అనంతరం ఆ కోసిన శవాలను ప్రత్యేక రసాయనాలతో నింపిన ఫార్మలిన్ ట్యాంకులలో భద్రపరుస్తారు. అలా ఒక శవాన్ని ఒక్కో భాగాన్ని కోసి విద్యార్థులకు శరీర నిర్మాణం గురించి వివరిస్తారు. దాంతో మెడికోలకు మానవ శరీరంపై అనుభవపూర్వకమైన జ్ఞానం వస్తుంది.

శవాలు లేకుండానే పాఠాలు

సాధారణంగా మెడికల్ కాలేజీలకు డోనేషన్ ద్వారా వచ్చిన శవాలనే తీసుకొని, వాటిని డిసెక్షన్ చేయాలి. అన్ క్లెయిమ్డ్ బాడీస్‌ను వైద్య పరిశోధనల కోసం వినియోగించకూడదన్న నైతిక నియమం ఉంది. ఈ కారణంతో ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే అన్‌క్లెయిమ్డ్ బాడీస్‌ను వినియోగించుకునే పరిస్థితి లేకపోవడం, కొత్త మెడికల్ కాలేజీ సంఖ్య పెరగడంతో గత బీఆర్ఎస్ సర్కారు ఒక ఉత్తర్వు తీసుకొచ్చింది అన్‌క్లెయిమ్డ్ బాడీస్ గురించి నిర్ణీత సమయంలో ఎవ్వరూ రాకుంటే వాటిని మెడికల్ కాలేజీల కోసం వినియోగించుకోవచ్చన్నది ఆ జీవో సారాంశం. దాంతో ప్రభుత్వ వైద్య కళాశాలలకు ప్రస్తుతం డెడ్ బాడీస్ కొరత పెద్దగా లేదనే చెప్పాలి. ఇటీవల కాలంలో మృతదేహాల దానం చేసే వారి సంఖ్య కూడా పెరిగింది. ఇక ప్రైవేటు వైద్య కళాశాలల అనుబంధ ఆస్పత్రులకు ప్రమాదవశాత్తు అక్కడ చేరి మరణించే కేసులు తక్కువగా ఉంటున్నాయి. ఒకవేళ వచ్చినా.. వాటిని పోస్టుమార్టం నిమిత్తం మళ్లీ ప్రభుత్వ ఆస్పత్రులకే పంపుతారు. ఇలా ప్రైవేటులో శవాలు అందుబాటులో లేక వైద్యవిద్యార్థులు మానవ శరీర నిర్మాణం గురించి నేర్చుకోలేకపోతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోని మార్చురీల్లో ఉండే అన్‌క్లెయిమ్డ్ బాడీస్‌ను ఒక్కోదానికి రూ.60 వేల చొప్పున చెల్లిస్తే వైద్య పరిశోధనల నిమిత్తం ప్రైవేటు వైద్య కళాశాలలకు అమ్ముకోవచ్చన్న జీవో ఒకటి ఉంది. ఆ జీవో ఆధారంగా ఇటీవల కొన్ని ప్రైవేటు వైద్య కళాశాలలు శవాలు కావాలని వైద్యవిద్య సంచాలకులకు దరఖాస్తు చేసుకున్నాయి.

రబ్బరు బొమ్మలతో...

కొన్ని మెడికల్ కాలేజీలు ఇతర దేశాల్లో మాదిరిగా రబ్బరు బొమ్మలను తీసుకువచ్చి విద్యార్థులకు అనాటమీ పాఠాలు బోధిస్తున్నాయి. శరీర నిర్మాణం గురించి తెలిస్తేనే మానవ దేహం, రోగాలపై అవగాహన ఉంటుందని, రబ్బరు బొమ్మలపై అంత లోతైన అవగాహన రాదని నిపుణులు చెబుతున్నారు.

చెరువు భూమిని క్రమబద్ధీకరించే అధికారం ప్రభుత్వానికి లేదు

» తుది నోటిఫికేషన్‌కు ముందు బాధితుల వాదన వినండి : హైకోర్టు

హైదరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) పరిధిలోని భూములను ఎవరైనా ఆక్రమించుకుంటే దాన్ని క్రమబద్ధీకరించే అధికారం ప్రభుత్వానికి కూడా లేదని హైకోర్టు స్పష్టం చేసింది. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ సరిహద్దులు గుర్తిస్తూ తుది నోటిఫికేషన్ ఇవ్వడానికి ముందు ఎదుటి పక్షం వాదనలు వినాలని తెలిపింది. సరిహద్దు లోపల ఉన్న భూమిపై హక్కులు క్లెయిం చేసే వారి వాదన వినాలని, టైటిల్ పత్రాలు పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని హైడ్రా, రెవెన్యూ, నీటిపారుదలశాఖల అధికారులకు తెలిపింది. రంగారెడ్డి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం బాచుపల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 175, 171లో పది ఎకరాల భూమిని ఓ కోర్టు ప్రొసీడింగ్స్‌లో జారీ అయిన ఆర్బిట్రేషన్ అవార్డు ద్వారా కూకట్‌పల్లికి చెందిన శ్రీసాయి కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ కొనుగోలు చేసింది. ఆ భూమిలో కొంతభాగం స్థానిక అంబీర్ చెరువులో భాగంగా ఉందని గుర్తిస్తూ అధికారులు ప్రాథమిక నోటిఫికేషన్ జారీచేశారు. ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చే ముందు తమకు నోటీసు ఇవ్వలేదని.. తమ వాదన వినకుండా ఏకపక్షంగా వ్యవహరించారని పేర్కొంటూ ఆ సొసైటీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం.. ఈ హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశాలతోనే అధికారులు చెరువుల హద్దులు గుర్తించే పనిచేపట్టారని తెలిపింది. అయితే హద్దులు గుర్తించే క్రమంలో నిజమైన పట్టాదారుల హక్కులకు భంగం కలగకుండా వాదనలు వినాల్సి ఉందని తెలిపింది. ఆక్రమణల తొలగింపులో మాత్రం ఎవరినీ ఉపేక్షించే అవసరం లేదని పేర్కొంది. ట్యాంక్ బెడ్, బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ భూములను రెగ్యులరైజ్ చేసే అధికార ప్రభుత్వానికి సైతం లేదని స్పష్టంచేసింది. ఈ కేసులో పిటిషనర్ వాదన విని, టైటిల్ పత్రాలు పరిశీలించి తగిన ఉత్తర్వులు జారీచేయాలని పేర్కొంది.

అమెరికాలో నల్లగొండ విద్యార్థిని మృతి

» అగ్రికల్చర్ ఎమ్మెస్సీ చదివి ఉద్యోగ వేటలో నిమగ్నం

» అస్వస్థతకు గురైన ప్రియాంక

» బీమా లేక వైద్యం ఆలస్యం

» బ్రెయిన్‌డెడ్‌తో మృత్యువాత


ప్రియాంక (ఫైల్)

కట్టంగూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో ఉన్నత విద్య పూర్తి చేసిన ఓ యువతి.. ఉద్యోగ కల సాకారమయ్యే వేళ అనారోగ్యంతో కన్నుమూసింది. దీంతో కూతురి భవిష్యత్తుపై ఆశలు పెట్టుకున్న ఆమె తల్లిదండ్రులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం పందెనపల్లికి చెందిన కొండి వెంకట్‌రెడ్డి, శోభారాణి దంపతులకు కుమారుడు, కుమార్తె ప్రియాంక(26) ఉన్నారు. ప్రియాంక ఢిల్లీలో అగ్రికల్చర్ బీఎస్సీ పూర్తి చేసి, 2023 జనవరిలో అమెరికాలోని అలబామా యూనివర్సిటీలో ఎమ్మెస్సీలో చేరింది. పీజీ పూర్తి చేసి, పార్ట్ టైం వర్క్ చేస్తూ ఉద్యోగయత్నాల్లో ఉంది. ఈ నెల 4న తండ్రి వెంకట్‌రెడ్డి ప్రియాంకకు ఫోన్ చేయగా, దంత సంబంధిత అనారోగ్యంతో 3 రోజులుగా అస్వస్థతగా ఉందని తెలిపింది. ఇన్సూరెన్స్ లేకపోవడంతో చికిత్స కోసం ఎక్కువ వ్యయం అయిందని, ఇన్సూరెన్స్‌కు దరఖాస్తు చేశానని పేర్కొంది. మరుసటి రోజే ఇన్సూరెన్స్ అప్రూవల్ కాపీని తీసుకుని ఆసుపత్రికి వెళ్లింది. పరీక్షించిన వైద్యులు ఆమెకు బ్లడ్ ఇన్‌ఫెక్షన్ ఉందని ఆసుపత్రిలో చేరాలని సూచించారు. అనుకోకుండా ఆసుపత్రికి వచ్చానని, తర్వాత మళ్లీ వస్తానని ఆమె వెళ్లిపోయింది. భారత కాలమానం ప్రకారం ఈ నెల 6న స్నానం చేసేందుకు వెళ్లిన ప్రియాంక బాత్రూంలో పడిపోయింది. స్నేహితులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా సమీపంలోని సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న ప్రియాంకను పరిశీలించిన వైద్యులు ఆమె బ్రెయిన్ డెడ్ అయిందని నిర్ధారించారు. వెంటిలేటర్ అమర్చి ఒక రోజు వైద్యం అందించారు. తల్లిదండ్రులు, ప్రియాంక బంధువులతో ఫోన్‌లో మాట్లాడిన అనంతరం వెంటిలేటర్ తీసివేయడంతో ప్రియాంక ఈ నెల 8న మృతిచెందింది. బుధవారం ఆమె మృతదేహం హైదరాబాద్‌కు చేరుకోనుంది.

బెట్టింగ్ యాప్ కేసుల మూలాల్లోకి సిట్

» పలు దేశాలకు లేఖలు

హైదరాబాద్, మే 13(ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్ కేసుల దర్యాప్తులో భాగంగా సిట్ అధికారులు.. ఆయా బెట్టింగ్ కంపెనీల మూలాలపై దృష్టి సారించారు. బెట్టింగ్ కంపెనీలు విదేశాల నుంచి తమ కార్యకలాపాలు నిర్వహిస్తుండడంతో ఆయా దేశాలకు సిట్ అధికారులు లేఖలు రాశారు. రాష్ట్రంలో నమోదైన బెట్టింగ్ యాప్ కేసుల్లోంచి సిట్ అధికారులు నాలుగు కేసులను ఎంపిక చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఆయా సంస్థల మూలాలపై దృష్టి సారించారు. ఏ చట్టాల ప్రకారం ఆ యాప్‌లను నిర్వాహకులు నిర్వహిస్తున్నారు ? డబ్బు బదిలీ ఏ విధంగా జరిగింది? సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్లకు డబ్బు ఏ విధంగా చెల్లించారు? వారి మధ్య జరిగిన ఒప్పందాల్లో ఏముంది ? అనధికారికంగా డబ్బు చలామణి జరిగిందా? అనే కోణాలపై సిట్ అధికారులు దృష్టి సారించారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌పై తెలంగాణలో నిషేధం ఉన్నప్పటికీ... సదరు యాప్‌లు రాష్ట్రంలో ఎలా పని చేశాయి అనే అంశంపై కూడా సిట్ సమాచారం సేకరిస్తోంది. మరోపక్క ఆన్‌లైన్ క్రికెట్, రమ్మీ.. స్కిల్ గేమ్స్ అని, అవి మేధస్సు ఉపయోగించి ఆడుతున్నారని, రమ్మీ స్కిల్ గేమ్ అని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును చూపెట్టి ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులు న్యాయపరమైన ఊరట పొందడంతో పాటు సిట్ దర్యాప్తును అడ్డుకోవడానికి పావులు కదుపుతున్నట్లు సమాచారం. బెట్టింగ్ యాప్‌ల దందాను అడ్డుకోవాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి కార్యచరణ అవసరమని సీనియర్ పోలీసు అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌పై దేశంలోని ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా నిబంధనలు ఉన్నాయని, దేశవ్యాప్తంగా ఒకటే విధానం ఉంటేనే ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను కట్టడి చేయడం సులభం అవుతుందని అంటున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కక్ష – శిక్ష

బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యం నిలబడాలని, ప్రజలు తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని అక్కడి తాత్కాలిక ప్రభుత్వాధినేతకు ఏ మాత్రం ఉన్నా, మాజీ ప్రధాని షేక్‌హసీనా పార్టీని రద్దుచేయాలన్న నిర్ణయం తీసుకొనేవారు కాదు. ఆమెను నియంత అంటున్నప్పుడు అదేరీతిలో వ్యవహరించేవారు కాదు. షేక్ హసీనా నాయకత్వంలోని అవామీలీగ్ పార్టీని నిషేధిస్తూ సోమవారం బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. 2009 నాటి ఉగ్రవాద వ్యతిరేక చట్టంలో, ఈ పార్టీ రద్దుకు అవకాశమిచ్చే వెసులుబాట్లు లేవు కనుక, దానిని సవరించి మరీ మహ్మద్ యూనిస్ ప్రభుత్వం ఈ చర్యకు ఒడిగట్టింది. అవామీలీగ్, దాని అనుబంధ, సోదర సంస్థలన్నింటినీ నిషేధించడానికి వీలుగా ఆ సవరణను తయారుచేసుకుంది. అవామీలీగ్, దాని నాయకులందరిపైనా ప్రత్యేక ట్రిబ్యునల్ ఎలాగూ విచారణ జరుపుతోంది. ఆ విచారణ పూర్తయ్యేవరకూ నిషేధం అమలులో ఉంటుందట.

ఒక ఆర్డినెన్సుద్వారా రాత్రికి రాత్రి ఉగ్రవాద వ్యతిరేక చట్టాన్ని సవరించి, వెనువెంటనే హసీనా పార్టీమీద వేటువేయడం గమనించినప్పుడు అక్కడి తాత్కాలిక ప్రభుత్వం కక్షసాధింపులో హసీనాను మించిపోతోందని అర్థమవుతోంది. హసీనా దేశం విడిచిపోగానే గృహనిర్బంధం నుంచి బయటకు వచ్చిన ఆమె రాజకీయ ప్రత్యర్థి ఖలీదాజియా విదేశాల్లో ఖరీదైన చికిత్సలన్నీ చేయించుకొని ఇటీవలే దేశంలో తిరిగి కాలూనారు. సంపూర్ణ ఆరోగ్యవంతురాలిగా ఆమె రాకడ, హసీనా పార్టీమీద నిషేధం ఒకేసారి జరగడం కాకతాళీయం కాకపోవచ్చు. భారతదేశం పశ్చిమ దిక్కున పాకిస్థాన్‌తో పోరాడుతున్న సమయంలో, పాకిస్థాన్ అనుకూల యూనిస్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొని హసీనా అనుకూల భారతదేశాన్ని ఇరకాటంలోకి నెట్టేసిందని అంతర్జాతీయ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. సరైన విధానాలు, ప్రక్రియలు పాటించకుండా అవామీలీగ్ మీద నిషేధాన్ని విధించడం సముచితం కాదని భారత విదేశాంగశాఖ మంగళవారం ఒక ప్రకటనలో వ్యాఖ్యానించింది. సాధ్యమైనంత వేగంగా, స్వేచ్ఛాయుతంగా, సమ్మిళితంగా ఎన్నికలు జరగాలన్నది.

అవామీలీగ్ భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో పాల్గొనకుండా బంగ్లాదేశ్ ఎన్నికల సంఘం ఒక రాజకీయపార్టీగా దాని గుర్తింపును సైతం రద్దు చేసింది. డెబ్బైఏళ్ళ అవామీలీగ్ మీద చేపట్టిన చర్యలన్నీ దురుద్దేశపూరితమైనవేనని ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్ ఆఫ్ బంగ్లాదేశ్ (ఐసిటి–బిడి) ఒకపక్కన ఈ పార్టీ కార్యకర్తలు, నేతల దుర్మార్గాలూ దాష్టీకాలమీద విచారణ జరుపుతున్న నేపథ్యంలో తుది తీర్పులు, నిర్ణయాలు వెలువడేవరకూ ప్రభుత్వం ఆగివుంటే సరిపోయేది. కానీ, అడ్వయిజరీ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని ప్రకటించడం, దానికి ముందు, నేషనల్ సిటిజన్ పార్టీ, జమాతే ఇస్లామీ వంటివి అవామీలీగ్‌ను నిషేధించాలంటూ భారీ ప్రదర్శనలు జరపడం వంటి పరిణామాలు ఒక ప్రణాళికాబద్ధంగా జరిగాయి. ఆ తరువాత యూనిస్ వ్యాఖ్యలు గమనించినప్పుడు కూడా ఈ నిర్ణయం ఎప్పుడో జరిగిపోయిందని అనిపించింది.

హసీనా దేశం విడిచిపోయిన తొమ్మిదినెలల్లో, ఒక ఉగ్రవాద వ్యతిరేక చట్టాన్ని ప్రయోగించి మరీ యూనిస్ ప్రభుత్వం ఆమె పార్టీని రద్దుచేసింది. ఈ చర్య మిగతా ప్రపంచానికి ఏ సందేశాన్ని ఇస్తుందో నోబెల్ బహుమతి గ్రహీతకు తెలియదనుకోలేం. హసీనా తన పాలనాకాలంలో ప్రజాస్వామ్యబద్ధంగా నడుచుకున్నారని ఎవరూ అనడం లేదు. కానీ, అవామీలీగ్ ఆవిర్భావం కొన్ని ఆదర్శాలు, ఆకాంక్షలకు అనుగుణంగా జరిగాయన్నవాదనను ఎవరూ కాదనలేరు. పాకిస్థాన్ మతోన్మాద, నిరంకుశ వైఖరులకు, విధానాలకు వ్యతిరేకంగా ముజిబూర్ రహ్మాన్ పార్టీ జన్మించింది. దేశమనుగడకు లౌకికవాదం పునాది కావాలని కాంక్షించింది. భాష, సంస్కృతి ఇత్యాది అనేక విషయాల్లో తూర్పుపాకిస్తాన్ పూర్తిభిన్నమైనది కనుకనే, మిగతా పాకిస్థాన్ నుంచి విడివడేందుకు రక్తంధారపోసింది. ముజిబూర్ రహ్మాన్ విగ్రహాలను కూల్చి, చరిత్ర పుస్తకాల్లోంచి ఆయననూ, ఆయన పార్టీనీ చెరిపివేసే విశేష కృషి ఇప్పటికే అక్కడ జోరందుకుంది. బంగ్లా విముక్తి పోరాటానికి మసిపూసి, దేశ ఆవిర్భావ రహస్యాలకు పాతరేసి పాక్ పాలకులకు నొప్పికలగనివ్వకుండా చూసే ప్రయత్నం బలంగా సాగుతోంది. చరిత్రను తిరగరాసే పేరిట తమ మూలాలకే ముప్పుతెచ్చుకొనే ప్రమాదంలో అక్కడివారు ఉండటం విషాదం. హసీనాకు వ్యతిరేకంగా ఉద్యమించి, ఆమెను దేశం నుంచి వెళ్ళగొట్టినవారంతా రేపటి ఎన్నికల్లో సైతం ఆమె పార్టీని ఘోరంగా ఓడిస్తే ఎవరికీ ఏ అభ్యంతరమూ ఉండదు. కానీ, ఆమెను నియంతనీ, మానవ హక్కులను మంటగలిపిందనీ, ప్రజాస్వామ్యాన్ని పాతరేసిందనీ నిందించినవారే ఆమెను కనీసం ఎన్నికల బరిలోకి కూడా దిగనివ్వకుండా చేయడం విషాదం. న్యాయస్థానాలనూ, ట్రిబ్యునల్స్‌ను నామమాత్రం చేసి, ప్రస్తుత పాలకులే తీర్పులు చెప్పేస్తూ ఆమెకూ, ఆమె పార్టీకీ శిక్షలు వేయడం ఆశ్చర్యకరం.

కరాచీ బేకరి, లింగాపూర్ హౌజ్ లేదా జతి ఉమ్ర ఏదైనా సంబంధిత వ్యక్తుల మనస్సుతో ముడివడి ఉన్న ఒక భావోద్వేగ అనుబంధం. ఇటువంటి సున్నిత అంశంపై రచ్చ చేయడం ఎంతమాత్రం సమంజసం కాదు.

కరాచీ బేకరీపై రచ్చ సబబు కాదు


గల్ఫ్ లేఖ

జాతీయ భావోద్వేగం అనే సున్నిత అంశంతో రాజకీయాలు జోరుగా జరుగుతున్న రోజులివి. దేశభక్తి ప్రామాణికతను నిర్ధారించడం కష్టమవుతున్న నేపథ్యంలో జన్మభూమి, కర్మభూమి లేదా పుణ్య భూమిల మధ్య వ్యత్యాసాన్ని గుర్తించడం అంత సులువు కాదు.

కరాచీ బేకరీ... భారతీయ దర్శం గురించి సరైన అవగాహనలేని అజ్ఞానుల ఆగ్రహావేశాలకు గత కొంత కొన్నాళ్ళుగా గురవుతున్న ఒక ప్రఖ్యాత వాణిజ్య సంస్థ. తమ జన్మ స్థలం గురించి అందరిలోనూ ఒక రకమైన ప్రేమాభిమానం ఉంటుంది. అందునా సింధీలు, పంజాబీలకు ఇది కాస్త ఎక్కువ. దేశ విభజన సందర్భంగా తమ జన్మస్థలాలను వదిలి శరణార్థులుగా వచ్చిన సింధీలు తమ మూలాలను ఏ మాత్రం మరిచిపోలేదు. కొందరు తమ వ్యాపారాలకు లేదా గృహాలకు, విడిచి వచ్చిన జన్మ స్థలాల పేరిట నామకరణం చేసుకున్నారు. అత్యధికులు అదే మూలల వారితో మాత్రమే మమేకం కావడానికి సహజంగా ఇష్టపడతారు, అయినా వీరందరు సంపూర్ణ భారతీయులు. వారి దేశ భక్తిని ఏ మాత్రం శంకించడానికి వీలు లేదు.

ఈ రకంగా పాకిస్థాన్ నుంచి తెలుగునాటకు వచ్చిన అనేక మంది హిందూ శరణార్థలలో ఘన్సంధ్ రమ్నానీ ఒకరు, తన కన్న ఊరు కరాచీ పేరిట ఆయన భారత స్వాతంత్ర్యం తొలినాళ్ళలో నెలకొల్పిన బేకరీ ప్రస్తుతం ఆ రంగంలో అగ్రగామి. ఇప్పటి వరకు జరిగిన సరిహద్దు యుద్ధాలలో గానీ హైదరాబాద్ నగరంలో సంభవించిన మతకలహాలలో గానీ కరాచీ బేకరీ వైపు ఎవరు ఎప్పుడూ కన్నెత్తి చూడలేదు. ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాలు లేని కాలంలో అది సురక్షితంగా ఉన్నది. ఆ నవీన సాంకేతికతల పుణ్యమా అంటూ సమస్తమూ బహిర్గతమవుతోన్న ప్రస్తుత కాలంలో తరచు దేశభక్తి పేర అలజడి సృష్టించే అల్లరిమూకల ఆగ్రహానికి గురవుతోంది.

హైదరాబాద్‌లోని కరాచీ బేకరీయే కాదు, విశాఖ పట్టణం సిరిపురంలోని కరాచీవాలా స్టోర్స్ విజయవాడ



కొత్తపేటలో కరాచీ స్టోర్స్, కరీంనగర్‌లోని హైద్రాబాద్ సింధ్ క్లాత్ స్టోర్స్ మొదలైన అనేక సంస్థలకు శరణార్థులుగా వచ్చిన సింధీలు తాము జన్మించిన నగరాల పేర్లు పెట్టుకున్నారు. ఇదే విధంగా, కరాచీ నగరంలో కొన్ని హోటళ్ళు, వ్యాపార సంస్థలకు బొంబాయి పేరు ఉంది. దేశ విభజనలో హైదరాబాద్ నుంచి పాకిస్థాన్‌కు వెళ్ళిన ముస్లింలు తమ జన్మస్థలం పేరిట కరాచీ నగరంలో ఏకంగా హైదరాబాద్ కాలనీ నెలకొల్పుకున్నారు. బీజేపీ కురువృద్ధుడు లాల్‌కృష్ణ అద్వాణీ 2005లో తన పాక్ పర్యటన సందర్భంగా తన జన్మస్థలానికి వెళ్ళి తాను బాల్యం గడిపిన ఇంటిని చూసి కన్నీరు పెట్టున్నారు. అంతమాత్రాన ఆయన దేశభక్తిని శంకిస్తారా?

పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌ల కుటుంబాలు లాహోర్‌లో నివాసముండే సువిశాల భవంతి పేరు జతి ఉమ్ర ప్యాలెస్. 1700 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భవంతి. ఒక్క పాకిస్థాన్‌లోనే కాదు ఆసియా ఖండంలోనే సువిశాల నివాస గృహమని చెప్పవచ్చు. భారత పంజాబ్‌లోని తరణ్ తరణ్ జిల్లాలో ఉన్న ఒక కుగ్రామం పేరు జతి ఉమ్ర. ఈ గ్రామంలోనే నవాజ్ షరీఫ్ తండ్రి జన్మించారు. తాను పుట్టిన ఊరిపై మమకారంతో లాహోర్‌లో సొంత గృహానికి భారత్‌లో ఉన్న గ్రామం పేరు పెట్టుకున్నారు. గల్ఫ్ దేశాలలో ఉన్న తమ కుటుంబ ఉక్కు పరిశ్రమలలో భారత్‌లోని తమ పూర్వీకుల గ్రామానికి చెందిన అనేక మంది సిక్కు యువకులకు షరీఫ్ కుటుంబం ఉద్యోగాలు కూడ ఇచ్చింది.

హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో ప్రసిద్ధిగాంచిన లింగాపూర్ హౌజ్ కూడా ఒక జన్మస్థలంపై ఉన్న అభిమానానికి ఒక నిదర్శనం. జగిత్యాల జిల్లా బండలింగాపూర్ గ్రామానికి చెందిన రాజ అనంత కిషన్‌రావు కుమారులు గజసింహారావు, రాజనర్సింహారావు తమ కన్న ఊరు పేరిట హైదరాబాద్ నగరం నడిబొడ్డున అప్పట్లో నిర్మించిన వాణిజ్య సముదాయానికి లింగాపూర్‌గా నామకరణం చేసారు.

ఒకనాటి భారతీయ జన సంఘ్ అగ్రనాయకులలో పలువురు అవిభక్త భారతంలో నేటి పాకిస్థాన్‌గా ఉన్న ప్రాంతాల పేర్లతో పరస్పరం పిలుచుకునేవారు. భారత్‌లోని గ్రామం పేరుతో ఉన్న భవంతిలో నివసిస్తున్న పాకిస్థాన్ ప్రధానమంత్రికి స్వీయ దేశాభిమానం కొరవడిందా? కరాచీ బేకరీ పేర వ్యాపారం చేస్తున్న యాజమానుల దేశభక్తి ఏమైనా తగ్గిందా? లింగాపూర్ హౌజ్, కరాచీ బేకరి లేదా జతి ఉమ్ర ఏదైనా సంబంధిత వ్యక్తుల మనస్సుతో ముడివడి ఉన్న ఒక భావోద్వేగ అనుబంధం. ఇటువంటి సున్నిత అంశంపై రచ్చ చేయడం ఎంతమాత్రం సమంజసం కాదు.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ముగిసిన యుద్ధం మిగిల్చిన ప్రశ్నలు



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

గగనతలంలో యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి. యుద్ధ విమానాలు శత్రుస్థావరాలపై క్షిపణుల వర్షం కురిపించాయి. డ్రోన్‌లు పేలుడు పదార్థాలతో నిప్పులు కక్కాయి. సరిహద్దులు కాల్పులతో దద్దరిల్లాయి. కేవలం నాలుగు రోజుల్లోనే భారత్ పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం తీవ్రస్థాయికి చేరుకుంది. ఇది ఆధునిక యుద్ధతంత్రం కనుక టెక్నాలజీ సాయంతో నిర్దిష్ట లక్ష్యాలను ఛేదించగలగడం, క్షిపణులను, డ్రోన్‌లను గాలిలోనే పేల్చివేయడం వంటి అపూర్వ దృశ్యాలను మనం చూడగలిగాం. పహల్గాంలో పర్యాటకులను ఉగ్రవాదులు దారుణంగా కాల్చి చంపిన 15 రోజుల్లోనే భారత దేశం సర్వశక్తులను మోహరించి పాకిస్థాన్‌పై దాడులు ప్రారంభించిన వైనాన్ని, పాకిస్థాన్ మనను ఎదుర్కొనే విషయంలో విఫలం కావడం స్పష్టంగా కనపడింది. ఆపరేషన్ సిందూర్ పేరిట భారత సైనిక దళాలు ప్రారంభించిన యుద్ధం మొత్తం దేశాన్నే గగుర్పొడిచేలా చేసింది. భారత మహిళల సిందూరాన్ని తుడిచివేసిన పాక్ ప్రేరిత ఉగ్రవాదులకు బుద్ధి చెప్పేందుకు తగిన పేరే పెట్టినందుకు దేశ వ్యాప్తంగా హర్షామోదాలు వ్యక్తమయ్యాయి. 'ఉగ్రవాదులను, వారికి వెనుక ఉన్న శక్తులను మట్టిలో కలిపేస్తాం' అని ప్రధానమంత్రి చేసిన హుంకారం దేశమంతటా ప్రతిధ్వనించింది. పాకిస్థాన్ కూడా భారత్‌ను ఎదుర్కొనేందుకు సమాయత్తం కావడంతో ఈ యుద్ధం చాలా కాలం సాగుతుందని, ఈసారి భారతదేశం లాహోర్‌లో ప్రవేశించడమే కాదు, పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను కూడా కైవశం చేసుకుంటుందనే భావనలు అంతటా పెల్లుబుకాయి.

కాని యుద్ధం ప్రారంభించిన నాలుగు రోజుల్లోనే ఉన్నట్లుండి ఇరు దేశాలు యుద్ధ విరమణను ప్రకటిస్తాయని, శతఘ్నులు, విమానాలు మూగపోతాయని ఎవరూ ఊహించలేదు. ఏదో జరగబోతుందని, ఈసారి పాకిస్థాన్‌కు మనం కనీవినీ ఎరుగని రీతిలో బుద్ధి చెబుతామని భావించిన తరుణంలో పాక్ కాల్పుల విరమణను ప్రతిపాదించడం, అందుకే ఎదురుచూస్తున్నట్లుగా మనం నాటకీయంగా అందుకు అంగీకరించడం దేశ వ్యాప్తంగా అనేకమందికి ఆశ్చర్యం కలిగించింది. నిజానికి మనమే కాల్పుల విరమణను ముందుగా ప్రతిపాదించామని, అందుకు తాము ఒప్పుకున్నామని పాకిస్థాన్ కూడా ప్రకటించింది. 2022 ఫిబ్రవరిలో రష్యా–ఉక్రెయిన్‌ల మధ్య ప్రారంభమైన యుద్ధం ఎంతో బీభత్సం సృష్టించిన తర్వాత ఇప్పుడిప్పుడే శాంతి బాటలోకి పయనిస్తోంది. ఇజ్రాయిల్–పాలస్తీనా మధ్య నెత్తుటి సంఘర్షణ కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతూ వస్తోంది. గతంలో ఇరాన్, ఇరాక్‌ల మధ్య యుద్ధం 8 సంవత్సరాలకు పైగా సాగింది. అమెరికా సంకీర్ణ దళాలకూ, ఇరాక్‌కు మధ్య మరో 8 సంవత్సరాలు హోరాహోరీ సాగింది. వియత్నాంపై అమెరికా యుద్ధం కూడా 20 సంవత్సరాలకు పైగా జరిగింది. మరెందుకు భారత పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం కేవలం నాలుగు రోజుల్లోనే యాంటీ క్లైమాక్స్ లాగా ఎందుకు ముగిసింది?

ఈ యుద్ధం ఇలా అర్థాంతరంగా ముగియడాన్ని బట్టే యుద్ధం గురించి స్వతంత్రంగా మనం నిర్ణయాలు తీసుకోలేమని, తీసుకున్నా దాన్ని కొనసాగించలేమని అర్థమవుతుంది. ఈ యుద్ధ విరమణను భారత పాకిస్థాన్ దేశాలు తమంతట తాము ప్రకటించాయని అనుకోవడానికి ఏ మాత్రం వీల్లేదు. ఉన్నట్లుండి కత్తులు ఒరల్లోకి చేరిపోవడం యాదృచ్ఛికం కానేకాదు. అసలు సుదీర్ఘకాలం యుద్ధం జరగాలని, సైనికులు, ప్రజలు చనిపోవాలని, అభివృద్ధి స్తంభించిపోవాలని ఎవరూ కోరుకోరు. ప్రపంచ శాంతి ఏర్పడాలనే అందరూ కోరుకుంటారు. గతంతో పోలిస్తే ఒకటి రెండు చోట్ల తప్ప ప్రపంచంలో యుద్ధ వాతావరణం అంతగా లేదు. చైనా, అమెరికా లాంటి దేశాలు వాణిజ్య భాషకే ప్రాధాన్యతనిస్తున్నాయి. భారత దేశం కూడా వికసిత్ భారత లక్ష్యం నెరవేరాలంటే యుద్ధాన్ని సాధ్యమైనంత మేరకు నివారించాలి. యుద్ధం చేయడమంటే పులిపై స్వారీ చేయడమే. ప్రారంభించే ముందే దాని పర్యవసానాల గురించి ఆలోచించాలి. అందువల్ల యుద్ధం ఎందుకు ప్రారంభించాల్సి వచ్చింది? యుద్ధాన్ని ఎందుకు ముగించాల్సి వచ్చింది అన్న ప్రశ్నలపై మాత్రం చర్చ జరగడం అవసరం. రష్యా–ఉక్రెయిన్‌ల మధ్య, ఇజ్రాయిల్–హమాస్‌ల మధ్య యుద్ధాన్ని ఆపలేకపోయిన అంతర్జాతీయ శక్తులు భారత–పాకిస్థాన్‌ల విషయంలో మాత్రం ఎందుకు విజయవంతం కాగలిగాయి? ఒకటి రెండు ఫోన్‌కాల్స్‌తో ఇరు దేశాలు ఎందుకు శాంతించాయి?

భారత పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం ప్రారంభించిన వెంటనే అమెరికా, బ్రిటన్, సౌదీ అరేబియాతో సహా అనేక దేశాలు మధ్యవర్తిత్వానికి ప్రయత్నించాయి. ఇరు దేశాలు తమ నిర్ణయాన్ని ప్రకటించకముందే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారత పాక్ దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయని ప్రకటించారు. తామే ఇరు దేశాలను ఒప్పించామని, ఈ దేశాలు తమ వివేకాన్ని, విజ్ఞతను ప్రదర్శించాయని ఆయన అభినందించారు. తాను, అమెరికన్ ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ భారతదేశం, పాకిస్థాన్‌లోని సైనిక నాయకత్వంతో మాట్లాడామని, పరిస్థితి విషమించకుండా ఒప్పందం కుదిరేలా చేసామని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో అన్నారు. దాదాపు పది పన్నెండు దేశాలు ఇరు దేశాలను శాంతింపచేసేందుకు ప్రయత్నాలు చేసినప్పటికీ ప్రధానంగా భారత పాకిస్థాన్‌ల మధ్య తాత్కాలిక శాంతి ఏర్పర్చడంలో అమెరికా కీలక పాత్ర వహించినట్లు స్పష్టమవుతోంది. తమకు సంబంధం లేని యుద్ధంలో తాము జోక్యం చేసుకోబోమని తొలుత ప్రకటించిన అమెరికా తన వైఖరి మార్చుకుని పెద్దన్న పాత్ర పోషించింది.

యుద్ధం, సంఘర్షణలు జరిగినప్పుడే తమ పక్షాన ఎవరు నిలబడతారో అన్న విషయం స్పష్టమవుతుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో వ్యక్తిగత స్నేహం కూడా ఏర్పర్చుకుని పరమ మిత్రుడుగా వ్యవహరించారు. అయితే ఆయనే యుద్ధాన్ని ఆపేయాలని హెచ్చరించే స్వరంతో చెప్పారు. యుద్ధం ప్రారంభమైన తర్వాత కూడా అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ పాకిస్థాన్‌కు 2.4 బిలియన్ డాలర్ల రుణాన్ని మంజూరు చేసింది. సౌదీ ఆరేబియా, చైనా, యూఏఈ పాక్‌కు ఈ రుణం లభించేందుకు గట్టి మద్దతునిచ్చాయి. ఈ రుణం లభించకుండా వీటో చేసే అధికారాలున్నా అమెరికా అడ్డుకోలేదు, జపాన్, జర్మనీ, యూకే కూడా మాట్లాడలేదు. పాకిస్థాన్‌కు మద్దతునిస్తే ఉగ్రవాదానికి మద్దతునిచ్చినట్లేనన్న భారత్ నిరసనలకు మద్దతు లభించలేదు. దీనితో పాక్‌కు ఐఎంఎఫ్ రుణం ఇచ్చే విషయంలో ఐఎంఎఫ్ బోర్డులో వోటింగ్ చేయకుండా భారత్ వైదొలగాల్సి వచ్చింది.

ఈ నాలుగు రోజుల యుద్ధం కొన్ని ప్రశ్నలను మిగిల్చింది.



> **ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ నిజంగా తన లక్ష్యాన్ని సాధించిందా? పహల్గాంలో హత్యకు గురైన అమాయక భారతీయుల మరణాలకు ప్రతీకారాలు తీర్చుకున్నారా? పాకిస్థాన్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్‌ను మనం పూర్తిగా ధ్వంసం చేశామా? భారతీయ పర్యాటకులను హత్య చేసి అదృశ్యమైన ఉగ్రవాదులను మనం వెతికి వేటాడి చంపగలిగామా? పహల్గాం ఘటన సూత్రధారి ముసా, లష్కరే వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్, జైషే మహమ్మద్ వ్యవస్థాపకుడు మసూద్ అజర్, హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందిన సలావుద్దీన్‌లను అప్పగించేందుకు పాకిస్థాన్ సిద్ధపడిందా?**

ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ నిజంగా తన లక్ష్యాన్ని సాధించిందా? పహల్గాంలో హత్యకు గురైన అమాయక భారతీయుల మరణాలకు ప్రతీకారాలు తీర్చుకున్నారా? పాకిస్థాన్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్‌ను మనం పూర్తిగా ధ్వంసం చేశామా? భారతీయ పర్యాటకులను హత్య చేసి అదృశ్యమైన ఉగ్రవాదులను మనం వెతికి వేటాడి చంపగలిగామా? పహల్గాం ఘటన సూత్రధారి ముసా, లష్కరే వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్, జైషే మహమ్మద్ వ్యవస్థాపకుడు మసూద్ అజర్, హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందిన సలావుద్దీన్ ఏ రహస్య స్థావరాల్లో దాక్కున్నారు? వారిని అప్పగించేందుకు పాకిస్థాన్ సిద్ధపడిందా? భారతదేశం కొన్ని స్థావరాలను ధ్వంసం చేసిన మాట నిజమే. పాకిస్థాన్‌కు మనం తీవ్ర నష్టం చేశామని మన సైనిక దళాలు వివరాలు ఇచ్చాయి. కాని మనకు జరిగిన నష్టం గురించి తెలిసేందుకు ఆస్కారం లేదు. మన యుద్ధ విమానాలను కూల్చివేయడం గురించి పాక్ చెప్పుకోవడంపై ప్రశ్నించినప్పుడు 'యుద్ధం అన్న తర్వాత నష్టాలు జరగక తప్పదు' అని భారతీయ వైమానిక దళం ప్రకటించింది కాని వివరాలు చెప్పలేదు. పాకిస్థాన్‌కు ఎంత నష్టం జరిగినా, కొంత గాయపరిచినా, వందమందిని పైగా హతమార్చామని చెప్పుకున్నా, పాక్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్‌ను పూర్తిగా ధ్వంసం చేయడం, ఆక్రమిత కశ్మీర్‌ను అప్పగించడం, కశ్మీర్‌లో పూర్తిగా శాంతి నెలకొనడం అనే భారత దీర్ఘకాలిక లక్ష్యాలు ఇంకా నెరవేరాల్సి ఉన్నది. ముఖ్యంగా ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌ను ప్రపంచ దేశాల్లో ఏకాకి చేయడం, దౌత్య, ఆర్థిక సహాయం అందకుండా చేయడం అంత సులభం కాదని తాజా పరిణామాలతో స్పష్టమైంది. నిజానికి నేరుగా యుద్ధం చేయకుండా పాకిస్థాన్ మాదిరే ఆ దేశంలో అల్లకల్లోలం సృష్టించడం, అంతర్గత భద్రతా పరిస్థితులను ఏర్పర్చడం సులభం. కాని దీనివల్ల ప్రచారం లభించదు కదా!

ఇజ్రాయిల్‌లో నెతన్యాహుకు ప్రతికూల పరిస్థితులు ఏర్పడి అరెస్టయ్యే దశలో హమాస్‌పై దాడి చేసి తనకు తిరుగులేని పరిస్థితిని కల్పించుకున్నారు. భారతదేశంలో నరేంద్రమోదీ కూడా తన ప్రాబల్యాన్ని పెంచుకునేందుకు పహల్గాం ఘటన దోహదం చేసింది. పాకిస్థాన్ గురించి, ఉగ్రవాద శక్తుల గురించి ఆయన మాట్లాడిన ఒక్కొక్క మాటకూ దేశ ప్రజలు ఉప్పొంగిపోయారు. నాలుగు రోజుల పాటు మన యుద్ధ విమానాలు పాక్ గగనతలంలో స్వైర విహారం చేసినట్లు వచ్చిన వార్తలు విన్నప్పుడు, మన టీవీ యాంకర్లు టెలివిజన్ తెరలపై యుద్ధాన్ని ఉద్వేగస్వరాలతో త్రీడీలో ఆవిష్కరించినప్పుడు ప్రజలు ఉత్కంఠలో మునిగిపోయారు. ఇప్పుడు ఆకస్మికంగా యుద్ధం ఆగిన తర్వాత మోదీ ప్రజల్లో ఆ వేడిని కొనసాగించేందుకు విశ్వయత్నాలు చేస్తున్నారు. దేశ ప్రజలను, సైన్యాన్ని ఉద్దేశించి ఆయన వీరోచితంగా ప్రసంగాలు చేయడం, ఆపరేషన్ సిందూర్ విజయవంతమైనదంటూ దేశ వ్యాప్తంగా బీజేపీ తిరంగా యాత్ర నిర్వహించడం ఇందుకు నిదర్శనం. ప్రశ్నలకు తావివ్వకుండా ప్రచారం చేయడం ఒక రకంగా మంచిదే. కాని ప్రచారం సద్దుమణిగిన తర్వాత మళ్లీ ప్రశ్నలకు ఆస్కారం కలగక తప్పదు. అందువల్ల 'దీరుల్ విఘ్న నిహన్య మానులగుచున్ ధ్రుత్యున్నతోత్సాహులై' అని భర్తృహరి అన్నట్లు మన ప్రధానమంత్రి నరేంద్రమోదీ తాను ప్రారంభించిన కార్యాన్ని ఇంకా పూర్తిచేయాల్సి ఉన్నది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే పాకిస్థాన్‌ను రెండు ముక్కలు చేసిన ఇందిరాగాంధీకి, ఇతర దేశాల జోక్యాన్ని వ్యతిరేకిస్తూ ఆమె గతంలో చేసిన ప్రకటనలపై అంతటా చర్చ జరుగుతోంది!

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

కృష్ణా జలాల పునఃపంపిణీ తెలంగాణ జన్మహక్కు

'పొంచి ఉన్న కృష్ణా జలకాటకం' శీర్షికతో సీనియర్ జర్నలిస్ట్ వి. శంకరయ్య రాసిన వ్యాసంలో (మే 6, 2025) ఎప్పటి అలవాటు ప్రకారమే తెలంగాణపై అక్కసు వెళ్లగక్కినారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ భావోద్వేగాలు పెంచి పోషించే వ్యూహంతో కృష్ణా నదీ జలాల వాటాల గురించి అవశేష ఆంధ్రప్రదేశ్‌తో వాదులాటకు దిగారని ఆరోపించారు. కేసీఆర్‌కు కృష్ణా జలాలపై స్పష్టమైన అవగాహన ఉంది కాబట్టే తెలంగాణ ఏర్పడిన నెల రోజులకే అంతర్రాష్ట్ర నదీ జలాల వివాద పరిష్కారాల చట్టం, 1956, సెక్షన్–3 కింద కృష్ణా జలాల పునఃపంపిణీ కోసం ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయమని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసినారు. కృష్ణాలో పంచుకోవడానికి నీళ్ళు లేవని, కృష్ణా జలాల విషయంలో అసలు వివాదమే లేదని, పుష్కలంగా లభ్యమౌతున్న గోదావరి జలాలను పంచుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ రోజుల్లో చేసిన వ్యాఖ్యలను కేసీఆర్ ఖండించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటా గురించి మాట్లాడకుండా గోదావరి జలాల గురించి మాట్లాడడం కుట్ర పూరితమని స్పష్టం చేశారు.

నిజానికి కృష్ణా లోటు బేసిన్ కానే కాదు. కృష్ణా బేసిన్‌లోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో సాగుకు అనువైన భూములకు సరిపోయేన్ని నీళ్ళు ఉన్నాయి. కానీ బేసిన్‌లోని ప్రాంతాల అవసరాల కంటే బేసిన్ అవల ఉన్న ప్రాంతాల అవసరాలకు పెద్దపీట వేసి చూసినప్పుడు కృష్ణా లోటు బేసిన్‌గానే కనబడుతుంది. నాడు బచావత్ ట్రిబ్యునల్ ముందు కర్ణాటక, మహారాష్ట్రలు ఆంధ్రప్రదేశ్ బేసిన్ అవలకు తరలించే నీటి వల్లనే కృష్ణా బేసిన్‌లో లోటు ఏర్పడిందని వాదించాయి. వరి పండించడానికి కూడా 130టీఎంసీలు కృష్ణా డెల్టా ఆయకట్టుకు సరిపోతాయి. అవి భూగర్భ జలాలు, వర్షపాతం పుష్కలంగా ఉన్న ప్రాంతాలు కూడా. కానీ ప్రతి సంవత్సరం 200–300 టీఎంసీలకు పైగా కృష్ణా నీటిని డెల్టా ఆయకట్టుకు మళ్లించారు. అట్లాగే కేసీ కెనాల్, నాగార్జునసాగర్ కుడి కాలువ వినియోగాలు కూడా అత్యధిక శాతం బేసిన్ అవలనే ఉన్నాయి. ఇట్లా తాము బేసిన్ అవల ఉన్న ప్రాంతాలకు మళ్లించే నీటి వల్లనే లోటు ఏర్పడిందన్న విషయాన్ని మరుగుపర్చి కృష్ణా బేసిన్‌లో నీళ్లు లేవు, అది లోటు బేసిన్ అని ప్రచారంలోకి తెచ్చారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని బుట్టలో వేసుకొని కృష్ణా జలాల పునఃపంపిణీ కోసం సెక్షన్–3 కింద ట్రిబ్యునల్ వేయడానికి అపెక్స్ కౌన్సిల్లో అనుమతి సాధించారన్నది కేసీఆర్ మీద శంకరయ్య చేసిన మరొక ఆరోపణ. 2020 అక్టోబర్ 6న జరిగిన రెండవ అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో జగన్ సెక్షన్–3 కింద ట్రిబ్యునల్ వేయడాన్ని వ్యతిరేకించినా, అంతకంటే తీవ్రమైన కేసీఆర్ ప్రతిఘటనకు కేంద్ర ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. 2014 నుంచి నిరంతరాయంగా సాగుతున్న పోరాటం ఆ రోజు ఒక కొలిక్కి వచ్చింది. అది నిజం కావడానికి తెలంగాణ 2023 ఎన్నికల దాకా ఆగాల్సి వచ్చింది. ఎన్నికల్లో లబ్ధి పొందడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సెక్షన్–3 కింద అదనపు టెర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (ToR) జారీ చేసిందన్న శంకరయ్య ఆరోపణలో నిజం ఎలా ఉన్నప్పటికీ కేసీఆర్ ప్రభుత్వ పోరాట నేపథ్యం ఉందన్న సంగతిని శంకరయ్య విస్మరించడం తగదు.

> **బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ 2013లో ఇచ్చిన తుది నివేదికపై ఏకాభిప్రాయ సాధన కోసం కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తెలంగాణ నిశితంగా పరిశీలిస్తున్నది. కేంద్రం ప్రతిపాదించే అంశాలలో తెలంగాణ ప్రయోజనాలకు అనుకూల అంశాలు ఉంటే అధ్యయనం చేస్తుంది. లేకపోతే తిరస్కరిస్తుంది. పాత వినియోగాలను యథాతథంగా కొనసాగించాలన్న ఆంధ్రప్రదేశ్ వైఖరితో గుడ్డిగా అంటకాగడం తెలంగాణకు సాధ్యపడదు.**



తెలంగాణ ప్రభుత్వం సెక్షన్–3 కింద కృష్ణా ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయమని కోరిన ఒక ఏడాది తర్వాత అందుకు భిన్నంగా ఆగస్ట్ 2015లో ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం, సెక్షన్–89 ప్రకారం ఇరు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల వాటా నిర్ణయించడానికి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ పదవీ కాలాన్ని పొడిగించారు. ఈ సెక్షన్ కింద బ్రిజేష్ ట్రిబ్యునల్‌కు నివేదించిన అంశాలు తెలంగాణకు న్యాయం చేకూర్చలేవని, వాటి పరిధి పరిమితమైనదని కేసీఆర్‌కు తెలుసు కాబట్టే కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగులో ఉన్న ISRWD చట్టం సెక్షన్–3 ప్రకారం ట్రిబ్యునల్ ఏర్పాటు కావాలని కోరుతూ తెలంగాణ ఇచ్చిన ఫిర్యాదుపై నిరంతరాయంగా పోరాటం కొనసాగించాడు. అయితే, అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని జారవిడుచుకోవద్దన్న ఆలోచనతో తెలంగాణకు న్యాయబద్ధ వాటా (equitable share) ఇవ్వాలని సెక్షన్–89 ప్రకారం జరిగే విచారణలోనూ తెలంగాణ పాల్గొన్నది. సెక్షన్–89 కింద కృష్ణా జలాల పునఃపంపిణీ చేసేందుకు తనకు అధికారం లేదని బ్రిజేష్ కుమార్ పలుమార్లు వెల్లడించారు. ఈ పరిస్థితిలో అపెక్స్ కౌన్సిల్‌లో పట్టుబట్టి సెక్షన్–3ని సాధించారు కేసీఆర్.


అయితే, తెలంగాణలో కరువు ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించే పాలమూరు–రంగారెడ్డి, డిండి, భక్త రామదాసు, తుమ్మిళ్ళ, మిషన్ భగీరథ తదితర పథకాలు అక్రమమైనవని ట్రిబ్యునల్‌లో ఆంధ్రప్రదేశ్ వాదిస్తున్నది. బేసిన్‌లోని హైదరాబాద్ నగరానికి వినియోగించే తాగునీటిని బచావత్ ట్రిబ్యూనల్ ప్రకారం 20శాతం మాత్రమే లెక్కించాల్సి ఉంటే, ఆంధ్రప్రదేశ్ అడ్డుకుంటున్నందు వల్ల గత పదేళ్ళుగా ఏటా సగటున 15టీఎంసీలు తెలంగాణ కోల్పోయింది. పోలవరం ద్వారా మళ్లించే గోదావరి నీటిలో 45టీఎంసీలు కృష్ణా బేసిన్‌లో నాగార్జునసాగర్ ఎగువన ఉన్న తెలంగాణకు దక్కాలి. తెలంగాణ రాష్ట్రం ఆ నీటిని పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు కేటాయించుకున్నది. మైనర్ ఇరిగేషన్‌కి కేటాయించిన 90 టీఎంసీలలో 45 టీఎంసీల మిగులును కూడా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు కేటాయించింది. ఈ కేటాయింపులను ఆంధ్రప్రదేశ్ వ్యతిరేకిస్తున్నది. రాజోలిబండ ఆనకట్ట ఆధునికీకరణ పనులు పూర్తి కానీయకుండా అన్యాయంగా అడ్డుతగుల్తున్నది. ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం తెలంగాణ తన వాటాను నాగార్జునసాగర్‌లో భద్రపరచుకొని మరుసటి సంవత్సరం వాడుకుంటామని (Carry Over) అంటే నిరాకరిస్తున్నది. ఆంధ్రప్రదేశ్ ఘర్షణలు మాని సోదర తెలుగు రాష్ట్రమైన తెలంగాణకు సహృదయంతో తోడ్పడాలి. తెలంగాణ ప్రభుత్వం నిరంతరాయంగా చేసిన పోరాట ఫలితంగానే సెక్షన్–3 కింద అదనపు ToRను కృష్ణా ట్రిబ్యునల్‌కు కేంద్రం నివేదించింది. కృష్ణా జలాల పునఃపంపిణీ తెలంగాణ జన్మహక్కు.

ఇక, బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ 2013లో ఇచ్చిన తుది నివేదికపై ఏకాభిప్రాయ సాధన కోసం కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తెలంగాణ నిశితంగా పరిశీలిస్తున్నది. కేంద్రం ప్రతిపాదించే అంశాలలో తెలంగాణ ప్రయోజనాలకు అనుకూల అంశాలు ఉంటే అధ్యయనం చేస్తుంది. లేకపోతే తిరస్కరిస్తుంది. పాత వినియోగాలను యథాతథంగా కొనసాగించాలన్న ఆంధ్రప్రదేశ్ వైఖరితో గుడ్డిగా అంటకాగడం తెలంగాణకు సాధ్యపడదు.

• శ్రీధర్‌రావు దేశ్‌పాండే
విశ్రాంత సూపరింటెండింగ్ ఇంజనీర్

నిబద్ధత కలిగిన నేత బండారి రాజిరెడ్డి

రాజకీయ నిబద్ధత కలిగిన గొప్ప నేత బండారి రాజిరెడ్డి. కాంగ్రెస్ పార్టీ రాజకీయాలలో కాప్రా మున్సిపాలిటీ అధ్యక్షుడిగా ఆయన జీవితం మొదలైంది. అంచెలు అంచెలుగా ఎదిగి కాప్రా మున్సిపాలిటీకి తొలి చైర్మన్ అయ్యారు. అలాగే ఉప్పల్ నియోజకవర్గం ఏర్పడ్డాక తొలి ఎమ్మెల్యేగా గెలుపొందారు.



మురికివాడలలో నివసిస్తున్న పేద ప్రజల విషయంలో రాజిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొన్నారు. వైయస్ రాజశేఖరరెడ్డి హయంలో వందలాది కోట్ల రూపాయల నిధులను ఉప్పల్ నియోజకవర్గానికి తీసుకువచ్చి ఇక్కడి అభివృద్ధికి బాటలు వేశారు. ఉప్పల్ నియోజకవర్గంలో ఏ మూలకు వెళ్లినా బండారి రాజిరెడ్డి చేపట్టిన సేవా కార్యక్రమాలు, అభివృద్ధి పనుల గురించి ప్రజలు చెప్పుకుంటారు. రాజిరెడ్డి ఉదయం 6 గంటలకే ఇక్కడి కాలనీలలో పర్యటిస్తూ ప్రజా సమస్యలను నేరుగా అడిగి తెలుసుకునేవారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించేవారు. కుషాయిగూడ జమ్మిగడ్డలో ప్రజా వైద్యశాలను అందుబాటులోకి తీసుకురావడంలో రాజిరెడ్డి పాత్ర మరువలేనిది. కైలాసగిరి గుట్టపై శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం, మల్లికార్జునస్వామి దేవాలయం గోశాలను ఏర్పాటు చేశారు. సొంత నిధులతో దేవాలయాలను కట్టించారు. ఎంతోమంది యువతీ యువకులను రాజకీయాల వైపు మళ్ళించారు. పదవుల కోసం, డబ్బు కోసం పార్టీలు మారే ఎందరో నేతలను చూస్తాం. రాజిరెడ్డి మాత్రం కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ కాంగ్రెస్ పార్టీలోనే మరణించారు.

– దామరపల్లి నరసింహారెడ్డి

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70,
జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు విస్తృత ఏర్పాట్లు

9

అందాల భామల రాక కోసం..





విద్యుత్ దీప కాంతుల్లో మెరుస్తున్న వేయిస్తంభాల గుడి, వరంగల్ కోట

నేడు ఓరుగల్లుకు మిస్‌వరల్డ్ కంటెస్టెంట్లు

- వేయిస్తంభాల గుడి, వరంగల్ కోట, రామప్ప సందర్శనకు సర్వం సిద్ధం
- ముస్తాబైన రామప్ప ఆలయం
- భద్రత సహా పటిష్ఠ ఏర్పాట్లు చేసిన యంత్రాంగం

మనసులను కట్టిపడేసే రమణీయ శిల్పకళా సౌందర్యంతో.. ఆధ్యాత్మిక తలో ఓలలాడించే ప్రాచీన ఆలయాలతో.. కళల కాణాచిగా వెయ్యేళ్లకు పైగా చరిత్ర కలిగిన కాకతీయులు ఏలిన గడ్డ ఓరుగల్లులో ప్రపంచ సుందరీమణులు అడుగుపెట్టబోతున్నారు. హైదరాబాద్ వేదికగా మిస్‌వరల్డ్ పోటీలు జరుగుతున్న నేపథ్యంలో.. అందాల భామలకు రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను చూపేలా కార్యాచరణ రూపొందించారు. ఈ క్రమంలో బుధవారం 35మందితో కూడిన ఒక బృందం వరంగల్ వేయిస్తంభాల ఆలయం, కోటలను సందర్శించనుండగా.. 22మందితో కూడిన మరో బృందం రామప్ప ఆలయాన్ని దర్శించుకోనుంది. ఈ క్రమంలో వేయిస్తంభాల గుడి, వరంగల్ కోటను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. అలాగే రామప్పలోనూ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇక సుందరీమణులు పర్యటించే ప్రాంతాల్లో రెండు వేల మంది పోలీసులతో పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టారు.

6

అందాల భామల రాక కోసం..

నేడు ఓరుగల్లుకు మిస్‌వరల్డ్ కంటెస్టెంట్లు



వేయి స్తంభాల ఆలయంలో మేయర్, కమిషనర్, కుడా చైర్మన్

- వేయిస్తంభాల గుడి, వరంగల్ కోట, రామప్ప సందర్శనకు సర్వం సిద్ధం
- భద్రత సహా పటిష్ఠ ఏర్పాట్లు చేసిన యంత్రాంగం

హనుమకొండ కల్చరల్ / ఖిలావరంగల్ / ములుగు, మే 13 (ఆంధ్రజ్యోతి) : కళల కాణాచి.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయలకు నెలవు.. కాకతీయుల సామ్రాజ్యానికి రాజధానిగా.. మైమరిపించే శిల్ప సౌందర్యం, మనసులను కట్టిపడేసే అద్భుత ఆలయాలతో కొలువైన చారిత్రక నగరం ఓరుగల్లు ప్రపంచ సుందరీమణుల రాక కోసం ముస్తాబవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ వేదికగా మిస్‌వరల్డ్ పోటీలకు ఆతిథ్యమిస్తున్న నేపథ్యంలో.. ఆ అందాల భామలకు పర్యాటక ప్రాంతాలను చూసేలా కార్యాచరణ రూపొందించారు. ఈ క్రమంలో బుధవారం వెయ్యేళ్ల సుదీర్ఘ చరిత్ర గలిగిన ఓరుగల్లుతో పాటు ములుగు జిల్లాలోని ప్రఖ్యాత రామప్పను సందర్శించనున్నారు. 35మందితో కూడిన ఒక బృందం వరంగల్ వెయ్యి స్తంభాల ఆలయం, వరంగల్ కోటలను సందర్శించనుండగా.. 22మందితో కూడిన మరో బృందం రామప్ప ఆలయాన్ని దర్శించుకోనుంది. ఈ క్రమంలో వేయిస్తంభాల ఆలయం, వరంగల్ కోటను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. వారు విడిది చేయనున్న హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రత్యేక పాస్‌లున్న వారినే వారి పర్యటనలో అనుమతించనున్నారు. వరంగల్, హనుమకొండ కలెక్టర్లు, వరంగల్ పోలీసు కమిషనర్, నగర పాలక సంస్థ సిబ్బంది సుందరీమణుల పర్యటన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. వేయిస్తంభాల ఆలయంలో ప్రపంచ సుందరీమణుల పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను మంగళవారం రాత్రి మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే కుడా అధికారులతో కలిసి పర్యవేక్షించారు.

పేరిణి రిహార్సల్

ప్రపంచ సుందరీమణుల ఓరుగల్లు పర్యటనలో ప్రధాన ఆకర్షణగా పేరిణి నృత్యం నిలవనుంది. ప్రపంచ ప్రఖ్యాత రామప్ప ఆలయంతోపాటు వరంగల్ కోటలో ప్రతిష్ఠాత్మకంగా సుందరీమణుల సమక్షంలో నిర్వహించే పేరిణి ప్రదర్శన కోసం మంగళవారం వరంగల్‌లోని పోతన ఆడిటోరియంలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక రిహార్సల్ కొనసాగింది. వరంగల్‌కు చెందిన గజ్జెల రంజిత్‌కుమార్, నవ్యజ, జాతీయ అవార్డు గ్రహీత రాజ్‌కుమార్ నాయక్, హైదరాబాద్‌కు చెందిన సందీప్, నిజామాబాద్‌కు చెందిన అన్నల దేవి రాజేష్, కాకినాడకు చెందిన వెంకట్రావ్, వరంగల్‌లో పేరిణి అధ్యాపకులుగా శిక్షణ పొందుతున్న పల్నాటి శ్రీజ, బండారి వైష్ణవి, తేజశ్విని, గురుదేవ్ తదితర కళాకారులతోపాటు కరీంనగర్, హైదరాబాద్‌లకు చెందిన మొత్తం 72మంది కళాకారులు ములుగులోని రామప్ప ఆలయం, వరంగల్‌లోని హోటళ్లలో ప్రదర్శన ఇచ్చేందుకు సన్నద్ధులయ్యారు.

రామప్పలో ప్రత్యేక పూజలు.. కార్యక్రమాలు

మిస్ వరల్డ్-2025 పోటీల్లో పాల్గొనే సుందరీమణుల్లో 22మంది బుధవారం ములుగు జిల్లాకు రానున్నారు. వారి రాకకోసం జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయానికి రానున్న బృందం బుధవారం సాయంత్రం 4 గంటలకు జిల్లా కేంద్రంలోని హరిత హోటల్‌కు చేరుకుని.. అక్కడి నుంచి సాయంత్రం 4.30 గంటలకు సంప్రదాయ దుస్తులలో రామప్ప దేవాలయానికి చేరుకుని దైవ దర్శనం చేసుకుంటారు. వీరికి ఆలయ పూజారులు పూర్ణకుంభ స్వాగతం పలకనుండగా.. గైడ్స్ రామప్ప విశిష్టతను గురించి వివరిస్తారు. సాయంత్రం 5 గంటలకు దేవాలయ ప్రాంగణంలో అధికారులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను అందాల భామలు వీక్షిస్తారు. అతిథుల పర్యటన సజావుగా సాగేందుకు జిల్లా ఉన్నతాధికారులు ఈ ప్రాంతాన్ని పరిశీలించి, పరిస్థితులను అధ్యాయనం చేశారు. సుందరాంగులకు తగినట్లుగా రామప్ప పరిసర ప్రాంతాలను తీర్చిదిద్దారు. ప్రపంచ సుందరీమణులు రామప్పను సందర్శిస్తున్న నేపథ్యంలో పోలీసులు మూడంచెల బందోబస్తు ఏర్పాటు చేశారు. వెయి మంది పోలీసులతో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

ముస్తాబైన కోట

సుందరీమణుల రాకకోసం వరంగల్ కోట ముస్తాబైంది. మధ్యకోటలోని శిల్పాల ఆవరణలో కలెక్టర్ సత్యశారదతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఫొటోలతో పాటు కాకతీయుల కట్టడాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మధ్యకోటలోని శిల్పాలు బయటికి కనపడకుండా ప్రహరీ చుట్టూ నల్లటివస్త్రం కట్టారు. మధ్యకోట, తూర్పుకోటల నుంచి పర్యాటకులు రాకుండా బారికేడ్లు పెట్టి శిల్పాల ఆవరణను మూసివేస్తున్నారు. కాకతీయుల కాలంనాటి చరిత్రను తెలిపే లైట్ అండ్ సౌండ్ షో, లేజర్ షో, స్టాల్స్, చేనేత దరీస్‌లను ఏర్పాటు చేశారు. పేరిణీ నృత్యప్రదర్శన సిద్ధం చేశారు. వారంరోజులుగా మధ్యకోటలో లైట్ అండ్ సౌండ్ షోతో పాటు లేజర్ వెలుగులకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర పర్యాటకశాఖల అధికారులు ట్రయల్‌రన్ చేస్తున్నారు. మంగళవారం రాత్రి సైతం కలెక్టర్ సత్యశారద కోటను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.


సుందరీమణుల పర్యటన ఇలా...

ఓరుగల్లు చరిత్ర, సంస్కృతి, సంప్రదాయలను ప్రపంచానికి పరిచయం చేసే లక్ష్యంతో మిస్ వరల్డ్ పోటీదారులను చారిత్రత్మక, పర్యాటక ప్రాంతాలను తిలకించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. వీరి పర్యటనతో ఓరుగల్లు ఖ్యాతి విశ్వవ్యాప్తం కానుంది. సుమారు 120దేశాలకు చెందిన అందాలభామలు మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొంటున్నారు. వీరి పర్యటనను ఆయా దేశాలకు ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నారు. దీంతో ప్రపంచ వ్యాప్తంగా ఓరుగల్లు చరిత్రకు గుర్తింపు రానుంది. ఇప్పటికే వరంగల్ కోట, వెయ్యి స్తంభాల ఆలయం, రామప్ప ఆలయాలను విద్యుత్ కాంతులతో అలంకరించారు. జిగేల్ జిగేల్ మనేలా చారిత్రత్మక కట్టడాలు మెరిసిపోతున్నాయి. కాగా, బుధవారం 57మంది అందాలభామలను రెండు బృందాలుగా చేసి ఓరుగల్లు పర్యటనకు తీసుకవస్తున్నారు. మధ్యాహ్నం 2గంటలకు హైదరాబాద్ నుంచి 35మందితో కూడిన ఒక బృందం బయలుదేరి సాయంత్రం 4.35గంటలకు హనుమకొండ హరిత హోటల్‌కు చేరుకుంటుంది. హరిత హోటల్ నుంచి బయలుదేరి సాయంత్రం 5.45 గంటలకు చారిత్రక వెయ్యి స్తంభాల ఆలయాన్ని చేరు కుంటారు. ఆలయ విశిష్టత, నిర్మాణ శైలిని పరిశీలించి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తా రు. అనంతరం సాయంత్రం 6.25గంటలకు బయలుదేరి 6.40గంటలకు వరంగల్ కోటకు చేరుకుంటారు. కోటలోని విశిష్టతలను తెలుసుకుంటారు. కొద్దిసేపు విద్యార్థినులతో ముచ్చటించి అక్కడి నుంచి రాత్రి 7.35గంటలకు బయలు దేరి, హరిత హోటల్‌కు రాత్రి 7.55గంటలకు చేరుకుంటా రు. హరితలో డిన్నర్ అనం తరం రాత్రి 9గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరుతారు. అలాగే 22మందితో కూడిన మరో బృందం సాయం త్రం 5గంటలకు రామప్పకు చేరు కుంటుంది. రామప్ప ఆలయంలో శిల్పా సౌందర్యాన్ని, నిర్మాణశైలిని పరిశీలిస్తారు. అనంతరం సాయంత్రం 6.30 గంటలకు రామప్ప ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పేరిణీ నృత్యాన్ని తిలకిస్తారు. రాత్రి 7.30గంటలకు హరిత కాటేజీల్లో డిన్నర్ అనంతరం రాత్రి 8.30గంటలకు తిరిగి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అవుతారు.



పేరిణి నృత్య కళాకారులతో మామిడి హరికృష్ణ





మధ్యకోటలో గ్రిల్స్ చుట్టూ కట్టిన నల్లటి వస్త్రం

రామప్ప దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన వేదిక, పనులను పరిశీలిస్తున్న ములుగు కలెక్టర్ దివాకర



మాట్లాడుతున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

సుందరీమణుల పర్యటనకు పటిష్ఠ బందోబస్తు

వేయి మంది సిబ్బందితో నిఘా : వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, మే 13 (ఆంధ్రజ్యోతి): వేయిస్తంభాల ఆలయం, ఖిలా వరంగల్ కోటను బుధవారం ప్రపంచ సుందరీమణుల సందర్శించనున్న నేపథ్యంలో పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశామని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం కమిషనరేట్‌లో పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రపంచ సుందరీమణుల పర్యటించే ప్రాంతాలతో పాటు ఆయా రోడ్డు మార్గాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తీసుకున్న చర్యలు, తదితర వివరాల గురించి సెక్టార్ల వారీగా అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఉన్న సీసీ కెమెరాలతో పాటు సుందరీమణులు ఆయా ప్రాంతాల్లోకి చేరుకునేలోగా ఆదనంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పటిష్ఠ భద్రత కోసం వేయి మంది పోలీసులను రంగంలోకి దింపామని, ముగ్గురు డీసీపీలు, ఒక అదనపు డీసీపీ, 11మంది ఏసీపీలు, 32మంది సీఐలు, ఎస్సైలు, 81 మంది ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 155 మంది కానిస్టేబుళ్లు, 325 మంది మహిళా కానిస్టేబుళ్లు, 106 హోంగార్డులు, 210 డిస్ట్రిక్ గార్డులు, బాంబ్ డిస్పోజబుల్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొంటారన్నారు. సుందరీమణులు పర్యటించే ప్రాంతాల్లో ఇప్పటికే తనిఖీలు చేపట్టామన్నారు. తెలంగాణకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకువచ్చే స్థాయిలో అంతర్జాతీయ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందున ప్రతీ పోలీసు అధికారి అప్రమత్తంగా ఉండాలని సీపీ సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశించారు.

త్రిదళం.. త్రినయనం.. త్రివేణి సంగమం..

సరస్వతీ పుష్కర స్నానంతో మరింత పుణ్యం

మహదేవపూర్, మే 13(ఆంధ్రజ్యోతి) : కాళేశ్వర త్రివేణి సంగమం అంటే మూడు నదులు (గోదావరి, సరస్వతి, ప్రాణహిత) సంగమ స్థలం. త్రివేణిలో స్నానం చేస్తే సర్వ పాపాలు తొలగిపోయి పూర్వ జన్మ నుంచి విముక్తి లభిస్తుందని నమ్మకం. పరమ శివుడికి బిల్వదళం అంటే మహా ప్రీతి. ఈ నెల 15 నుంచి 26 వరకు సరస్వతీ నది పుష్కరాలు జరుగనున్నాయి. గోదావరి, ప్రాణహిత నదులతో కలిసి అంతర్వాహినిగా సరస్వతి నది ప్రవహిస్తున్నందున కాళేశ్వరంలో కూడా త్రివేణి సంగమంగా ప్రఖ్యాతి చెందింది. ఉత్తరాన ప్రయాగ వద్ద .. దక్షిణ భారత దేశంలో కేవలం త్రివేణి సంగమంలో మాత్రమే సరస్వతి నదీ అంతర్వాహినిగా ప్రవహిస్తోంది. పవిత్ర సరస్వతీ పుష్కరస్నానం చేసిన వారికి సమస్త పాపాలు తొలగిపోవునని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ప్రయాగలో గంగా, యమున, సరస్వతి నదులు కలువగా కాళేశ్వరం క్షేత్రం వద్ద ప్రాణహిత, వరద, వైన్య, గౌతమి, సరస్వతి నదులున్నాయి. అందుకే ఈ క్షేత్రం ప్రయాగ కంటే గొప్ప క్షేత్రమని నమ్ముతుంటారు.

విశ్వావసు నామ సంవత్సర వైశాఖ బహుల తదియ 15వ తేదీ గురువారం ఉదయం 5.40 గంటలకు వృషభ లగ్నం విధునరాశిలో బృహస్పతి ప్రవేశంతో సరస్వతీ పుష్కరాలు ప్రారంభం కానుండగా.. ఈ ప్రారంభ కార్యక్రమం పీఠాధిపతులు గురుమాధవానంద సరస్వతి స్వామి, మాధవానందస్వామి చేతుల మీదుగా జరగనుంది. అలాగే 12రోజుల పాటు సాయంత్రం 5 గంటల నుండి 7 గంటలకు ప్రముఖ ఆధ్యాత్మికవేత్తలతో ప్రవచనాలు, 7 గంటల నుంచి 8 గంటల వరకు త్రివేణి సంగమం వద్ద కాశీ పండితులతో నదీ హారతి, రాత్రి 8 గంటల నుండి రాత్రి 9.30 గంటల వరకు ప్రసిద్ధ కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

పుష్కర స్నానాలకు రానున్న స్వామీజీలు వీరే..

సరస్వతీ పుష్కరాల సందర్భంగా పలువురు పీఠాధిపతులు కాళేశ్వరానికి రానున్నారు. 15న మాధవానంద సరస్వతి స్వామి, 16న పరిపూర్ణానంద సరస్వతి స్వామి, 17న తుని తపోవన పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామి, 18న పుష్పగిరి పీఠాధిపతి అభినవోద్దాండస్వామి విద్యాశంకర భారతి మహాస్వామి, 19న నాసిక్ త్ర్యయంబకేశ్వర్ మహా మండలేశ్వర్ ఆచార్య సైదానంద సరస్వతి మహారాజ్ , 23న హంపీ విరుపాక్ష పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి, 25న యోగానంద సరస్వతి స్వామి ఇక్కడకు వచ్చి పుష్కర స్నానాలు ఆచరించనున్నారు.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం



పుష్కరాలను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక కృషితో ఈ సారి పుష్కరాలను కనీ విని ఎరుగని రీతిలో చేస్తున్నాం. సెట్టింగ్‌లు, సరస్వతీ విగ్రహం, టెంట్ సిటీ, తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ముఖ్యంగా తాగునీటి వసతి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి సౌకర్యం కలుగకుండా చూడాల్సిన బాధ్యత మాపై ఉంది. 12 రోజుల పాటు గోదావరి హారతిని వేద పండితులు, కాశీ విద్వాంసుల సూచనల మేరకు నిర్వహిస్తాం. - మహేష్, కాళేశ్వరాలయ ఈవో

15వ తేదీ ఉదయమే పుష్కరాలు ప్రారంభం



బృహస్పతి మిధునరాశిలోకి వచ్చినప్పుడు సరస్వతి పుష్కరాలు నిర్వహించడం జరుగుతుంది. 14వ తేదీ రాత్రి 10.35 గంటలకు మిధునరాశిలో బృహస్పతి ప్రవేశిస్తుండగా.. సూర్యాస్తమయం తర్వాత పుష్కర ఆహాహన చేయకూడదు కాబట్టి 15వ తేదీ గురువారం ఉదయం ఉదయం 5.44గంటలకు పుష్కరాలను ప్రారంభిస్తాం.

- పనకంటి నగేష్ శర్మ, ఉప ప్రధాన అర్చకులు



సిద్ధంగా ఉన్న టెంట్ సిటీ

టెంట్ సిటీ అదిరెన్..

22గంటలకు రూ.3వేలు అద్దె

ఒక్కో కాటేజీలో ఒక కుటుంబం ఉండేలా ఏర్పాటు

సరస్వతీ పుష్కరాలకు తరలివచ్చే భక్తులకు మెరుగైన వసతి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ క్రమంలో ఓ ప్రైవేటు సంస్థ ఏజెన్సీతో ఒప్పందం కుదుర్చుకుని గోదావరి ఒడ్డున టెంట్ సిటీ పేరుతో 40కాటేజీలు ఏర్పాటు చేశారు. ఒక్కో కాటేజీలో ఒక కుటుంబం లేదాఐదుగురు ఉండవచ్చు. 22గంటలకు గాను రూ.3వేలు అద్దె చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో అన్ని రకాల వసతులుంటాయి. ఎండ వేడిమిని తట్టుకునేందుకు ఏసీ సదుపాయాన్ని ఏర్పాటు చేశారు.

పుష్కరాలకు ప్రచారం..

రాష్ట్రంలో సరస్వతీ పుష్కరాలు జరుగుతున్న ఏకైక ప్రాంతం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో కాళేశ్వరం తరలి వచ్చేలా ప్రభుత్వం ప్రచారం చేస్తోంది. ఈ క్రమంలో కాళేశ్వరం, మహదేవపూర్, భూపాలపల్లి, వరంగల్ వరకు, అటు వైపు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు.



12 రోజులు.. 12 హోమాలు..

మహదేవపూర్, మే 13(ఆంధ్రజ్యోతి) : సరస్వతీ పుష్కరాల సందర్భంగా కాళేశ్వర ముక్తీశ్వర దేవస్థానం నందు ప్రత్యేక పూజలు, హోమాలు జరనున్నాయి. 12 రోజుల పాటు 12 హోమాలు నిర్వహించనుండగా.. అవి రోజూ ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతాయి. మొదటి రోజు దత్తాత్రేయ హోమం, శ్రీ కార్తవీర్యార్జున హోమం నిర్వహిస్తారు. రెండో రోజున సంకట హర చవితి హోమాన్ని నిర్వహిస్తారు. ఈ హోమంతో కష్టాలు ఇబ్బందులు తొలగుతాయని నమ్మకం. మూడోరోజు పంచమి శనివారం మేధాశక్తి, జ్ఞాపక శక్తి పెరగడానికి శ్రీ హయగ్రీవ హోమం, వివాహాలయ్యేందుకు స్వయం వర పార్వతి హోమం నిర్వహిస్తారు. నాలుగోరోజు ఆదివారం ఆరోగ్యం కోసం అరుణ హోమం, సంతానం కోసం శ్రీ పుత్ర కామేష్టి హోమం జరుపుతారు. ఐదో రోజు సోమవారం సప్తమి రోజున ఉన్నత చదువు, విదేశీ చదువు కోసం మేధా దక్షిణమూర్తి, హోమ గుండాలు, అపమృత్యు దోషాలు తొలగించడానికి మహా అమృత మృత్యుహోమం నిర్వహించారు. ఆరో రోజైన మంగళవారం అష్టమి రోజు ఆత్మస్థైర్యం, మనో ధైర్య శక్తి పెరగడానికి మన్ను సూక్త హోమం, అష్టమి రోజు దోష నివారణ, శత్రు సంహారానికి దుర్ఘటనలనుంచి రక్షణ, పట్టుదలతో వేగంగా పనులు అవడానికి హోమం ఉంటుంది. ఏడో రోజైన నవమిన బుధవారం దుష్ట శక్తులు, దుర్గంధాలు, తీవ్రమైన రోగాలు, మానసిక సంఘర్షణలు, దోషాలు తొలగడానికి , శత్రు దోషాలు, దృష్టి దోష నివారణ హోమం నిర్వహిస్తారు. అలాగే వాస్తు దోష నివారణకు సుదర్శన హోమం ఉంటుంది. ఎనిమిదో రోజు దశమి రోజు ధన, ధాన్య, ఐశ్వర్య ప్రాప్తి కోసం కుటుంబంలో దారిద్ర్యం, దురదృష్టం, ఆర్థిక ఇబ్బందులు తొలగేందుకు పితృదోష నివారణ కోసం శ్రీ సూక్త హోమం జరుపుతారు. తొమ్మిదో రోజు శుక్రవారం ఏకాదశిన గృహదోషాలు, పితృదోషాలు, వాస్తు దోషం లాంటి అనేక దోషాలు నివృత్తి అవ్వడానికి, దీర్ఘాయువు, ఆరోగ్యం కోసం శ్రీ పురుష సూక్త హోమం నిర్వహిస్తారు.

పదో రోజు శనివారం నవగ్రహ పీడలు తొలగడానికి, శత్రు సంహార, అపాయం తొలగడానికి, దురాత్మల ప్రభావం, చెడు దృష్టి నుంచి రక్షణ, మానసిక సమస్యల నుంచి బయట పడడానికి శ్రీ మత్స్య హోమం జరుపుతారు. పదకొండో రోజున మాస శివరాత్రి కావడంతో శరీరంలో ఉన్న వ్యాధి, పీడలు తొలగిపోవడానికి దీర్ఘాయువు కలగడానికి ధన, ధాన్య, ఐశ్వర్య ప్రాప్తి కోసం శ్రీ రుద్రహోమం ఉంటుంది. పన్నెండో రోజు.. చతుర్దశి కావడంతో కార్యసిద్ధి, అన్ని విషయాల్లో ఎదుగుదల, మానసిక శాంతి, ధైర్యం, ఆత్మస్థైర్యం, కలగడానికి అకస్మాత్తుగా వచ్చే ప్రమాదాలు , ఆపత్తులు నివృత్తి అవడానికి శ్రీ చండీ హోమం నిర్వహిస్తారు.

ప్రమాదాల నివారణకు రెడ్ సిగ్నల్



లోతుగా ఉన్న వద్ద రెడ్ సిగ్నల్ కర్ర

పుష్కరాలకు వచ్చి ముక్తీశ్వరుడిని దర్శించుకుని అందరూ క్షేమంగా ఇళ్లకు చేరుకోవాలని కోరుకుంటారు. ఈ క్రమంలోనే అధికారులు గోదావరి తీరంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గోదావరి నీటి మట్టం లోతుగా ఉన్న చోట రెడ్‌సిగ్నల్ కర్రలు ఏర్పాటు చేశారు. భక్తులు ఎవరూ ఆ రెడ్ సిగ్నల్ దాటి లోపలికి వెళ్లకూడదు.



బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

పుష్కరాలను ప్రారంభించేందుకు గురువారం సీఎం రేవంత్‌రెడ్డి రానున్న నేపథ్యంలో పుష్కర ఘాట్ సమీపంలో హెలిప్యాడ్ సిద్ధం చేశారు. ఈ క్రమంలో అప్రమత్తమైన పోలీసు యంత్రాంగం పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేస్తోంది. బాంబ్ స్క్వాడ్ బృందం నిరంతరం తనిఖీలు నిర్వహిస్తోంది.



పుష్కర ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

220సీసీ కెమెరాలతో నిఘా

భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉండటంతో కాళేశ్వరం గోదావరి తీరంలో పోలీసులు పటిష్ఠ నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశారు. పుష్కర ఘాట్, ఆలయ సమీపంలో, ఆలయ ప్రాంగణం, వీఐపీ ఘాట్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మొత్తం 220 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎండ నుంచి రక్షణగా..

ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో సరస్వతీ పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎండ దెబ్బ తగులకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ పరిసరాలు, పుష్కరఘాట్, ఇతర ప్రాంతాల్లో చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. రాజమండ్రి నుండి వచ్చిన బృందం చలువ పందిళ్లను చకచకా వేస్తోంది. అలా పలు ప్రాంతాల్లో భక్తులకు మజ్జిగ, తాగు నీరు అందించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి.



మామిడి రైతు కుదేలు



హనుమకొండ టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులకు కాలం కలిసి రాలేదు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయారు. కొద్దోగొప్పో వచ్చిన మామిడి దిగుబడికి ధరలు లేక దిగాలు చెందుతున్నారు. చేతికందొచ్చిన సమయంలో అకాలవర్షాలు కురిసి భారీగా కాయలు నేల వాలి తీవ్రంగా నష్టం జరిగిందని కన్నీటి పర్యంతమవుతున్నారు.

- ఈదురుగాలులు, అకాలవర్షాలతో తీవ్ర నష్టం
- దిగుబడి రాక, పంటకు గిట్టుబాటు లేక దిగాలు
- కౌలు రైతుల పరిస్థితి మరీ అధ్వానం
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

కౌలు రైతుల పరిస్థితి అధ్వాన్నం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మామిడి తోటలు కౌలుకు తీసుకొని సాగు చేసిన రైతులు గిట్టుబాటు ధరలు లేక తీవ్రంగా నష్టపోయారు. ఈదురు గాలులు, వడగళ్ల వానకు పంట దెబ్బతిన్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట దిగుబడి లేక వచ్చిన పంటకు ధరలు తగ్గడంతో పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో సాగు

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మామిడి తోటల సాగు వేల ఎకరాల్లో సాగుచేస్తున్నారు. హనుమకొండ జిల్లాలో 5,380 ఎకరాలు, వరంగల్ జిల్లాలో 5,960 ఎకరాలు, మహబూబాబాద్‌లో 14,000 ఎకరాలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 1200 ఎకరాలు, జనగామ జిల్లాలో 6,700 ఎకరాలలో రైతులు మామిడి తోటలు సాగుచేస్తున్నారు.

ఎకరానికి 3 టన్నుల దిగుబడి

మామిడి తోటలు సాగుచేస్తున్న రైతులు ఈ ఏడాది రెండు నుంచి మూడు టన్నుల వరకు దిగుబడి తగ్గినట్లు రైతులు చెబుతున్నారు. గతంలో 5 టన్నుల నుంచి 6 టన్నులు దిగుబడి వచ్చేదని, ఈ ఏడాది అకాల వర్షాలు, ఈదురుగాలులకు మామిడి తోటలలో కాయలు రాలిపోయి దిగుబడి సగానికి పడిపోయినట్లు రైతులు పేర్కొన్నారు.

క్వింటాల్‌కు రూ.2300

మామిడి కాయలను బహిరంగ మార్కెట్‌లో ధర తగ్గిందని రైతులు చెబుతున్నారు. ఒక క్వింటాల్‌కు రూ.2,300 మాత్రమే పలుకుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలీల ఖర్చు, ట్రావెల్ ఖర్చు వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. కౌలు రైతులకు దిగుబడి పడిపోయి మార్కెట్‌లో ధరలు లేక లక్షలల్లో నష్టం వాటిల్లిందని రైతులు చెబుతున్నారు.

తీవ్ర నష్టం వాటిల్లింది..: రైతు రమేష్, హనుమకొండ



ఈ ఏడాది కౌలుకు తీసుకొని మామిడి తోటలు సాగు చేశా. లాభాలు వస్తాయని ఆశించి లక్షల్లో పెట్టుబడి పెట్టాం. అకాల వర్షాలు తీవ్ర నష్టం మిగిల్చాయి. మార్కెట్‌లో ధరలు లేక పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు. కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.



వాతావరణంలో మార్పులే కారణం: డీహెచ్ఎస్‌వో జి.సంగీతలక్ష్మి



అకాల వర్షాలు ఒకవైపు, వాతావరణంలో ఏర్పడిన మార్పులతో మామిడి తోటల దిగుబడి తగ్గింది. అసాధారణ వాతావరణం, చీడపీడలు వృద్ధి చెందితే దిగుబడి తగ్గుతుంది. పంట చేతికందే సమయంలో అకాలవర్షాలు, ఈదురుగాలుల ప్రభావంతో మామిడి కాయలు నేల రాలి నష్టం రైతులకు వాటిల్లింది.

డిసిల్టింగ్ పనులు వేగవంతంగా పూర్తిచేయండి

మేయర్ గుండు సుధారాణి



డిసిల్టేషన్ పనులను పరిశీలిస్తున్న మేయర్

వరంగల్ కార్పొరేషన్, మే 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో జరుగుతున్న డిసిల్టింగ్ పనులలో వేగం పెంచాలని, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. మంగళవారం వరంగల్ బల్దియా పరిధిలోని 14,22వ డివిజన్‌లలో డిసిల్టేషన్ పనులను పరిశీలించారు. పోచమ్మమైదాన్, దేశాయిపేట ప్రాంతాల్లో పైపులైన్‌ల లీకేజీ, మురికికాల్వ పనుల పురోగతిపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. నగరం ముంపునకు గురికాకుండా ఉండేందుకు ముందస్తుగా వరంగల్ నగరంలోని పెద్దనాలాలలో డిసిల్టేషన్ పనులు నిబంధనలకు అనుగుణంగా పనులు చేయాలని అన్నారు. కచ్చానాలల పూడికతీత, బాక్స్ డ్రైన్స్‌లను వర్షాకాలం రాక ముందే శుభ్రం చేయాలని ఆదేశించారు. కొన్ని చోట్ల బాక్స్ డ్రైన్‌లు ఉన్నాయని, అందులో ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించి పనులు చేయాలన్నారు. కోట చెరువు యూటీ వద్ద పర్యటించి డిసిల్టేషన్ పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కావటి కవిత, బస్వరాజు కుమారస్వామి, ఏహెచ్‌వో డాక్టర్ రాజేశ్, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, డీఈలు రంగారావు, కృష్ణమూర్తి, టీపీఎస్ అనిల్ పాల్గొన్నారు.

డెయిరీ ఏర్పాటుతో మహిళల ఆర్థికాభివృద్ధి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి
- ఇద్దరు కలెక్టర్లతో కలిసి ములుకనూరు డెయిరీ సందర్శన



ముల్కనూర్ మహిళా డెయిరీ సంక్షేమ పథకాల గురించి ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారదలకు వివరిస్తున్న జనరల్ మేనేజర్

భీమదేవరపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): మహిళా డెయిరీ ఏర్పాటుతో మహిళల ఆర్థికాభివృద్ధి సాధిస్తారని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డితోపాటు హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్యశారదలు ముల్కనూర్ మహిళా డెయిరీని సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. పరకాల నియోజకవర్గంలోని దామెరలో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు మహిళా డెయిరీని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం ముల్కనూర్ మహిళా డెయిరీలో పరకాల నియోజకవర్గంలోని మహిళా రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని కొద్దిరోజులుగా అందిస్తున్నారు. ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. ముల్కనూర్ మహిళా డెయిరీ ద్వారా పాడిపరిశ్రమలో మహిళలు ఏ విధంగా పురోభివృద్ధి సాధిస్తున్నారనే వివరాలను మహిళా డెయిరీ అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ, డెయిరీ జనరల్ మేనేజర్ మార్పాటి భాస్కర్‌రెడ్డిలను అడిగి తెలుసుకున్నారు. డెయిరీ చేపడుతున్న అనేక సంక్షేమ కార్యక్రమాల గురించి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జనరల్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి ఎమ్మెల్యే, కలెక్టర్లకు వివరించారు. మహిళా డెయిరీ స్థితిగతులను తెలుసుకొని పరకాల నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని మహిళా రైతులతో మహిళా డెయిరీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందు కోసం 53 సహకార సంఘాలను పాల సేకరణ కోసం రిజిస్ట్రేషన్ చేయించినట్లు తెలిపారు. మహిళలకు రాజీవ్ యువ వికాస, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పాడి పశువులను కొనుగోలు చేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి అధికారులు మేన శ్రీనివాస్, కౌసల్యదేవి, డెయిరీ అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ, జనరల్ మేనేజర్ మార్పాటి భాస్కర్‌రెడ్డి, డీపీఎం సరిత, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో వీరేశం, ఏపీఎం దేవానంద్, వివిధ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లకు స్థలం కేటాయించండి

మడికొండ, మే 13(ఆంధ్రజ్యోతి): వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును మంగళవారం కడిపికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆయుష్మాన్ మందిర్‌ల మెడికల్ ఆఫీసర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. పీహెచ్‌సీ పరిధిలోని 1, 2, 3 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లకు స్థలం కేటాయించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎం.డి.రుక్మొద్దీన్, మెడికల్ ఆఫీసర్లు ఓంప్రకాశ్, ఇర్ఫాన్, సంతోష్, వినోద్, ఏఎన్‌ఎంలు, ఆశాలు ఉన్నారు.



ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజుకు వినతి పత్రం అందజేస్తున్న మెడికల్ ఆఫీసర్లు



ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో వాసంతి

ఉపాధ్యాయులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

వరంగల్ ఎడ్యుకేషన్, మే 13 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలో మొదటి విడత ఉపాధ్యాయుల శిక్షణలో పాల్గొంటున్న ఉపాధ్యాయులందరూ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఈవో డి.వాసంతి కోరారు. మంగళవారం హనుమకొండ భీమారంలోని స్కిల్‌స్పార్క్ పాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడారు. ఉపాధ్యాయులందరూ సమయపాలన పాటిస్తూ శిక్షణ తరగతులకు హాజరుకావాలన్నారు. ఆన్‌లైన్ విధానంతో ఉపాధ్యాయులు హాజరు నమోదు చేసుకోవాలన్నారు. శిక్షణలో ఆధునిక బోధన పద్ధతులను అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఉపాధ్యాయులకు ఏవైనా సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్‌హై, ఏఎంవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సోమిడిలో డ్రైయినేజీ పనులకు శంకుస్థాపన

కాజీపేట, మే 13 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట 62వ డివిజన్ సోమిడి ఎస్సీ కాలనీలో మంగళవారం డ్రైయినేజీ ప్రారంభ పనులకు స్థానిక కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ శంకుస్థాపన చేశారు. రూ.5లక్షల జనరల్ ఫండ్ నుంచి ఈ పనులు చేస్తున్నామని కార్పొరేటర్ చెప్పారు. కాలనీలో పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు మాచర్ల జయాకర్, కుమ్మరి నీలక్క, సుధాకర్, రవికిరణ్, కుమ్మరిస్వామి శ్రీనివాస్, విజయ్, బొంద్యాల్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ స్వాములకు అన్నదానం

న్యూశాయంపేట, మే 13 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ న్యూశాయంపేట సర్కిల్‌లో ఉన్న భక్తాంజనేయస్వామి దేవాలయంలో 600 మంది హనుమాన్ స్వాములకు మంగళవారం డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. యేటా స్వాములకు అన్నదానం చేస్తున్నామన్నారు.

విదేశీ కరెన్సీ నోట్లతో అలంకరణ

న్యూశాయంపేట, మే 13 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ పద్మాక్షిరోడ్‌లో ఉన్న హనుమద్గిరి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలోని హనుమంతుడికి మంగళవారం విదేశీ, ఇండియన్ కరెన్సీతో అలంకరించారు. ఉదయం స్వామివారికి ఆలయ అర్చకులు ఆరుట్ల రామాచార్యులు, కృష్ణాచార్యులు చందన సేవ చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం స్వాములకు అన్నదానంచేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గందె కృష్ణ, ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల రవికుమార్, కర్రు దశరథ్‌కుమార్, నరేందర్, సుధాకర్ పాల్గొన్నారు.



విదేశీ, ఇండియన్ కరెన్సీతో అలంకరించిన హనుమంతుడు

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో నలుగురికి జైలుశిక్ష

వరంగల్ క్రైం, మే 13 (ఆంధ్రజ్యోతి): డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 49మందిని మంగళవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఎ.వేణుగోపాల్ నలుగురికి రెండురోజుల చొప్పున జైలుశిక్ష విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సీతారెడ్డి తెలిపారు. మిగతా 45 మందికి రూ.43,500 జరిమానా విధించారన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని ముగ్గురికి రూ.1,500 జరిమానా విధించారన్నారు.

పోగొట్టుకున్న ట్యాబ్‌ను అందజేత

హనుమకొండ టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని స్నేహనగర్‌కు చెందిన గుగులోత్ రిషిక అనే విద్యార్థిని సోమవారం హైదరాబాద్‌లో పరీక్షరాసి మధ్యాహ్నం బస్సులో హనుమకొండకు చేరుకుంది. ఇంటికి వెళ్లిచూడగా ఫోన్ ట్యాబ్ కనిపించకపోవడంతో సుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే పోగొట్టుకున్న ట్యాబ్‌ను గుర్తించి బాధితురాలికి సీఐ పి.సత్యనారాయణరెడ్డి మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రామారావు, కానిస్టేబుల్ ఆలీ ఉన్నారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

కాజీపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాజీపేట రైల్వే సీఐ వడ్డే నరేశ్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వడ్డేపల్లి చెరువువద్ద మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి వయస్సు సుమారు 45ఏళ్లు ఉంటాయి. ఎత్తు 5.5, కోలముఖం, ఛామన ఛాయరంగు, కడుపు కుడి పక్కన పుట్టుమచ్చ, వంకాయరంగు టీషర్ట్, అదే రంగు షార్ట్ ధరించి ఉన్నాడు. రైల్వే ఉద్యోగుల సమాచారం మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపర్చామని, ఆచూకీ తెలిసిన వారు కాజీపేట రైల్వే హెడ్‌కానిస్టేబుల్ జి.ఉపేందర్ మొబైల్ నంబర్ 9247800433, 9948348070కు సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

కేయూ సివిల్ ఇంజనీరింగ్ బీవోఎస్‌గా శ్రీకాంత్

కేయూ క్యాంపస్ మే 13, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ సివిల్ ఇంజనీరింగ్ విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా వరంగల్ కిట్స్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఎం.శ్రీకాంత్‌ను నియమిస్తూ మంగళవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరు రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శ్రీకాంత్‌కు కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి తన చాంబర్‌లో నియామకపత్రాన్ని అందచేసి అభినందించారు.

కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక చట్టాలను అడ్డుకోవాలి

కేయూ క్యాంపస్ మే 13, (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలను అడ్డుకోవాలని అఖిల భారత విశ్వవిద్యాలయ ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు, కేయూ సాంకేతిక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం కేయూ సాంకేతిక ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేయూ సాంకేతిక ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రటరీ ఎస్. రాము. గౌరవ అధ్యక్షుడు వి. నందయ్య, కోశాధికారి వి. ప్రేమ్‌సాగర్, జాయింట్ సెక్రటరీ వై.బాబు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

హసన్‌పర్తి, మే 13 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధి కోమటిపల్లి రైల్వేగేటు శివారులో మంగళవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు కేయూసీ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ వెల్లడించారు. మృతుడు సుమారు 25 నుంచి 30 ఏళ్ల వయస్సు కలిగి, బూడిద రంగు ఫుల్ హ్యాండ్స్ టీషర్టు, బ్లూకలర్ జీన్స్ ప్యాంటు ధరించి మెడలో నలుపు రంగు దారం ఉందని తెలిపారు. మృతుడిని ఎవరైనా గుర్తు పడితే కేయూ పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌వో సెల్ నెం.87126 85115, ఎస్సై పి.శ్రీకాంత్ సెల్ 87126 85089, పీఎస్ సెల్ నెం.87126 85004 నెంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపర్చినట్లు ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ తెలిపారు.

ఇంటర్న్‌షిప్‌తో మెరుగైన నైపుణ్యాలు

- కెరీర్‌లో ఎదిగేందుకు అవకాశం
- నిట్ డైరెక్టర్ బిదాదర్ సుబుధీ
- ఘనంగా సమ్మర్ ఇంటర్న్‌షిప్ ప్రారంభం

హనుమకొండ, మే 13 (ఆంధ్రజ్యోతి): ఇంటర్న్‌షిప్ వల్ల విద్యార్థుల్లో నైపుణ్యాలు పెరుగుతాయని, కెరీర్‌పరంగా ఎదురయ్యే సవాళ్లను సులభంగా ఎదుర్కోగలుతారని వరంగల్ ఎన్ఐటీ డైరెక్టర్ బిద్యాదర్ సుబుధి అన్నారు. మంగళవారం వరంగల్ నిట్‌లో 2025 సంవత్సరానికి సంబంధించి సమ్మర్ ఇంటర్న్‌షిప్ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సుబుధి మాట్లాడుతూ.. ఈఇంటర్న్‌షిప్ విద్యార్థుల పరిశోధనా ప్రయాణానికి గొప్ప ప్రారంభం అన్నారు. ఈ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అకడమిక్స్ డీన్ ప్రొఫెసర్ ఎ శరత్‌బాబు ఎన్ఐటీలోని పరిశోధనా వాతావరణం గురించి వివరించారు. ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ ఇన్‌చార్జి ప్రొఫెసర్ ఎం.హీరాలాల్ కార్యక్రమం గురించిన అవగాహనను విద్యార్థులకు కలిగించారు. ఈ ఇంటర్న్‌షిప్ విద్యార్థుల పరిశోధనా నైపుణ్యాలను మెరుగుపరిచేలా రూపకల్పన చేసినట్టు చెప్పారు. చీఫ్‌వార్డెన్ ప్రొఫెసర్ అబ్దుల్ అజీమ్ విద్యార్థుల వసతి, సంక్షేమ, ఏర్పాట్ల గురించి వివరించారు. విద్యార్థులు ఈ ఇంటర్న్‌షిప్ ద్వారా మంచి అనుభవాన్ని సొంతం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, ఎంపికైన ఇంటర్న్ విద్యార్థులు హాజరయ్యారు. ప్రొఫెసర్ డి.భార్గవి వందన సమర్పణ చేశారు.



ఇంటర్న్‌షిప్ ప్రారంభ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధీ

219 మంది ఎంపిక

ఇంటర్న్‌షిప్ కోసం రెండు నెలల కిందట దేశవ్యాప్తంగా అండర్ గ్రాడ్యుయేట్, పోస్టుగ్రాడ్యుయేట్ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించారు. వీరిలో 219 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ ఇంటర్న్ జూలై 9వ తేదీ వరకు కొనసాగుతుంది. ఇంటర్న్‌షిప్‌లో భాగంగా నిట్‌లోని వివిధ విభాగాల్లోని ఆధునిక ప్రయోగశాలల్లో జరుగుతున్న పరిశోధనల్లో విద్యార్థులు పాల్గొంటారు. వీరికి సైన్స్, టెక్నాలజీరంగాల్లో చోటు చేసుకుంటున్న సరికొత్త పరిణామాలు, ప్రాజెక్టులపై అధ్యాపకులు మార్గనిర్దేశనం చేస్తారు.



కార్యాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న శ్రీనివాసరావు

గుడిసెవాసులకు పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు

వరంగల్ కార్పొరేషన్, మే 13 (ఆంధ్రజ్యోతి): పేదలు వేసుకున్న గుడిసెల స్థలాల్లో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ 2వ డివిజన్ గుండ్లసింగారంలో సీపీఐ ఆధ్వర్యంలో వేసుకున్న గుడిసెల వద్ద పార్టీ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడారు. నిరుపేదల పక్కా ఇండ్ల కోసం గుండ్లసింగారంలో చాలా కాలంగా పోరాడుతూనే ఉన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు వెంటనే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా ఇంకా పేదలు పేదరికంలోనే మగ్గుతున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు నెరవేర్చుకోలేని స్థితిలో ఉన్నాయని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బిక్షపతి, నాయకులు లింగారెడ్డి, తౌటం బిక్షపతి, సదానందం, శ్యాంసుందర్‌రెడ్డి, రవి. రాజేందర్, రాజన్న, మొగిలి, కృష్ణ, రాము, అమృతయ్య, నరేందర్, గోవర్ధన్, రామకృష్ణ, రజిత, సునిత పాల్గొన్నారు.

రేపు తెలంగాణ రాష్ట్ర స్థాయి శివశక్తుల సమావేశం

బాలసముద్రం, మే 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రస్థాయి శివశక్తుల సమావేశం ఈ నెల 15న నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ రాష్ట్ర అడ్వయిజర్ ఈవీ శ్రీనివాసరావు తెలిపారు. హంటర్ రోడ్డులోని నాని గార్డెన్‌లో నిర్వహించే ఈ సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, దనసరి సీతక్క, ఎంపీ కడియం కావ్య, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ అధ్యక్షురాలు ఓ లైలా కడియం కావ్యను ఆమె స్వగృహంలో సన్మానించినట్లు శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా లైలా మాట్లాడుతూ.. ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ సమస్యలు, వారి అభ్యున్నతికి అవసరమైన ప్రభుత్వ సహకారం గురించి కడియం కావ్యతో చర్చించినట్లు ఆయన తెలిపారు. ట్రాన్స్‌జెండర్ సముదాయం కోసం అవసరమైన సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తానని కడియం కావ్య వారికి హామీ ఇచ్చారు.



వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యను ఆహ్వానిస్తున్న రాష్ట్ర ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ అధ్యక్షురాలు లైలా

రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ఐక్యంగా ముందుకెళదాం

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

న్యూశాయంపేట, మే 13 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ఐక్యంగా ముందుకెళదామని వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు, సంస్థల ప్రతినిధులు పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి హనుమకొండలోని ముస్లిం కమ్యూనిటీ సెంటర్‌లో 'వక్ఫ్ బచావో-దస్తూర్ బచావో' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మైనారిటీలపై దాడులు పెరిగాయన్నారు. వక్ఫ్‌బోర్డు చట్ట సవరణకు వ్యతిరేకంగా అన్ని సంఘాలు ఐక్యంగా తిప్పికొట్టాలన్నారు. ఈ నెల 18వ తేదీన వరంగల్‌లోని ఇస్లామియా కాలేజీలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ మౌలానా ఫసియోద్దీన్ ఖాస్మీ, వివిధ పార్టీల ప్రతినిధులు, ప్రజాసంఘాల ప్రతినిదులు ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ రాజ్‌మహ్మద్, నున్నా అప్పారావు, రాంబ్రహ్మం, సాయిని నరేందర్, వెంగల్‌రెడ్డి, రమాదేవి, మహ్మద్ అలీ జుబేర్, మహ్మద్ జుబేర్‌బీఎస్, మున్నాభాయి, అబ్దుల్ సుభాన్, తాజుద్దిన్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీల ప్రతినిధులు, ప్రజాసంఘాల ప్రతినిధులు

15 నుంచి దూరవిద్య లైబ్రరీ సైన్స్ పరీక్షలు

కేయూ క్యాంపస్ మే 13, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం ఎంఎల్ఐఎస్సీ, బీఎల్ఐఎస్సీ లైబ్రరీ సైన్స్ కోర్సుల పరీక్షలు మే 15నుంచి నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సురేశ్ లాల్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ పద్మజలు మంగళవారం ప్రకటించారు. బీఎల్ఐఎస్సీ రెండో సెమిస్టర్ పరీక్షలు మే 15, 17, 19 తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయి. అలాగే ఎంఎల్ఐఎస్సీ మొదటి, రెండో సెమిస్టర్ పరీక్షలు మే 15, 17, 19, 21 తేదీల్లో ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో జరుగుతాయని వెల్లడించారు. వీరందరికీ దూరవిద్య కేంద్రంలో పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. బీఎల్ఐఎస్సీ, ఎంఎల్ఐఎస్సీ విద్యార్థులందరికి మే 22, 23, 24, 25 తేదీల్లో బ్యాచ్‌ల వారిగా ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు.

అందాల భామలకు బహుమతులు

హనుమకొండ కల్చరల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ సుందరీమణుల పోటీల్లో భాగంగా బుధవారం ఓరుగల్లును సందర్శించేవారికి వరంగల్ కోటలో రాష్ట్ర మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా బహుమతులను అందించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. రంగశాయిపేటకు చెందిన కళాకారులు కొంత కాలంగా ప్రత్యేక శ్రద్ధతీసుకొని రూపొందించిన చేనేత కలంకారి దర్రీస్, కాకతీయుల కళాతోరణంతో కూడుకున్న ప్రత్యేక జ్ఞాపికలను బహూకరించనున్నారు. జ్ఞాపికలో కాకతీయ కళాతోరణం చిత్రం, మధ్యలో రాణి రుద్రమ, కాకతీయ కళాతోరణాలతో అందంగా రూపొందించారు. బుధవారం నాటి ఓరుగల్లు పర్యటనలో అమెరికా దేశానికి చెందిన అర్జెంటీనా, బులీవియా, బ్రెజిల్, కొలంబియా, ఈకోడర్, మెక్సికో, పనామా, పెరు, వెనుజులా, హైతీ, హోండరస్, యునైటెడ్ స్టేట్స్ తదితర దేశాలకు చెందిన 23 మంది సుందరీమణులు పాల్గొంటారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ బోనాలు

అమ్మవారికి పట్నాలు, నూతన వస్త్రాల సమర్పణ

వడ్డెపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): డప్పు చప్పుళ్లు.. బాజాభజంత్రీలు.. ఢమరుక నాదాలు.. శివసత్తుల పూనకాలతో గోపాల్‌పూర్‌లో రేణుకా ఎల్లమ్మ బోనాల జాతరను గౌడ కులస్తులు భక్తి ప్రపత్తులతో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గోపాల్‌పూర్ గౌడ సంఘం అధ్యక్షుడు చింత రమేష్ గౌడ్, ఉపాధ్యక్షుడు దూలం శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కోలా రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ దూలం నీరజా రాజుగౌడ్, మాజీ సర్పంచ్ దూలం సదానందం ఆధ్వర్యంలో మధ్యాహ్నం రేణుకా ఎల్లమ్మ కాలనీలోని దేవాలయం వద్ద అమ్మవారికి అభిషేకాలను ఆలయ ప్రధాన పూజారి అయిన వేలు హరినాథ్‌శాస్త్రి, పట్నాలను వేసి, అమ్మవారికి నైవేద్యంతోపాటు నూతన వస్త్రాలను సమర్పించారు. ఆలయం ప్రాంగణంలోని గౌడ కులస్తుల ఇలవేల్పు కాటమయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం డప్పుచప్పుళ్లతో మహిళలు బోనాలను ఎత్తుకొని రేణుకా ఎల్లమ్మ దేవాలయానికి తరలివచ్చి గండ దీపం వెలిగించి అమ్మ వారికి పసుపు, కుంకుమలు, బెల్లం శాక సమర్పించి కొలిచారు. కార్యక్రమానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై రేణుకా ఎల్లమ్మదేవికి ప్రత్యేక పూజలు చేసి సల్లంగా దీవించమని వేడుకున్నారు.



గోపాల్‌పూర్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న గౌడ కులస్తులు

ఈ కార్యక్రమంలో గోపాల్‌పూర్ గౌడ సంఘం నేతలు వల్లాల రాజ్‌కుమార్ గౌడ్, దూలం వరదరాజు, చింత శ్రీనివాస్, దూలం సురేందర్, దూలం వెంకటేష్, జక్కు శ్రీనివాస్ గౌడ్‌తోపాటు మహిళలు అధిక సంఖ్యలో పాలొని అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేసి కానుకలను సమర్పించుకున్నారు.

నైపుణ్యం గల విద్యతోనే ఉన్నత అవకాశాలు

హసన్‌పర్తి, మే 13 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యంగల విద్యతోనే విద్యార్థులకు ఉన్నత అవకాశాలు సాధ్యమని ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని భీమారం ఎస్‌వీఎస్ కన్వెన్షన్ హాలులో పాలిసెట్ పరీక్ష రాసిన విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ తిరుమల్‌రావు మాట్లాడుతూ.. పాలిసెట్ ద్వారా డిప్లొమాలో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు కలిగే సౌకర్యాలను, ఉద్యోగ అవకాశాలతో పాటు ఉన్నత విద్యలో ఉండే అవకాశాలను వివరించారు. 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు పాలిటెక్నిక్‌లోని మెకానికల్, సివిల్, ఈసీఈ, సీఎస్ఈ, ఫార్మసీతో పాటు ఇతర టెక్నాలజీ కోర్సులలో చేరవచ్చన్నారు. ఈ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా ఉంటాయన్నారు. కోర్సులు పూర్తి చేసిన తరువాత బీటెక్‌లో లెటరల్ ఎంట్రీ అవకాశం ఉంటుందన్నారు. దేశవ్యాప్తంగా డీఆర్‌డీవో, బీహెచ్ఈఎల్, రైల్వే, మెట్రో వంటి సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కూడా ఉంటాయన్నారు. గ్రామీణ విద్యార్థులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యా, ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు ఎస్‌వీఎస్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావును శాలువాతో సత్కరించారు. ఈ కార్య క్రమంలో డాక్టర్ ఆర్.రమేష్, ప్రణీత్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఎస్‌వీఎస్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావును సన్మానిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



మృతుడికి నివాళి అర్పిస్తున్న పంచాయతీ సిబ్బంది

వడదెబ్బతో జీపీ పంపు ఆపరేటర్ మృతి

హసన్‌పర్తి, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతానాగారం గ్రామ పంచాయతీ పంపు ఆపరేటర్‌గా పనిచేస్తున్న దావ రాజేందర్ (40) మంగళవారం వడదెబ్బతో మృతిచెందినట్లు నాలుగో తరగతి ఉద్యోగ సంఘాల నాయకుడు చాతళ్ల సదానందం. తెలిపారు. మృతుడికి భార్య స్వప్న, కుమారుడు సాగర్ ఉన్నారని వారి కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎక్స్‌గ్రేషియాతో పాటు ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కారోబార్, బిల్‌కలెక్టర్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాతళ్ళ సదానందం ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం రాజేందర్ పార్థీవ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబాన్ని పరామర్శించిన వారిలో పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర నాయకుడు గుండ్లపెల్లి వెంకన్నగౌడ్, జిల్లా అధ్యక్షుడు తగరం శివ, కార్యదర్శి కుక్కముడి నరేష్, జోరుక రాజేందర్, దావ దేవేందర్, కూనూరు రమేష్, ఇల్లందుల సదానందం, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్ తదితరులున్నారు.

మందుల కొనుగోలులో అప్రమత్తత అవసరం

వరంగల్ మెడికల్, మే 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో నకిలీ, నాసిరకం మందులు అమ్మకాలు జరుపుతున్న క్రమంలో వినియోగదారులు మందుల ప్యాకింగ్‌పై క్యూఆర్ కోడ్ గమనించి మందులు కొనుగోలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఔషధ నియంత్రణ శాఖ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. వరంగల్ ఉమ్మడి జిల్లాలో జనరిక్ మందుల షాపుల పేరిట బోర్డులు పెట్టుకున్న మందుల షాపులు అమ్మకం చేస్తున్న మందులపై క్యూఆర్ కోడ్ ఉండటం లేదని, బ్రాండెడ్ మందులకే క్యూఆర్ కోడ్ ఉంటుందని ఔషధ నియంత్రణ శాఖ ప్రకటించింది. అయితే జనరిక్ మందులు షాపులు అమ్మకం చేస్తున్నవి జనరిక్ అయితే, వాటిపై జనరిక్ అని ప్రింట్ ఉండటం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం 2023 ఆగస్టు 1 నుంచి బ్రాండెడ్ మంతులపై క్యూఆర్ కోడ్ తప్పనిసరిగా ఉండాలని ఆదేశాలు జారీ చేసింది. అమ్మకాలు జరుపుతున్న మందులపై ఎలాంటి ముద్రలు ఉండటం లేదని ఇటీవల వినియోగదారుల మండలి జాతీయ ప్రతినిధులు సాంబరాజు చక్రపాణి, మొగిలిచర్ల సుదర్శన్‌లు హిమాచల్‌ప్రదేశ్‌లోని బుద్ది, సోలన్ ప్రాంతాల్లో సర్వే నిర్వహించినప్పుడు రాష్ట్రంలో అమ్మకం జరుగుతున్న కొన్ని మందులపై ఎలాంటి చిరునామా లేకుండా అమ్మకాలు జరుపుతున్నట్లు అక్కడి రాష్ట్ర అధికారులు ప్రకటించారని తెలిపారు. జనరిక్ మందుల అమ్మకాలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని వినియోగదారుల మండలి జాతీయ ప్రతినిధులు సాంబరాజు చక్రపాణి, మొగిలిచర్ల సుదర్శన్‌లు కోరారు.



విద్యార్థులకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్ గిర్రం భరద్వాజనాయుడు

గ్రీన్‌వుడ్ విద్యార్థుల విజయదుందుభి

హసన్‌పర్తి, మే 13 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ పది ఫలితాల్లో గ్రీన్‌వుడ్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేసినట్లు పాఠశాల డైరెక్టర్లు చల్లా ధర్మారెడ్డి, గిర్రం భరద్వాజ నాయుడు తెలిపారు. ఎర్రగట్టుగుట్ట క్రాస్‌రోడ్డులోని గ్రీన్‌వుడ్ హైస్కూల్‌లో జరిగిన సమావేశంలో మంగళవారం విడుదలైన ఫలితాల వివరాలను వారు వెల్లడించారు. పాఠశాలకు చెందిన పి.సహస్ర 496 మార్కులు, కె.హంసిక, పి.ఇందు ప్రియ, పి.మనోజ్ఞలు 492 మార్కులు, సీహెచ్.రిత్విక 489, బి.వైష్ణవి 486, ఆర్.అక్షర 485, బి.రిత్విక్ 482, ఎన్.సాన్విత్, కె.సత్యానంద్‌లు 481 మార్కులు సాధించగా 74 మంది విద్యార్థులు 470 పైగా మార్కులు సాధించినట్లు తెలిపారు. సీబీఎస్ఈ ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్లు చల్లా ధర్మారెడ్డి, గిర్రం భరద్వాజనాయుడు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ విజయంలో భాగస్వాములైన పాఠశాల జనరల్ మేనేజర్ ఎ.ప్రభుకుమార్, అకడమిక్ ప్రిన్సిపాల్స్ వి.నవీన్‌కుమార్, సి.మంజులదేవి, అడ్మినిస్ట్రేటివ్ ప్రిన్సిపాల్ టి.పవన్‌కుమార్, వైస్‌ప్రిన్సిపాల్ శ్రీకాంత్, వి.సురేష్‌కుమార్, ఫైనాన్స్ ఆఫీసర్ షేక్ రబ్బాని, మురళి, అకాడమిక్ కోఆర్డినేటర్లు హర్ష, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులను పాఠశాల డైరెక్టర్లు అభినందించారు.



ఎన్.సాన్విత్



కె.సత్యానంద్



బి.రిత్విక్



సీహెచ్.రిత్విక



బి.వైష్ణవి



ఆర్.అక్షర

టెన్త్ ఫలితాల్లో ఎస్ఆర్ విజయభేరి

హనుమకొండ, మే 13 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ బోర్డు ప్రకటించిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు విజయభేరి మోగించారు. ఎం.రిషి 500 మార్కులకు గాను 498 సాధించారు. వి.వివేకానంద రెడ్డి 487, కె.జస్వంత్ 487, బి.రుషికేష్ మూర్తి 485, ఎ.సాయి కష్యప్ 484, పి.అధిషాల్ రెడ్డి, కె.సాహిత్య 480 మార్కులు సాధించారు. ఇంతటి విజయానికి కారణం క్రమశిక్షణతో కూడిన విద్య, పటిష్టమైన పాఠ్య ప్రణాళిక, అంకిత భావం కలిగిన ఉపాధ్యాయ బృందం అని విద్యా సంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి తెలిపారు. తమ విద్యా సంస్థల్లో ఎస్ఎస్‌సీ విద్యార్థులకు ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్‌లో ఎక్కువ శ్రద్ధ తీసుకున్నట్టు తెలిపారు. ఈ విజయాన్ని సాధించిన విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులను, అధ్యాపకబృందానికి ఎ.వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, అభినందనలు తెలిపారు.



ఎం. రిషి



వివేకానంద రెడ్డి



కె. జస్వంత్



హృషికేష్ మూర్తి



సాయి కష్యప్



సాయి హర్షిణి



ఆర్. స్వాస్తిక



సీహెచ్ హన్సిక



కె. అంజనాజోషి

ట్వెల్త్ పరీక్షా ఫలితాల్లో ఎస్ఆర్ ప్రభంజనం

హనుమకొండ, మే 13 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ బోర్డు ప్రకటించిన సీబీఎస్ఈ ట్వెల్త్ పరీక్షా ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు విజయభేరి మోగించారు. ఎస్ఆర్ విద్యాసంస్థలకు చెందిన జి.సాయి హర్షిణి జాతీయ స్థాయిలో 500 మార్కులకు గాను 480 సాధించింది. ఆర్.స్వాస్తిక 478, సీహెచ్ హన్సిక 477 సాధించి ఎస్ఆర్ ప్రతిష్ఠను జాతీయ స్థాయిలో నిలబెట్టారు. అలాగే కె.అంజనా సంతోషి 475, ఎ. అమూల్య 472, వి .ప్రత్యూష్నరెడ్డి 470 సాధించారు. విద్యార్థులు సాధించిన ఈ విజయాలపై ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.



సిద్దమూర్తి జ్ఞానతేజరెడ్డి



గంగి ఉదయ్ నిక్షిత్



లడె శ్రీవిద్య



సబ్బని నందిత



భవ్యాన్ష్ అగర్వాల్

మరోసారి సత్తా చాటిన తేజస్వీ

హసన్‌పర్తి, మే 13 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ - 2025 పది ఫలితాల్లో తేజస్వీ పాఠశాల విద్యార్థులు ఉత్తమ మార్కులతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో విజయదుంధుబి మోగించి మరోసారి సత్తాచాటినట్లు తేజస్వీ విద్యా సంస్థల చైర్మన్ రేవూరి జెన్నారెడ్డి తెలిపారు. మండలంలోని ఎర్రగట్టుగుట్ట, హంటర్‌రోడ్డు బ్రాంచ్‌లలో ఉత్తమ స్థాయిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థుల ఫలితాలను ఆయన వెల్లడించారు. సిద్దామూర్తి జ్ఞానతేజస్వీ, గంజి ఉదయ్ నిక్షిత్ 487 మార్కులు, లడె శ్రీవిద్యలు 481 మార్కులతో ఉత్తమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. అలాగే ఎస్.నందిత 479, భవ్యాంశ్ అగర్వాల్ 476, భూక్య శ్రీ కృష్ణ కౌశిక్ 473, ఎం.సునైన రీతుల్ 472, కె.మీనాక్షి 471 మార్కులు సాధించినట్లు తెలిపారు. గత చరిత్రను ఎప్పటిలాగానే కొనసాగిస్తూ ఉత్తమ స్థానాన్ని నిలబెట్టుకుందన్నారు. ఈ విజయపరంపర కొనసాగించిన విద్యార్థులకు వారి వెనక నుండి సహకరించిన బోధన, బోధనేతర సిబ్బందికి, తల్లిదండ్రులకు విద్యా సంస్థల చైర్మన్ జెన్నారెడ్డి అభినందనలు తెలిపారు.

పది ఫలితాల్లో ఏకశిల విజయకేతనం

రాంనగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ ఫలితాల్లో ఏకశిల విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి విజయకేతనం ఏగురవేసినట్లు ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా అత్యుత్తమ మార్కులు సాధించిన ఎం.సుహాసిని (487), ఎల్.సౌమిత (486) పి.సాయిపార్థిక్ (483)లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏకశిల విద్యాసంస్థల డైరెక్టర్ బేతి కొండల్‌రెడ్డి, గౌరు సువిజా తిరుపతిరెడ్డి, ముచ్చ జితేందర్‌రెడ్డి, గౌరు రిశ్విక్ రెడ్డి, సీహెచ్. దినేశ్‌రెడ్డి, ప్రినిపాల్స్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి, డైరెక్టర్లు సువిజారెడ్డి, రిశ్విక్‌రెడ్డి

సత్తా చాటిన బిర్లా ఓపెన్ మైండ్స్

న్యూశాయంపేట, మే13(ఆంధ్రజ్యోతి) : సీబీఎస్‌సీ పది ఫలితాలు మంగళవారం ప్రకటించారు. ఈ ఫలితాల్లో వరంగల్‌లోని బిర్లా ఓపెన్‌మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటినట్లు స్కూల్ చైర్మన్ నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. సాదుర్ల వైనవి 485 మార్కులు సాధించి స్కూల్ ప్రథమ స్థానంలో నిలిచింది. ఎల్.హిమదిత్వ 478 మార్కులు, టి.రవితేజ 475, కె.హాసిని 473ఎ జి. శ్రీసహస్ర 471, సీ.హెచ్ కృష్ణ చైతన్య 466 మార్కులు, కె.తనుశ్రీ 465 మార్కులు సాధించినట్లు చైర్మన్ తెలిపారు. సత్తా చాటిన విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు.



సాదుర్ల వైనవి



శ్రీసహస్ర



రవితేజ



హిమద్విత

రామానుజన్ సీబీఎస్ఈ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

న్యూశాయంపేట, మే13(ఆంధ్రజ్యోతి) : సీబీఎస్ఈ 10వ తరగతి ఫలితాల్లో హనుమకొండలోని రామానుజన్ సీబీఎస్ఈ స్కూల్ విద్యార్థులు అత్య ధిక మార్కులు సాధించి ప్రతిభ చాటినట్లు పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి తెలిపారు. మంగళవారం విడుదలైన ఫలితాలలో పాఠశాలకు చెందిన శ్రీలక్ష్మి ప్రియ 500 మార్కులకుగాను 389 మార్కులు, ఆర్యన్‌కు 380 మార్కులు, బిట్టునాయక్‌కు 375 మార్కులు, వర్షిణికి 369మార్కులు సాధించి సత్తా చాటారని, అలాగే మిగతా విద్యార్థులు 300కుపైగా మార్కులు సాధించినట్లు రాజిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ ముచ్చ రాజిరెడ్డి, కరస్పాండెంట్ ముచ్చ అరుణ, ఏఐసీసీ సభ్యులు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అభినందించారు.



ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

గుట్కాలు పట్టివేత

వరంగల్ క్రైం, మే 13 (ఆంధ్రజ్యోతి): సంగెం పీఎస్ పరిధిలోని గవిచర్లలో రూ.1,48,070 విలువ చేసే గుట్కాలను పట్టుకొని వ్యాపారి మాదారపు రమేశ్ అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. మహబూబాబాద్‌కు చెందిన సప్లయర్ ఆర్ఆర్ ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకుడు ప్రశాంత్ పరారీలో ఉన్నాడని, అతడి ద్విచక్రవాహనంను సీజ్ చేశామన్నారు. అదేవిధంగా తీగరాజుపల్లిలో గుండా జనార్దన్ అనే కిరాణా వ్యాపారి నుంచి రూ.17,200 విలువ చేసే గుట్కాలను స్వాధీనం చేసుకొని స్థానిక పోలీసులకు అప్పగించామన్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు

విస్తృత ఏర్పాట్లు

- హాజరుకానున్న 2,01,238 మంది విద్యార్థులు
- మూడు ఉమ్మడి జిల్లాల్లో 118 పరీక్షల కేంద్రాలు
- ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో నిర్వహణ

కేయూ క్యాంపస్ మే 12, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల నిర్వహణకు వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఎండాకాలం నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ ఎం.తిరుమదేవి, డాక్టర్ పి.వెంకటయ్యలు జూమ్ మీటింగ్‌లో పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లకు దిశానిర్దేశం చేశారు. సోమవారం మధ్యాహ్నం ఉమ్మడి ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో కళాశాల ప్రిన్సిపాళ్లకు, చీఫ్ సూపరింటెంట్లకు జూమ్ మీటింగ్‌లో నిర్వహించారు. పలు సందేహాలను నివృత్తి చేశారు.

2,01,238 విద్యార్థుల హాజరు

ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో బీఏ, బీకామ్, బీఎస్సీతో పాటు ఇతర కోర్సుల్లో 2,4,6 రెగ్యులర్ సెమిస్టర్‌లతోపాటు 1,3,5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 2,01,238 మంది హాజరుకానున్నారు. వీరందరికీ మూడు ఉమ్మడి జిల్లాల్లో 118 పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రైవేట్, ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లోనూ పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్‌లో 47, ఖమ్మంలో 25, వరంగల్‌లో 46 పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారులు వెల్లడించారు.

టైం టేబుల్ ఇదే..

- **ఆరో సెమిస్టర్** : మే 14, 16, 19, 21, 23, 26, 28, 30, జూన్ 3, 05, 11, 12, 13 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు.
- **నాలుగో సెమిస్టర్** : మే 15, 17, 20, 22, 24, 27, 29, 31, జూన్ 4 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు.
- **రెండో సెమిస్టర్** : మే 14, 16, 19, 21, 23, 26, 28, 30 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు.
- **బ్యాక్‌లాగ్ మొదటి సెమిస్టర్** : మే 17, 18, 19, 20, 21, 23, 24, 25 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు.
- **బ్యాక్‌లాగ్ మూడో సెమిస్టర్**: మే 16, 17, 18, 19, 20, 21, 23, 24, 25 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు.
- **బ్యాక్‌లాగ్ ఐదో సెమిస్టర్** : మే 17, 20, 22, 24, 27, 29, 31, జూన్ 4 ,10 ,11 12, 13 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు.

15 నుంచి జిల్లాస్థాయి టూ-డే క్రికెట్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్, మే13 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15, 16 తేదీల్లో వంగపల్లి క్రికెట్ మైదానంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్- 25 బాలుర టూ-డే క్రికెట్ లీగ్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 19నుంచి మే చివరి వారం వరకు నగరంలో వివిధ క్రీడా మైదానాల్లో నిర్వహించనున్న అంతర్ జిల్లా స్థాయి టూ-డే క్రికెట్ లీగ్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, జనగామ, మహబూబాబాద్, జిల్లాల వారిగా 6జట్లను అంతర్ జిల్లా స్థాయి టూ-డే క్రికెట్ లీగ్ పోటీల్లో పాల్గొనడానికి ఎంపిక చేస్తామన్నారు. నగరంలోని రెడ్డిపురం, మొగిలిచర్ల, వంగపల్లి క్రికెట్ క్రీడామైదానాల్లో దాదాపు 11రోజుల పాటు నిర్వహించనున్న అంతర్ జిల్లాల క్రికెట్ లీగ్ పోటీల్లో ఈ 6జట్ల మధ్య పోరు కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన జట్టును జూన్ మొదటి వారంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న టూ-డే క్రికెట్ లీగ్ మ్యాచ్‌లకు ఎంపిక చేస్తామన్నారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు 17నుంచి 25 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండి, 31ఆగస్టు 2000 సంవత్సరం తర్వాత జన్మించిన వారు అర్హులను ఆయన వెల్లడించారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు తమ ఆధార్‌కార్డు, మీసేవ నుంచి జారీచేసిన జనన ధృవీకరణ పత్రం వెంటతీసుకొని ఈ నెల 15న వంగపల్లిలోని క్రికెట్ క్రీడా మైదానంలో ఉదయం 7గంటలకు రిపోర్టు చేయాలని శ్రీనివాస్ తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ 9849570979 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ప్రశాంతంగా పాలిసెట్

92.48 శాతం విద్యార్థుల హాజరు ● ఎల్బీ కళాశాల కేంద్రం వద్ద ట్రాఫిక్ జామ్ ● విద్యార్థులకు ఇబ్బందులు

వరంగల్ ఎడ్యుకేషన్, మే 13 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలిసెట్-2025 ప్రశాంతంగా ముగిసింది. మంగళవారం నగరంలో నిర్వహించిన 12 పరీక్ష కేంద్రాల్లో 92.48 శాతం విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 6,424 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 5,941 మంది హాజరయ్యారు. రాష్ట్ర సాంకేతిక విద్యామండలి నుంచి ప్రత్యేక పరిశీలకులుగా గుగులోత్ రాములు పరీక్ష కేంద్రాలను సందర్శించి పరీక్షతీరును పరిశీలించారు. పరీక్షను ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించిన అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి పాలిసెట్-25 కన్వీనర్ డాక్టర్ బైరి ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు.



వరంగల్ పాలిటెక్నిక్ కళాశాల కేంద్రంలో పరీక్ష తీరును పరిశీలిస్తున్న కన్వీనర్ డాక్టర్ బైరి ప్రభాకర్

కాగా, ఎల్బీ కళాశాలలో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా నిర్వాహకులు, పోలీసుల నిర్లక్ష్యంతో ఎల్బీ కళాశాల ప్రధాన ద్వారం నుంచి భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో విద్యార్థులకు ఇబ్బందులకు గురయ్యారు. బందోబస్తు కోసం వచ్చిన ఇంటర్‌సెప్టర్ వాహనంలోని పోలీసు సిబ్బంది కళాశాల అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ ముందు చెట్ల కింద సేదతీరుతూ ట్రాఫిక్‌ను నియంత్రించలేదు. పరీక్ష సమయానికి 10 నిమిషాల ముందు మట్టెవాడ సీఐ గోపి కేంద్రానికి చేరుకొని కొంత మేరకు ట్రాఫిక్‌ను నియంత్రించే ప్రయత్నం చేశారు.



ఎల్బీ కళాశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కిక్కిరిసిన రోడ్

పంట మార్పిడితో అధిక దిగుబడి

ప్రాంతీయ పరిశోధనా స్థానం వరంగల్ సహ పరిశోధన సంచాలకుడు ఉమారెడ్డి

వరంగల్ వ్యవసాయం, మే 13(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం దగ్గర పడుతున్న నేపథ్యంలో రైతులు సాగుకు సమాయత్తం కావాలని ప్రాంతీయ పరిశోధన స్థానం వరంగల్ సహ పరిశోధన సంచాలకుడు ఆర్.ఉమారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. అధిక పంట దిగుబడి పొంది మంచి ఆదాయాన్ని ఆర్జించాలంటే వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలను పాటించాలన్నారు. వర్షాకాలం దగ్గర పడుతున్నందున దుక్కులను లోతుగా దున్నుకోవాలన్నారు. పంట మార్పిడి తప్పనిసరిగా చేయాలని, అప్పుడే అధిక దిగుబడి వచ్చే అవకావం ఉంటుందని తెలిపారు. పత్తి, మొక్కజొన్న, లేదా వరి కొయ్యలుంటే వాటిని అక్కడే కాల్చవద్దన్నారు. అవసరం ఉన్న చోట మృత్తిక (భూసార)పరీక్షలు చేయించుకోవాలని, తద్వారా ఎరువులను ఒక క్రమపద్ధతిలో వేసుకోవడానికి వీలవుతుందని చెప్పారు. సాగు చేయాలనుకున్న భూమిలో తొలుత పచ్చిరొట్ట పంటలను వేసుకోవాలని, సాగు సమయం వచ్చేసరికి ఆ పంటలను అందులోనే కలిసిపోయేట్టు కలియదున్ని పంటలను సాగు చేయాలన్నారు. తొలకరి జల్లులు పడగానే తొందరపడి విత్తనాలు వేయొద్దని, భూమిలో ఉండే అధిక వేడికి అవి మొలకెత్తవని అన్నారు. ఎర్ర చెలుక నేలలైతే 70 మి.మీ. వర్షపాతం, నల్లరేగడి నేలలైతే 60 మి.మీ. వర్షపాతం నమోదైతేనే విత్తనాలు వేసుకోవాలని సూచించారు. రైతులందరూ ఒకే రకం హైబ్రిడ్/ విత్తనాలను ఎంచుకోవద్దని సూచించారు. మంచి యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి వస్తుందని అన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

కాజీపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాజీపేట రైల్వే సీఐ వడ్డే నరేశ్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వడ్డెపల్లి చెరువువద్ద మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి వయస్సు సుమారు 45 ఏళ్లు ఉంటాయి. ఎత్తు 5.5, కోలముఖం, ఛామన ఛాయరంగు, కడుపు కుడి పక్కన పుట్టుమచ్చ, వంకాయరంగు టీషర్ట్, అదే రంగు షార్ట్ ధరించి ఉన్నాడు. రైల్వే ఉద్యోగుల సమాచారం మేరకు మృతదేహాన్ని ఎంజీఎంలో భద్రపర్చామని, ఆచూకీ తెలిసిన వారు కాజీపేట రైల్వే హెడ్‌కానిస్టేబుల్ జి.ఉపేందర్ మొబైల్ నంబర్ 9247800433, 9948348070కు సమాచారం ఇవ్వాలన్నారు.

సీబీఎస్‌ఈ ఫలితాల్లో బాలికలదే పైచేయి

» 10వ తరగతిలో 93%, 12వ తరగతిలో 88% ఉత్తీర్ణత

» ఒక్క పరీక్షే శక్తి సామర్థ్యాలను నిర్వచించలేదు: మోదీ

న్యూఢిల్లీ, మే 13: సీబీఎస్‌ఈ పదో, 12వ తరగతి పరీక్షా ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు. 12వ తరగతి పరీక్షల్లో బాలికలు 91.64 శాతం మంది ఉత్తీర్ణులైతే, బాలురు 85.70 శాతం మంది పాస్ అయ్యారు. మొత్తంగా పదో తరగతిలో 93% మంది విద్యార్థులు, 12వ తరగతిలో 88% మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. దేశవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ రీజియన్‌లో అత్యధికంగా 99.60% మంది ఉత్తీర్ణులయ్యారు. 10వ తరగతిలో కర్నూల్ జిల్లా పత్తికొండ విద్యార్థిని లాస్య రెడ్డి జాతీయ స్థాయిలో మూడో ర్యాంక్ సాధించింది. విజయవాడ రీజియన్ తర్వాత తిరువనంతపురం రెండో స్థానంలో నిలిస్తే, ప్రయాగ్‌రాజ్ రీజియన్ పరిధిలో అతి తక్కువ మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. జవహర్ నవోదయ విద్యాలయాల విద్యార్థులు 99.9 శాతం పాసైతే, ప్రైవేటు, ఇండిపెండెంట్ స్కూళ్ల విద్యార్థులు 87.94 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 16,92,794 మంది 12వ తరగతి విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, వారిలో 1.29 లక్షల పై చిలుకు మంది కంపార్ట్‌మెంట్ విద్యార్థులున్నారు. విద్యార్థుల్లో అనారోగ్య పోటీ తత్వం పెరుగకుండా ఉండేందుకు ఉత్తీర్ణులైన విద్యార్థులకు డివిజన్లు ఇవ్వడం లేదన్న సీబీఎస్‌ఈ పరీక్షల నియంత్రణాధికారి సాన్యం భరద్వాజ.. అత్యధిక మార్కులు సాధించిన టాప్ 0.1 శాతం విద్యార్థులకుమెరిట్ సర్టిఫికెట్లు జారీ చేస్తామన్నారు. ఇక, సీబీఎస్‌ఈ 10వ, 12వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు అభినందనలు తెలిపిన ప్రధాని మోదీ.. కేవలం ఒక్క పరీక్ష మాత్రమే వారి శక్తి, సామర్థ్యాలను నిర్వచించలేదని తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. 'మీ ప్రయాణం చాలా పెద్దది. ఉత్సుకతతో, విశ్వాసంతో ముందుకు సాగండి' అని పేర్కొన్నారు.

బుర్కినాఫాసోలో జిహాదీ దాడి..100 మంది మృతి

బమాకో, మే 13: పశ్చిమ ఆఫ్రికా దేశం బుర్కినా ఫాసో ఉత్తర ప్రాంతంలో ఆల్‌ఖైదా అనుబంధ జిహాదీ సంస్థ ఆదివారం తెల్లవారుజామున జరిపిన వేర్వేరు దాడుల్లో వంది మందికి పైగా మృత్యువాత పడ్డారు. మృతుల్లో అత్యధికులు సైనికులు, సహాయ కార్యకర్తలు, స్థానికులు ఉన్నారని అసోసియేటెడ్ ప్రెస్ సోమవారం తెలిపింది. సైనిక కేంద్రంతోపాటు సుదీర్ఘకాలంగా ఆక్రమణలో ఉన్న వ్యూహాత్మక పట్టణం జిబో తదితర ఎనిమిది ప్రాంతాల్లో దాడులు జరిగాయి. ఈ దాడికి తమదే బాధ్యత అని ఆల్‌ఖైదా అనుబంధ జమాత్ నాజర్ అల్ ఇస్లామ్ వాల్ ముస్లిమీన్ (జేఎన్ఐఎం) ప్రకటించుకున్నది.

గోవాలో అణువిద్యుత్ ప్లాంటు ఏర్పాటుపై రగడ

» మరో ప్రత్యామ్నాయం లేదు: కేంద్రమంత్రి ఖట్టర్

» ప్లాంట్ ఏర్పాటును అడ్డుకుంటాం: కాంగ్రెస్, ఆప్

పనాజీ, మే 13: గోవాలో అణు విద్యుత్ ప్లాంటు ఏర్పాటుపై అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీల మధ్య వివాదం రాజుకుంది. కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి మనోహర్ ఖట్టర్ ఈ అంశంపై గోవా సీఎం ప్రమోద్ సావంత్, మంత్రులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మరో ప్రత్యామ్నాయం లేకనే గోవాలో అణు విద్యుత్ ప్లాంటు ఏర్పాటుకు పరిశీలన జరుపుతున్నామన్నారు. 2047 నాటికి దేశంలో అణు విద్యుత్ ఉత్పత్తిని అనేక రెట్లు పెంచాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు. అయితే, బీజేపీ ప్రమాదకరమైన ప్రయోగాలు చేయడానికి గోవా ఏమీ ప్రయోగశాల కాదని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అమిత్ పట్కర్ మండిపడ్డారు. ఈ ప్రతిపాదనను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే గోవాలోని కొండలను, అడవులను, నదులను, వ్యవసాయాన్ని బీజేపీ నాశనం చేసిందన్నారు. ఇప్పుడు అణు ముప్పుతో ప్రజల ప్రాణాలనూ పణంగా పెట్టాలనుకుంటున్నారని విమర్శించారు. ఆప్ గోవా అధ్యక్షుడు అమిత్ కూడా అణువిద్యుత్ ప్లాంటు ఏర్పాటు ప్రతిపాదనను వ్యతిరేకించారు.

రిటైర్మెంట్ తర్వాత ఏ పదవీ తీసుకోను

న్యాయరంగానికి సేవలు కొనసాగిస్తా.. పదవీకాలం చివరిరోజున సీజేఐ సంజీవ్‌ఖన్నా స్పష్టీకరణ

» తదుపరి సీజేఐ గవాయ్ తనకు బలమైన మద్దతుదారుగా నిలిచారని వెల్లడి



న్యూఢిల్లీ, మే 13: పదవీ విరమణ అనంతరం ఏ అధికారిక పదవినీ చేపట్టబోనని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సంజీవ్‌ఖన్నా స్పష్టం చేశారు. సీజేఐగా తన పదవీకాలం చివరిరోజైన మంగళవారం విధుల అనంతరం సుప్రీంకోర్టు ఆవరణలో జస్టిస్ ఖన్నా విలేకర్లతో మాట్లాడారు. రిటైర్మెంట్ అనంతరం అధికారిక పదవులను వేటినీ తీసుకోనప్పటికీ, న్యాయరంగానికి సంబంధించి సేవలను మాత్రం తప్పకుండా కొనసాగిస్తానని స్పష్టం చేశారు. అంతకుముందు జస్టిస్ గవాయ్, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కలిసి ధర్మాసనంలో జస్టిస్ ఖన్నా విధులు నిర్వర్తించారు. అనంతరం, సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ తనకు నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ ఖన్నా మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు విలువలను, రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులను, మౌలిక రాజ్యాంగ నిబంధనలను కొత్త ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ గవాయ్ కచ్చితంగా నిలబెడతారని తాను నమ్ముతున్నానన్నారు. 'జస్టిస్ గవాయ్, నేను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఒకే ఏడాది పదోన్నతి పొందాం. ప్రస్తుతం కొలీజియంలో ఉన్నాం. పలు సందర్భాల్లో మేం పరస్పరం చర్చించుకున్నాం. జస్టిస్ గవాయ్ నాకు అత్యంత బలమైన మద్దతుదారుగా నిలిచారు' అని వెల్లడించారు. న్యాయమూర్తిగా తనకు ఎన్నో మధుర జ్ఞాపకాలున్నాయని, వాటిని జీవితాంతం గుర్తుంచుకుంటానన్నారు. న్యాయవ్యవస్థ అంటే న్యాయమూర్తులు మాత్రమే కాదని, బార్ (న్యాయవాదులు) కూడా దాంట్లో భాగమని, ప్రజల్లో న్యాయవ్యవస్థ పట్ల నమ్మకాన్ని పెంచేలా చేయటంలో న్యాయవాదుల పాత్ర కూడా కీలకమని తెలిపారు. విభిన్న ప్రాంతాలకు చెందిన న్యాయమూర్తులు సుప్రీంకోర్టులో ఉండటంపై జస్టిస్ ఖన్నా హర్షం వ్యక్తం చేశారు. 'దేశంలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన జడ్జీలు ఉండటం వల్ల సుప్రీంకోర్టుకు ఎనలేని బలం చేకూరింది. వేర్వేరు నేపథ్యాలు, వేర్వేరు ఆలోచనా ధోరణులు గల న్యాయమూర్తుల మధ్య జరిగిన చర్చలు పలు రకాల పరిష్కారాలను, సరైన మార్గాన్ని చూపాయి' అని ఆయన వెల్లడించారు. జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ, '1976 నాటి ఏడీఎం జబల్‌పూర్ కేసులో జస్టిస్ హెచ్‌ఆర్ ఖన్నా ఒక్కరే మైనారిటీ తీర్పునిచ్చారు. నాటి ఎమర్జెన్సీ సమయంలో రాజ్యాంగ హక్కుల కోసం నిలబడ్డారు. ఆయన సోదరుడి కుమారుడైన జస్టిస్ సంజీవ్‌ఖన్నా.. తన పెద్దనాన్న వారసత్వాన్ని నిలబెట్టటమే కాదు, న్యాయవ్యవస్థ మీద తనదైన సొంత ముద్ర వేశారు' అని శ్లాఘించారు. జస్టిస్ ఖన్నాలో ఉండే స్పష్టత, నైతిక నిష్ఠ, ఆయన ఇచ్చిన తీర్పులు రాజ్యాంగ విలువలకు అద్దం పడుతాయన్నారు. సుప్రీంకోర్టు ప్రతిష్ఠను జస్టిస్ ఖన్నా మరింత పెంచారని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ పేర్కొన్నారు. 'న్యాయం పట్ల మీకున్న అంకితభావం, మీరు చూపిన పారదర్శకత, యువ న్యాయవాదులకు ఇచ్చిన ప్రోత్సాహం ఎప్పటికీ మర్చిపోలేనివి. కొత్తతరాలకు మీరొక ప్రమాణాన్ని నిర్దేశించారు. నాడు జస్టిస్ హెచ్‌ఆర్ ఖన్నా ఇచ్చిన మైనారిటీ తీర్పే నేడు అంతటా ప్రతిధ్వనిస్తోంది. మెజారిటీ తీర్పును అందరూ మర్చిపోయారు. జస్టిస్ హెచ్‌ఆర్ ఖన్నా సృష్టించిన ఆ జ్వాలను మీరు ముందుకు తీసుకెళ్లారు' అంటూ జస్టిస్ సంజీవ్ ఖన్నా సేవలను కపిల్ సిబల్ కొనియాడారు.

పంజాబ్‌లో కల్తీ మద్యం తాగి
17మంది మృతి

చండీగఢ్, మే 14: పంజాబ్‌లోని అమృత్‌సర్ జిల్లాలో కల్తీ మద్యం తాగి మంగళవారం 17మంది చనిపోయారు. ఆరుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. చనిపోయినవారిలో ఎక్కువ మంది రోజువారీ కూలీలు ఉన్నారు. జిల్లాలోని భంగాళీ, పాతల్‌పురి, మరారీకలాన్, థేరేవాల్ గ్రామాల్లో సోమవారం రాత్రి పలువురు కల్తీ మద్యం తాగినట్లు దర్యాప్తులో తేలిందని పోలీసులు వెల్లడించారు. మరణాలపై పంజాబ్ సీఎం భగవంత్ మాన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "ఇవి మరణాలు కావు. హత్యలు. బాధ్యులను వదిలిపెట్టబోం. కఠినంగా శిక్షిస్తాం" అని ఎక్స్‌లో పోస్టు చేశారు.

డూప్లికేట్ ఓటరు కార్డు నంబర్ల సమస్యను పరిష్కరించాం: ఈసీ

న్యూఢిల్లీ, మే 13: డూప్లికేట్ ఓటరు కార్డు నంబర్ల సమస్యను ఎన్నికల కమిషన్ పరిష్కరించినట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఒకే నంబరుతో కూడిన ఓటరు కార్డులు ఉన్నవారికి వాటిని రద్దు చేసి.. కొత్త నంబర్లతో కూడిన ఫ్రెష్ కార్డులను జారీ చేసినట్లు ఈసీ వర్గాలు మంగళవారం వెల్లడించాయి. ఒకే తరహా ఫొటో గుర్తింపు కార్డు లేదా యూనిక్ ఐడెంటిటీ నంబరుతో కూడిన కార్డులు చాలా స్వల్పంగా ఉన్నాయని.. సగటున నాలుగు పోలింగ్ స్టేషన్లలో ఒకటి బయటపడ్డాయని వెల్లడించాయి.

మేమూ అమెరికాపై ప్రతీకార సుంకాలు విధిస్తాం

» డబ్ల్యూటీవోకు భారత్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ, మే 13: నూతన వాణిజ్య ఒప్పందంపై భారత్, అమెరికా మధ్య జరుగుతున్న చర్చలపై నీలినీడలు కమ్ముకున్నాయి. అమెరికాకు చెందిన కొన్ని వస్తువులపై తామూ ప్రతీకార సుంకాలను విధిస్తామని ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీవో)కు భారత్ తెలియజేసింది. స్టీల్, అల్యూమినియంపై దిగుమతి సుంకాన్ని అమెరికా 25 శాతానికి పెంచడంతో తాము కూడా దిగుమతి సుంకాల పెంపునకు సిద్ధమయ్యామని వెల్లడించింది. అమెరికా నుంచి భారత్‌కు అయ్యే 7.6 బిలియన్ డాలర్ల విలువైన దిగుమతులపై ఈ ప్రతిపాదన ప్రభావం చూపనుంది. ఈ మేరకు మే 9న భారత్ నుంచి డబ్ల్యూటీవోకు ప్రతిపాదన వెళ్లింది. ఆ రోజు నుంచి 30 రోజుల తర్వాత కొత్త సుంకాలు అమలులోకి వస్తాయని ఆ ప్రతిపాదనల్లో భారత్ పేర్కొంది. అలాగే, అమెరికా తీసుకుంటున్న చర్యలు గాట్-1994(జనరల్ అగ్రిమెంట్ ఆన్ టారిఫ్స్ అండ్ ట్రేడ్), ఏవోఎస్(అగ్రిమెంట్ ఆన్ సేఫ్‌గార్డ్స్) ఒప్పందాలకు వ్యతిరేకమని భారత్ తెలిపింది. ఏవోఎస్‌లోని ఆర్టికల్ 12.3 ప్రకారం తప్పనిసరిగా నిర్వహించాల్సిన సంప్రదింపులు జరపకుండా అమెరికా చర్యలు తీసుకోవడంతో ప్రతిచర్యలు తీసుకునే హక్కు తమకు ఉందని డబ్ల్యూటీవోకు భారత్ వెల్లడించింది. నిజానికి, 2018లో తొలిసారి దేశ అధ్యక్షుడైన ట్రంప్.. అప్పట్లో స్టీల్, అల్యూమినియం దిగుమతులపై పెద్ద ఎత్తున సుంకాలు విధించారు. మళ్లీ, రెండోసారి అధికారం చేపట్టిన ట్రంప్ స్టీల్, అల్యూమినియం దిగుమతులపై సుంకాన్ని 25 శాతానికి పెంచారు. మార్చి నుంచి ఈ సుంకాలు అమలులోకి వస్తాయని ప్రకటించారు. అంతేకాక, దేశాల వారీగా, ప్రత్యేక ఉత్పత్తులపై ఇచ్చే మినహాయింపులను ఎత్తివేశారు. ఈ అధిక టారిఫ్ అంశంపై భారత్ ఏప్రిల్‌లోనే చర్చలకు ప్రయత్నించగా అమెరికా తిరస్కరించింది.

అమెరికా-సౌదీ మధ్య భారీ ఆయుధ ఒప్పందం

» రూ.12లక్షల కోట్ల విలువైన ఆయుధాలు పంపిణీ చేయనున్న అమెరికా



రియాద్, మే 13: అమెరికా, సౌదీ అరేబియా మధ్య భారీగా ఆయుధాల సరఫరా ఒప్పందం జరిగింది. మధ్య ప్రాచ్యంలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. మంగళవారం సౌదీ అరేబియాలో పర్యటించారు. ఈ సందర్భంగా ట్రంప్, సౌదీ రాజు ప్రిన్స్ సల్మాన్ సమక్షంలో ఇరు దేశాల అధికారులు పలు ద్వైపాక్షిక ఒప్పందాలపై సంతకాలు చేశారు. సౌదీ అరేబియాకు దాదాపు 142 బిలియన్ డాలర్ల(రూ.12లక్షల కోట్లకు పైనే) విలువైన ఆయుధాల సరఫరాకు ఒప్పందం కుదిరిందని వైట్ హౌస్ ఓ ప్రకటనలో తెలిపింది. అమెరికాలోని ఏఐ, ఇంధన మౌలిక వసతుల రంగంలో సౌదీ కంపెనీ 'డేటా ఓల్ట్'.. 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నదని పేర్కొంది. గాజాలో యుద్ధం, ఇరాన్ అణ్వస్త్రాల తయారీతో మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో.. ట్రంప్ తన పర్యటనలో ద్వైపాక్షిక బంధం బలోపేతం చేసుకోవడంతోపాటు సౌదీ అరేబియాకు భారీగా ఆయుధాలు సరఫరా చేసేందుకు అమెరికా ఒప్పందం కుదుర్చుకోవడం ప్రాధాన్యం సంతరించుకున్నది. మంగళవారం రియాద్‌లోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చిన ట్రంప్‌కు సౌదీ రాజు ప్రిన్స్ స్వయంగా స్వాగతం పలికారు. ఇరువురు నేతల మధ్య ద్వైపాక్షిక చర్చల అనంతరం అల్ యమమాహ్ ప్యాలెస్ రాయల్ కోర్టులో ట్రంప్ బృందానికి విందునిచ్చారు. సౌదీ అరేబియాతోపాటు ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఐ) దేశాల్లోనూ ట్రంప్ పర్యటించనున్నారు.

ఫ్రీగా విమానం ఇస్తే.. తిరస్కరించేందుకు మూర్ఖుడినా: ట్రంప్

అత్యంత ఖరీదైన, విలాసవంతమైన జంబోజెట్ విమానం ఉచితంగా ఇస్తే తిరస్కరించేందుకు నేనేమైనా పిచ్చోడినా? అని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యానించారు. త్వరలో మధ్య ప్రాచ్యంలో పర్యటించనున్న ట్రంప్ కోసం విలాసవంతమైన 747-8 జంబోజెట్ విమానాన్ని ఖతార్ రాజప్రాసాదం బహుమతిగా ఇచ్చింది. ట్రంప్ స్వీకరించారు కూడా. ఈ విమానానికి కొన్ని హంగులు అద్ది.. తాను 2029లో పదవీ విరమణ చేసే దాకా అధ్యక్ష విమానమైన ఎయిర్‌ఫోర్స్ వన్‌కు బదులుగా ఉపయోగించాలనే ప్రణాళికతో ట్రంప్ ఉన్నారు. దీనిపై డెమోక్రాట్లు విమర్శలు గుప్పించగా ట్రంప్ పై విధంగా స్పందించారు.

చిత్రజ్యోతి
★SINCE 1965★



రికార్డు స్థాయిలో..

కమల్‌హాసన్ హీరోగా మణిరత్నం తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'థగ్ లైఫ్'. 38 ఏళ్ల తర్వాత కమల్, మణిరత్నం కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అందుకు అనుగుణంగానే ప్రమోషన్ కార్యక్రమాలను చిత్రబృందం వేగవంతం చేస్తూ భారీ హైప్ క్రియేట్ చేస్తోంది. ఈ నేపథ్యంలో సినిమా నాన్ థియేట్రికల్ బిజినెస్ రికార్డు స్థాయిలో జరిగినట్లు కోలీవుడ్ కథనాలు తెలియజేస్తున్నాయి. ఓ ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ సంస్థ నూట యాభై కోట్ల రూపాయలతో, అలాగే ఓ తమిళ్ స్టార్ హీరోకు చెందిన టెలివిజన్ సంస్థ శాటిలైట్ రైట్స్ కోసం అరవై కోట్ల రూపాయలతో డీల్ కుదుర్చుకున్నట్లు కోలీవుడ్ మీడియా పేర్కొంది. కాగా, ఈ చిత్రం జూన్ 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో త్రిష కథానాయికగా నటించారు. శింబు, అభిరామి, జోజు జార్జ్ కీలక పాత్రలు పోషించారు. ఏ.ఆర్.రెహమాన్ సంగీతం అందించారు. రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, రెడ్ జెయింట్ మూవీస్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

'మహాకాళి'తో తెలుగులో తొలి అడుగు



'ఛావా' చిత్రంలో ఔరంగజేబుగా అద్భుతంగా నటించి అందరి దృష్టినీ ఆకట్టుకున్నాడు బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా. ఆ సినిమా తర్వాత ఆర్టిస్ట్‌గా ఆయనకు డిమాండ్ బాగా పెరిగింది. నిర్మాతల తాకిడి ఎక్కువైంది. అక్షయ్ తదుపరి చిత్రం ఏమిటాని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్న తరుణంలో 'మహాకాళి' తెలుగు చిత్రం అంగీకరించి అందరినీ ఆశ్చర్యపరిచారు అక్షయ్. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ పతాకంపై ప్రశాంత్ వర్మ ఫస్ట్ ఫిమేల్ సూపర్ హీరో కాన్సెప్ట్‌తో నిర్మిస్తున్న 'మహాకాళి' చిత్రంలో అక్షయ్ ఖన్నా ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇంతకుముందు 'మార్టిన్ లూథర్‌కింగ్' చిత్రాన్ని రూపొందించిన పూజ కొల్లూరు ఈ సినిమాకు దర్శకురాలు. సోమవారం ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో మొదలైంది. ఈ సినిమాలో 'మహాకాళి' పాత్రను పోషించే స్టార్ హీరోయిన్ కోసం ప్రస్తుతం అన్వేషణ సాగుతోంది.



ఆదరణ అపూర్వం

చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'విశ్వంభర'. వశిష్ఠ దర్శకుడు. యూవీ క్రియేషన్స్ బేనర్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఇటీవలే చిత్రబృందం 'రామ రామ' అంటూ శ్రీరాముని కీర్తిస్తూ సాగే తొలి గీతాన్ని విడుదల చేసింది. ఆ పాటకు చక్కటి ప్రేక్షకాదరణ దక్కుతోందని చిత్రబృందం తెలిపింది. 'రామ రామ' గీతాన్ని అమితంగా ఆదరిస్తున్న సంగీత ప్రియులకు ధన్యవాదాలు తెలిపింది. ఈ సందర్భంగా మంగళవారం విశ్వంభర కొత్తపోస్టర్‌ను విడుదల చేసింది. అందులో చిరు తనదైన శైలిలో ఉల్లాసంగా స్టెప్పులేస్తూ కనిపించారు. ఈ చిత్రంలో త్రిష, ఆషికి రంగనాథ్ కథానాయికలు. కునాల్‌కపూర్ కీలకపాత్ర పోషిస్తున్నారు. సంగీతం: ఎం.ఎం. కీరవాణి, సినిమాటోగ్రఫీ: చోటా కె నాయుడు

రామ్‌చరణ్‌పై డాక్యుమెంటరీ



'చిరుత'తో తొలి అడుగులు వేసిన రామ్‌చరణ్.. 'ఆర్‌ఆర్‌ఆర్'తో గ్లోబల్ స్టార్‌గా ఎదిగారు. మెగాస్టార్ చిరంజీవి తనయుడిగా ఇండస్ట్రీలోకి ప్రవేశించినా.. స్వయం కృషితో అంచెలంచెలుగా ఎదిగి తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సాధించుకున్నారు. ఇటీవలె లండన్‌లోని మేడమ్ టుస్సాడ్‌లో రామ్‌చరణ్ మైనపు విగ్రహాన్ని నెలకొల్పారు. ఈ నేపథ్యంలో ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ రామ్‌చరణ్‌పై ఓ డాక్యుమెంటరీని రూపొందించే పనిలో ఉన్నట్లు బాలీవుడ్ మీడియాలో వార్తలు వెలువడ్డాయి. తెలుగు చిత్ర పరిశ్రమలో రామ్‌చరణ్ ప్రస్థానాన్ని ఇందులో చూపించబోతున్నారు. ఈ డాక్యుమెంటరీలో టాలీవుడ్‌కు చెందిన పలువురు ప్రముఖులు రామ్‌చరణ్‌పై తమ అభిప్రాయాలు పంచుకోనున్నారు. చిరంజీవితోపాటు సుకుమార్, రాజమౌళి, అల్లు అర్జున్, జూనియర్ ఎన్టీఆర్ తదితరులు ఈ డాక్యుమెంటరీలో కనిపించే అవకాశం ఉందని, ఇప్పటికే దీనికి సంబంధించిన పనులు మొదలయ్యాయని బీటౌన్‌లో టాక్ వినిపిస్తోంది. రామ్‌చరణ్ ప్రస్తుతం 'పెద్ది' సినిమాలో నటిస్తున్నారు. ఈ చిత్రం తెరవెనుక విశేషాలను కూడా డాక్యుమెంటరీలో చూపించనున్నట్లు సమాచారం.

నా కల నెరవేరింది



అదితి శంకర్

'తెలుగు సినిమాల్లో నటించాలనే నా కల 'భైరవం'తో నెరవేరింది. ఇందులో బోల్డ్ అండ్ హానెస్ట్ క్యారెక్టర్ చేశాను. సినిమా తప్పకుండా అందరినీ అలరిస్తుంది' అని అన్నారు కథానాయిక అదితి శంకర్. విజయ్ కనకమేడల దర్శకత్వంలో ఆమె నటించిన చిత్రం 'భైరవం'. కె.కె.రాధామోహన్ నిర్మాత. ఈనెల 30న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు. 'నేను తమిళంలో చేసిన తొలి సినిమాను డైరెక్టర్ విజయ్ చూశారు. 'భైరవం'లో క్యారెక్టర్‌కు సరిపోతానని భావించి కాల్ చేసి ఈ ప్రాజెక్టు గురించి చెప్పారు. ఇందులో నేను పోషిస్తున్న పాత్ర నా ఒరిజినల్ క్యారెక్టర్‌కి దగ్గరగా ఉంటుంది. ఇంత మంచి సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు రావడం ఆనందంగా ఉంది. మంచు మనోజ్, సాయి శ్రీనివాస్, నారా రోహిత్ ముగ్గురికీ తమిళ్ మాట్లాడడం వచ్చు. అందువల్ల వారితో నా జర్నీ చాలా సౌకర్యవంతంగా సాగింది. శ్రీచరణ్ అద్భుతమైన సంగీతం అందించారు. ఇప్పటికే విడుదలైన పాటలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. త్వరలో మరో పాట కూడా రాబోతుంది. ఆర్టిస్టుల నుంచి ఎలాంటి నటనను రాబట్టుకోవాలో డైరెక్టర్ విజయ్ కనకమేడలకి బాగా తెలుసు. ఆయన విజన్ ఉన్న దర్శకుడు. హిస్టారికల్, పీరియాడిక్ సినిమాలు చేయాలనేది నా కోరిక' అని అన్నారు.

తమ్ముడి మూడ్




నితిన్ కథానాయకుడిగా వేణు శ్రీరామ్ తెరకెక్కిస్తున్న చిత్రం 'తమ్ముడు'. దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రం జూలై 4న విడుదలవుతోంది. తాజాగా, ఈ సినిమాలోని కీలక పాత్రలను, వారి పేర్లను పరిచయం చేస్తూ 'మూడ్ ఆఫ్ తమ్ముడు' అనే వీడియోను విడుదల చేశారు మేకర్స్. అగర్వాల్‌గా సౌరభ్ సచ్‌దేవ్, రత్నగా సప్తమి గౌడ, ఝాన్సీ కిరణ్మయిగా లయ, చిత్రగా వర్ష బొల్లమ్మ నటిస్తున్నారు. భారతీయ జెర్సీ వేసుకున్న నితిన్.. బాణాన్ని లక్ష్యానికి గురిపెడుతూ ఉన్న విజువల్స్ చూస్తుంటే ఇందులో ఆయన విలువిద్య క్రీడాకారుడి పాత్రను పోషిస్తున్నట్లు తెలుస్తోంది. వీడియోలో వీరిని పరిచయం చేసిన విధానం ఆసక్తికరంగా ఉండి, సినిమాపై అంచనాలను పెంచేసింది. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ పూడి, డీఓపీ: కేవీ గుహన్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్.

ప్రేక్షకులను ఆకట్టుకునేలా..



సిద్ధార్థ్ హీరోగా శ్రీ గణేశ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం త్రీబీహెచ్‌కే. అరుణ్ విశ్వశాంతి నిర్మిస్తున్నారు. శరత్‌కుమార్, దేవయాని, యోగిబాబు కీలకపాత్రలు పోషిస్తున్నారు. మంగళవారం చిత్రబృందం విడుదల తేదీని ప్రకటించింది. జూలై 4న విడుదల చేస్తున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో నిర్మాణంలో ఉన్న ఇంట్లో సిద్ధార్థ్, శరత్‌కుమార్, దేవయాని తమ కుటుంబంతో ఆనందకర క్షణాలను ఆస్వాదిస్తూ కనిపించారు. కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని అంశాలతో ఈ చిత్రాన్ని రూపొందించామని మేకర్స్ తెలిపారు.

బాలల కోసం త్రీడీ చిత్రం



ఈగ ప్రధాన పాత్రధారిగా రూపొందిన బాలల త్రీడీ చిత్రం లవ్లీ. మాథ్యూ థామస్ ప్రధాన పాత్ర పోషించారు. దిలీప్ కరుణాకరన్ దర్శకుడు. శరణ్య నిర్మించారు. ఈ నెల 16న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు మేకర్స్ మంగళవారం తెలిపారు. వేసవి సెలవుల్లో పిల్లలు ఎంజాయ్ చేసేలా ఈ సినిమా ఉంటుందని చిత్రబృందం తెలిపింది. విష్ణు విజయ్ సంగీతం అందించిన ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఆషిక్ అబూ

మ్యూజికల్ ఎంటర్‌టైనర్



కార్తీక్ ఆర్యన్ కథానాయకుడిగా అనురాగ్ బసు దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. టాలీవుడ్ కథానాయిక శ్రీలీల ఈ చిత్రంతో బాలీవుడ్ అరంగేట్రం చేస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. నెలరోజులకు పైగా సాగిన సుదీర్ఘ షెడ్యూల్ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా సెట్‌లో దిగిన ఫొటోను కార్తీక్ ఆర్యన్ సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. చక్కని ప్రేమకథతో మ్యూజికల్ ఎంటర్‌టైనర్‌గా అనురాగ్ బసు ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. దీపావళికి ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.



చివరిదశ పనుల్లో బార్బరిక్

సత్యరాజ్ ప్రధాన పాత్రలో మోహన్ శ్రీవత్స తెరకెక్కిస్తున్న చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్'. వశిష్ఠ.ఎన్.సింహా, సత్యం రాజేశ్, ఉదయభాను కీలక పాత్రలు పోషిస్తున్నారు. దర్శకుడు మారుతి సమర్పణలో విజయ్‌పాల్ రెడ్డి ఆడిదాల నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తై, ప్రస్తుతం చివరిదశ పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉన్న ఈ చిత్రాన్ని త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్ సినిమా ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతినిస్తుందని తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: మార్తాండ్.కె.వెంకటేశ్, డీఓపీ: కుశేందర్ రమేశ్‌రెడ్డి, సంగీతం: ఇన్‌ఫ్యూజన్ బ్యాండ్.

త్వరలోనే బ్యాడ్‌బాయ్



హీరో నాగశౌర్య నటిస్తున్న యాక్షన్ ఎంటర్టైనర్ 'బ్యాడ్‌బాయ్ కార్తీక్'. రామ్ దేశినా దర్శకత్వంలో శ్రీనివాస చింతలపూడి నిర్మిస్తున్నారు. విధి హీరోయిన్. ఇటీవలె విడుదలైన ఫస్ట్ లుక్ అందర్నీ ఆకట్టుకుంది. సముద్రఖని, వీకె నరేశ్, సాయికుమార్, వెన్నెల కిశోర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా షూట్ పూర్తైందని మేకర్స్ ప్రకటించారు. త్వరలోనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: కోటగిరి వెంకటేశ్వర రావు, డీఓపీ: రసూల్ ఎల్లోర్, సంగీతం: హారిస్ జైరాజ్.



మంధాన @ 2

ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్

దుబాయ్: శ్రీలంకలో ముక్కోణపు సిరీస్ నెగ్గడంలో కీలక పాత్ర పోషించిన టీమిండియా మహిళల స్టార్ బ్యాటర్ స్మృతీ మంధాన ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లోనూ అదరగొట్టింది. మంగళవారం ప్రకటించిన తాజా మహిళల వన్డే ర్యాంకింగ్స్ బ్యాటింగ్ విభాగంలో మంధాన (727 పాయింట్లు) ఓ స్థానం ఎగబాకి రెండో ర్యాంక్‌లో నిలిచింది. టాప్‌లో ఉన్న దక్షిణాఫ్రికా సారథి లారా వోల్వార్ట్ (738)కు కేవలం 11 పాయింట్ల దూరంలో ఉంది. మిగతా బ్యాటర్లలో జెమీమా ఐదు స్థానాలు ఎగబాకి 15వ ర్యాంక్‌కు చేరగా.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ఓ స్థానం కోల్పోయి 16లో ఉంది. బౌలింగ్ జాబితాలో సోఫీ ఎకెల్‌స్టోన్ (ఇంగ్లండ్) నెంబర్‌వన్‌గా కొనసాగుతుండగా.. భారత్ నుంచి దీప్తి శర్మ 4వ ర్యాంక్ నిలబెట్టుకుంది. ఆల్‌రౌండర్లలో దీప్తి శర్మ ఓ స్థానం మెరుగై 5వ ర్యాంకులో నిలవగా, ఆష్లే గార్డ్‌నర్ (ఆస్ట్రేలియా) టాప్‌లో ఉంది.

'ఖేలో ఇండియా'లో తెలుగోళ్ల సత్తా


నిషిక
సాయివర్ధన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో తెలుగు క్రీడాకారులు పతకాల మోత మోగించారు. నాలుగో రోజు పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు 7, తెలంగాణకు 3 పతకాలు లభించాయి. మంగళవారం బిహార్‌లో జరిగిన ఈ పోటీల్లోని ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ జూనియర్ ఆల్‌రౌండ్ విభాగంలో నిషిక (హైదరాబాద్) 44.333 స్కోరుతో ప్రథమ స్థానంలో నిలిచింది. వెయిట్‌లిఫ్టింగ్ యూత్ బాలుర 89 కిలోల విభాగంలో సాయివర్ధన్ (సికింద్రాబాద్) 275 కిలోల బరువెత్తి స్వర్ణం సాధించగా, చెంచు వెంకటేష్ (గుంటూరు) 272 కిలోల బరువెత్తి రజతంతో సరిపెట్టుకున్నాడు. బాలికల ఫెన్సింగ్ ఈపీ విభాగంలో హైదరాబాద్ అమ్మాయి అదీబా హొరైన్ కాంస్యంతో మెరిసింది. బ్యాడ్మింటన్ డబుల్స్‌లో చరణ్ రామ్, హరికృష్ణ (ఆంధ్రప్రదేశ్) ద్వయం కైవసం చేసుకుంది. వెయిట్‌లిఫ్టింగ్ యూత్ బాలికల 64 కి., కేటగిరీలో జి.వర్షిత (శ్రీకాకుళం) 174 కిలోల బరువెత్తి పసిడితో మెరిసింది.



జొకో, మర్రే.. కటీఫ్

లండన్: ఫ్రెంచ్ ఓపెన్‌కు రెండు వారాల ముందు సెర్బియా టెన్నిస్ దిగ్గజం నొవాక్ జొకోవిక్ కోచ్‌గా ఆండీ మర్రే వైదొలగడం చర్చనీయాంశంగా మారింది. జొకోవిక్ కోచ్‌గా తాను వైదొలుగుతున్నట్టు మంగళవారం సోషల్ మీడియా వేదికగా ప్రపంచ మాజీ నెంబర్ వన్ మర్రే ప్రకటించాడు. తామిద్దరం ఇక కలిసి ప్రయాణం చేయబోవడం లేదని మర్రే పేర్కొన్నాడు. అనంతరం ఈ ఆరు నెలల ప్రయాణంలో మర్రే తన కోసం శ్రమించిన విధానం, తను పంచిన వినోదం, అందించిన మద్దతును కొనియాడుతూ నొవాక్ సోషల్ మీడియాలో ఒక సందేశం పోస్ట్ చేశాడు. ఈ ప్రయాణంతో తమ స్నేహం మరింత బలపడిందని నొవాక్ తెలిపాడు.

'థాయ్‌లాండ్'లో శ్రీకాంత్‌కు తరుణ్ షాక్

బ్యాంకాక్: ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్న కిడాంబి శ్రీకాంత్‌కు మరో టోర్నీలోనూ నిరాశే ఎదురైంది. థాయ్‌లాండ్ ఓపెన్‌లో ఏకంగా క్వాలిఫయింగ్ రౌండ్‌లోనే వెనుదిరిగాడు. సింగిల్స్ క్వాలిఫయింగ్ ఆరంభ రౌండ్లో తెలుగు షట్లర్ తరుణ్ మన్నేపల్లి 21-6, 21-19తో ప్రపంచ మాజీ నెంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్‌కు షాకిచ్చాడు. ఆ తర్వాత తదుపరి రౌండ్లో తరుణ్ 17-21, 21-19, 21-17తో కువో కాన్ లిన్ (తైపీ)ని ఓడించి మెయిన్ డ్రాకు అర్హత సాధించాడు. భారత షట్లర్ ఐరా శర్మ 18-21, 21-12, 21-8తో తెట్ తార్ తుజార్ (మయన్మార్)పై గెలిచి మహిళల సింగిల్స్‌లో మెయిన్ డ్రాకు చేరుకుంది.

ఆ శిక్షణతో మరింత ఎత్తుకు..

బెంగళూరు: విరాట్ కోహ్లీ కెరీర్‌లో 2014 ఇంగ్లండ్ పర్యటన అత్యంత చేదు అనుభవాన్ని మిగిల్చింది. దిగ్గజ పేసర్ జేమ్స్ అండర్సన్ అతడి ప్రాభవాన్ని దారుణంగా దెబ్బతీశాడు. దీంతో ఆ టూర్‌లో ఆడిన ఐదు టెస్టుల్లో 134 పరుగులే చేయగా, 4 వన్డేల్లో 54 రన్స్‌కు పరిమితమయ్యాడు. దీంతో సీమ్ పిచ్‌లపై అతడి వైఫల్యంపై ఇంటా, బయటా తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. అయితే ఇలాంటి గడ్డు స్థితి నుంచి విరాట్ త్వరగానే పుంజుకోవడమే కాకుండా కెరీర్‌లో అత్యున్నత స్థితికి చేరుకోగలిగాడు. దీనికి కారణం.. అతడి అండర్-19 కోచ్ లాల్‌చంద్ రాజ్‌పుత్ దగ్గర రెండు వారాలు తీసుకున్న శిక్షణే నట. 'విరాట్ నాకు చిన్నప్పటి నుంచే తెలుసు. అండర్- 19కు ఆడినప్పటి నుంచే అతని ఆటపై నాకు పూర్తి అవగాహన ఉంది. 2014 టూర్ తర్వాత వెంటనే నాకు ఫోన్ చేశాడు. ముంబైలో రెండు వారాలపాటు ఏర్పాటు చేసిన శిబిరంలో విరాట్ బ్యాటింగ్ లోపాలపై దృష్టి పెట్టా. క్రీజులో అతడి తల కాస్త వాలిపోతున్నట్టు ఉండడమే కాక పాదాల కదలిక అనిశ్చితిగా ఉంది. దీంతో ఆ విషయంలో మార్పులు చేశా. వెంటనే విరాట్ ఈ విషయంలో కఠిన ప్రాక్టీస్ చేశాడు' అని రాజ్‌పుత్ వివరించాడు. ఈ శిక్షణ విరాట్ కెరీర్‌లో టర్నింగ్ పాయింట్ అయింది. ఎందుకంటే ఆ తర్వాత 2014 నవంబరులోనే ఆస్ట్రేలియా టూర్‌కు వెళ్లగా అడిలైడ్‌లో డబుల్ సెంచరీ, మెల్‌బోర్న్.. సిడ్నీలలో శతకాలతో చెలరేగాడు. ఈ ధాటితో 4 టెస్టుల్లో 692 రన్స్‌తో విరాట్ విమర్శకులకు దీటైన బదులిచ్చాడు. ఆ తర్వాత తన కెరీర్ దూసుకెళ్లడంతో ఇతర బ్యాటర్లకు అందనంత ఎత్తుకు ఎదిగాడు.


కోచ్ లాల్‌చంద్ రాజ్‌పుత్‌తో కోహ్లీ

ప్రాక్టీస్ మ్యాచ్‌లంటే ఇష్టం ఉండదు: భరత్ అరుణ్

ప్రాక్టీస్ మ్యాచ్‌లకన్నా నెట్ సెషన్స్ అంటేనే విరాట్ కోహ్లీ ఇష్టపడేవాడని భారత జట్టు మాజీ బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్ తెలిపాడు. 16 గజాల దూరం నుంచే పేసర్లతో బంతులు వేయించుకునేవాడని చెప్పాడు. విరాట్ కెప్టెన్‌గా ఉన్నప్పుడు అరుణ్ జట్టుతోపాటే ఉన్నాడు. ప్రాక్టీస్ మ్యాచ్‌ల్లో తీవ్రత ఉండదని కోహ్లీ చెప్పేవాడని అరుణ్ అన్నాడు.



ఆధ్యాత్మిక పర్యటనలో విరుష్క

మధుర: టెస్టు క్రికెట్ నుంచి వీడ్కోలు పలికిన స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ.. భార్య అనుష్క శర్మతో కలిసి మంగళవారం ఉత్తరప్రదేశ్‌లోని బృందావన్ ధామ్ ఆశ్రమానికి వెళ్లాడు. గురువు ప్రేమానంద్ గోవింద్ మహరాజ్ ఆశీస్సులు తీసుకుని అక్కడే కొంతసేపు గడిపారు. ఈ ఏడాది ఆరంభంలోనూ ఆసీస్ పర్యటన ముగిశాక తమ పిల్లలతో కలిసి విరాట్ జంట ఇదే ఆశ్రమానికి వచ్చారు.

విదేశీ ఆటగాళ్లకై ఎదురుచూపులు

ఐపీఎల్‌కు స్టొయినిస్, ఇన్‌గ్లిస్ దూరం

న్యూఢిల్లీ: ఈనెల 17 నుంచి ఐపీఎల్ తిరిగి ఆరంభం కానుండడంతో విదేశీ ఆటగాళ్ల రాకపై అందరి దృష్టి నెలకొంది. భారత్-పాక్ యుద్ధం కారణంగా వారిలో భయాందోళనలు నెలకొన్నాయి. ప్రస్తుతం కాల్పుల విరమణతో పరిస్థితులు మారడంతో ఎలాగైనా విదేశీ క్రీడాకారులను భారత్‌కు రప్పించాలని బీసీసీఐ భావిస్తోంది. అయితే ఇందుకు పలువురు ఆటగాళ్లు అంతగా సుముఖత వ్యక్తం చేయడం లేదని సమాచారం. అంతేకాకుండా తమ ప్లేయర్ల భద్రత ముఖ్యమనే ఆలోచనలో ఆయా దేశాల క్రికెట్ బోర్డులు కూడా ఉన్నాయి. వారిని ఒప్పించే బాధ్యతను ఐపీఎల్ సీవోవో హేమంగ్ అమిన్‌కు బోర్డు అప్పగించింది. తను ఇప్పటికే క్రికెట్ ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ క్రికెట్ బోర్డులతో ఇదే విషయమై చర్చించాడు. 'విదేశీ క్రికెట్ బోర్డులతో నేరుగా మాట్లాడుతున్నాం. ఫ్రాంచైజీలు కూడా తమ ఆటగాళ్లతో టచ్‌లో ఉన్నారు. మెజారిటీ క్రికెటర్లు భారత్‌కు వస్తారనే ఆశిస్తున్నాం' అని బోర్డు అధికారి పేర్కొన్నాడు. మరోవైపు ఆసీస్ ఆటగాళ్లలో స్టొయినిస్, ఇన్‌గ్లిస్ పంజాబ్‌కు దూరమయ్యే అవకాశం ఉంది. వారిని ఒప్పించేందుకు కోచ్ పాంటింగ్ ప్రయత్నిస్తున్నాడు. ఢిల్లీ కీలక పేసర్ స్టార్క్ ఇక్కడికి వచ్చేందుకు అయిష్టత వ్యక్తం చేశాడు. కమిన్స్, హెడ్ మాత్రం జట్టులో చేరతారని ఆశిస్తున్నట్టు రైజర్స్ యాజమాన్యం పేర్కొంది.

కోహ్లీలో ఇంకా ఆడే సత్తావుంది!

సయ్యద్ కిర్మాణి

న్యూఢిల్లీ: టెస్టుల్లో ఆడేందుకు విరాట్ కోహ్లీలో ఇంకా చాలా క్రికెట్ మిగిలుందని భారత మాజీ వికెట్‌కీపర్ సయ్యద్ కిర్మాణి అభిప్రాయపడ్డాడు. 'ప్రతి ఒక్కరు ఆటలో రిటైర్ కావాల్సిందే. అయితే కోహ్లీ కొంచెం ముందుగా వీడ్కోలు పలికాడు. ఈ నిర్ణయం తీసుకునేందుకు అతడిపై ఎలాంటి ఒత్తిడీ లేదనుకుంటున్నా. భవిష్యత్‌లో అతడికి మంచి జరగాలని కోరుకుంటున్నా. విరాట్ నిలకడైన ఆటతీరే అతణ్ణి మిగిలిన వారికంటే భిన్నంగా నిలబెట్టింది. భావి క్రికెటర్లకు అతడొక ప్రేరణ' అని కిర్మాణి చెప్పాడు.

పాక్ చీఫ్ కోచ్‌గా మైక్ హెస్సన్

లాహోర్: వన్డే, టీ20లకు పాకిస్థాన్ క్రికెట్ జట్టు ప్రధాన కోచ్‌గా మైక్ హెస్సన్ నియమితుడయ్యాడు. ఈనెల 26న హెస్సన్ బాధ్యతలు తీసుకుంటాడని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు వెల్లడించింది. ఈ కోచ్ ఉద్యోగానికి మొత్తం ఏడుగురు దరఖాస్తు చేసుకోగా వడపోత అనంతరం హెస్సన్‌ను నియమించారు. పాక్ 2023 నుంచి నియమించిన విదేశీ కోచ్‌ల్లో హెస్సన్ ఐదో వాడు కావడం విశేషం. బ్రాడ్ బర్న్, ఆర్థర్, కిర్‌స్టెన్, గిలెస్పీ తమ ఒప్పందకాలం ముగియకుండానే కోచ్‌లుగా వైదొలిగారు. న్యూజిలాండ్‌కు చెందిన హెస్సన్ గతంలో కెన్యా, కివీస్, ఐపీఎల్‌లోని ఆర్‌సీబీ జట్లకు ప్రధాన కోచ్‌గా పనిచేశాడు.

మైదానంలో వీడ్కోలుకు ఆ ముగ్గురు అర్హులు



న్యూఢిల్లీ: కొద్దిరోజుల వ్యవధిలోనే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించడం తనను విస్మయానికి గురిచేసిందని స్పిన్ దిగ్గజం అనిల్ కుంబ్లే అన్నాడు. అలాగే, వీళ్లు మైదానంలో వీడ్కోలు పలికి ఉంటే బాగుండేదన్నాడు. 'ఇద్దరు మేటి ఆటగాళ్లు ఒకరి తర్వాత ఒకరు టెస్టులకు గుడ్‌బై పలికారు. ముఖ్యంగా కోహ్లీ.. ఇంకా కొన్నేళ్లు టెస్టులు ఆడే సత్తా ఉన్నా కూడా, ఈ నిర్ణయం తీసుకుంటాడని ఊహించలేదు. ఇది ఒకరకంగా నిశ్శబ్ద నిష్క్రమణ. కానీ, మైదానంలో ప్రేక్షకుల హర్షధ్వానాల మధ్య వీడ్కోలు ప్రకటన చేస్తే ఎంత బాగుంటుంది? గతంలో అశ్విన్ కూడా అలాగే చేశాడు. ఆస్ట్రేలియా పర్యటన మధ్యలోనే భారత్ వచ్చేసి రిటైర్మెంట్ ప్రకటించేశాడు. నా దృష్టిలో ఈ ముగ్గురు మైదానంలో అభిమానుల మధ్య రిటైర్మెంట్ తీసుకునేందుకు వందశాతం అర్హులు' అని కుంబ్లే వ్యాఖ్యానించాడు.

వచ్చే వరల్డ్‌కప్‌లో రో-కోను చూడలేం



న్యూఢిల్లీ: టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించి వన్డేల్లో మాత్రమే కొనసాగుతామని చెప్పిన స్టార్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ.. 2027లో జరిగే వన్డే ప్రపంచ కప్ దాకా ఆడకపోవచ్చని టీమిండియా దిగ్గజం సునీల్ గవాస్కర్ అన్నాడు. 'ఈ ఏడాది చాంపియన్స్ ట్రోఫీలో రోహిత్, కోహ్లీ కలిసి జట్టును చాంపియన్‌గా నిలబెట్టారు. కానీ, ఇదే దూకుడైన ఫామ్ మరో రెండేళ్లపాటు కొనసాగుతుందా? అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో సెలెక్షన్ కమిటీ వీరిద్దరి ఎంపికకు ఓకే చెబుతుందా.. అంటే కచ్చితంగా అవునని చెప్పలేం. నిజాయితీగా చెబుతున్నా.. నా అంచనా ప్రకారం వీళ్లిద్దరిని 2027లో జరిగే ప్రపంచకప్‌లో మనం చూడలేం. ఒకవేళ.. అప్పటిదాకా కూడా అద్భుతంగా ఆడుతూ, సెంచరీల మీద సెంచరీలు కొడుతూ ఉంటే, ఆ భగవంతుడు కూడా జట్టు నుంచి వీళ్లను తొలగించలేడు' అని గవాస్కర్ చెప్పుకొచ్చాడు. ఇక, తనవరకైతే టీమిండియా టెస్టు కెప్టెన్‌గా జస్‌ప్రీత్ బుమ్రా సరైన వాడని సన్నీ చెప్పాడు.

ఆరేళ్ల కనిష్ఠానికి ద్రవ్యోల్బణం

ఏప్రిల్‌లో 3.16 శాతం

న్యూఢిల్లీ: గత నెలలో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం దాదాపు ఆరేళ్ల కనిష్ఠ స్థాయి 3.16 శాతానికి తగ్గింది. 2019 జూలైలో 3.15 శాతంగా నమోదైన సూచీకి ఆ తర్వాత ఇదే కనిష్ఠ స్థాయి. కూరగాయలు, పండ్లు, పప్పు దినుసులు, ప్రొటీన్ ఉత్పత్తుల ధరలు గణనీయంగా తగ్గడం ఇందుకు తోడ్పడింది. జూన్‌లో నిర్వహించనున్న ద్రవ్య పరపతి విధాన సమీక్షలో ఆర్‌బీఐ ప్రామాణిక రెపోరేటును మరింత తగ్గించేందుకు ఈ పరిణామం దోహదపడనుంది. ఈ మార్చిలో ద్రవ్యోల్బణం 3.34 శాతంగా, గత ఏడాది ఏప్రిల్‌లో 4.83 శాతంగా నమోదైంది. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) మంగళవారం విడుదల చేసిన డేటా ప్రకారం.. ఈ మార్చితో పోలిస్తే ఏప్రిల్‌లో ఆహార ద్రవ్యోల్బణం 0.91 శాతం తగ్గి 1.78 శాతానికి దిగివచ్చింది. 2021 అక్టోబరు తర్వాత ఆహార ద్రవ్యోల్బణానికి ఇదే కనిష్ఠ స్థాయి. కాగా, రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 4 శాతానికి కట్టడి చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆర్‌బీఐకి లక్ష్యాన్ని నిర్దేశించింది. గడిచిన కొన్ని నెలల్లో ధరలు కొంత అదుపులోనే ఉండటంతో ఆర్‌బీఐ ఈ ఫిబ్రవరి, ఏప్రిల్‌లో నిర్వహించిన పరపతి సమీక్షల్లో రెపో రేటును 0.25 శాతం చొప్పున మొత్తం 0.50 శాతం తగ్గించింది. దాంతో రెపో రేటు 6 శాతానికి దిగివచ్చింది.



బిజినెస్

ఎస్‌బీఐ మరో ఘనత

వార్షిక లాభాల పరంగా ప్రపంచ టాప్-100 జాబితాలోకి ప్రవేశం

న్యూఢిల్లీ: దశాబ్దం క్రితం తన ఐదు అనుబంధ బ్యాంక్‌లను విలీనం చేసుకోవడం ద్వారా ప్రపంచంలోని 50 అతి పెద్ద బ్యాంక్‌ల జాబితాలోకి ప్రవేశించిన భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ).. తాజాగా మరో ఘనత సాధించింది. వార్షిక నికర లాభాల పరంగా ప్రపంచంలోని టాప్-100 కంపెనీల లిస్ట్‌లో చోటు దక్కించుకుంది. గత ఆర్థిక సంవత్సరానికి (2024-25) రూ.77,561 కోట్ల (920 కోట్ల డాలర్లు) నికర లాభం ఆర్జించిన ఎస్‌బీఐ.. బ్లూంబర్గ్ రూపొందించిన ఈ జాబితాలో 98వ స్థానంలో నిలిచింది.

తాజ్ జీవీకే లాభం రూ.28.6 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : స్థానిక తాజ్ జీవీకే హోటల్స్ అండ్ రిసార్ట్స్ నాలుగో త్రైమాసికానికి రూ.28.6 కోట్ల నికర లాభం నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 10.6 శాతం ఎక్కువ. ఇదే సమయంలో కంపెనీ ఆదాయం రూ.116.69 కోట్ల నుంచి రూ.130.59 కోట్లకు చేరింది. ఆదాయం, లాభాల పరంగా కంపెనీకి ఇది అత్యుత్తమ త్రైమాసికమని తాజ్ జీవీకే హోటల్స్ చైర్మన్ జీవీకే రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

లాభాల స్వీకారంతో మార్కెట్ డౌన్



1282 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

ముంబై: భారత్-పాక్ కాల్పుల విరమణకు అంగీకారంతో సోమవారం రాకెట్‌లా దూసుకెళ్లిన సెన్సెక్స్, నిఫ్టీ.. మంగళవారం అంతే వేగంతో కిందికి జారాయి. ఐటీ, ఆటో, ప్రైవేట్ బ్యాంకింగ్ షేర్లలో మదుపరులు లాభాలు స్వీకరించడం ఇందుకు కారణం. సెన్సెక్స్ 1,281.68 పాయింట్లు క్షీణించి 81,148.22 వద్దకు పడిపోగా.. నిఫ్టీ 346.35 పాయింట్లు పతనమై 24,578.35 వద్ద ముగిసింది. బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1.46 లక్షల కోట్లు తగ్గి రూ.431.10 లక్షల కోట్లకు జారుకుంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 25 నష్టపోయాయి. బడా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనైనప్పటికీ చిన్న, మధ్య స్థాయి కంపెనీలకు కొంత మేర కొనుగోళ్ల మద్దతు లభించింది. దాంతో బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ 0.99 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.17 శాతం పెరిగాయి.

● వరుసగా 22 సెషన్లపాటు లోయర్ సర్క్యూట్ స్థాయికి (రోజూ 5 శాతం చొప్పున క్షీణత) పతనమవుతూ వచ్చిన జెన్‌సోల్ ఇంజనీరింగ్ షేరు మంగళవారం 5 శాతం లాభంతో అప్పర్ సర్క్యూట్ స్థాయి రూ.57.28 వద్దకు చేరింది. కంపెనీ నిధుల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో సెబీ నిషేధం ఎదుర్కొంటున్న జెన్‌సోల్ ప్రమోటర్లు అన్‌మోల్‌సింగ్ జగ్గీ, పునీత్ సింగ్ జగ్గీ కంపెనీ పదవులకు రాజీనామా చేయడంతో షేర్ల వరుస పతనానికి ఎట్టకేలకు అడ్డుకట్ట పడింది.

● విద్యుత్ వాహనాల తయారీ సంస్థ గ్రీవ్స్ ఎలక్ట్రిక్ మొబిలిటీ ఐపీఓ ప్రతిపాదనకు సెబీ ఆమోదం లభించింది. ఈ కంపెనీ ఐపీఓ ద్వారా రూ.1,000 కోట్ల తాజా ఈక్విటీతోపాటు ప్రస్తుత వాటాదారులకు చెందిన 18.9 కోట్ల షేర్లను సైతం విక్రయించనుంది.

పేటీఎంలో 4 శాతం వాటా విక్రయించిన యాంట్ గ్రూప్

చైనా ఫిన్‌టెక్ దిగ్గజం యాంట్ గ్రూప్.. పేటీఎంలో 4 శాతం వాటాను రూ.2,013 కోట్లకు విక్రయించింది. బహిరంగ మార్కెట్లో బ్లాక్ డీల్స్ ద్వారా 4 శాతం వాటాకు సమానమైన 2.55 కోట్లకు పైగా షేర్లను ఉపసంహరించుకుంది. తదనంతరం పేటీఎంలో యాంట్ గ్రూప్ వాటా 9.85% నుంచి 5.85 శాతానికి తగ్గింది.

చైనా రక్షణ రంగ షేర్లు ఢమాల్

భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణకు అంగీకారం కుదరడంతో పాక్‌కు భారీగా ఆయుధాలు సరఫరా చేస్తున్న చైనా రక్షణ రంగ కంపెనీల షేర్లు 9 శాతం వరకు క్షీణించాయి. దాంతో హాంగ్‌సెంగ్ చైనా ఏ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ ఇండెక్స్ 2.9 శాతం పతనమైంది. సూచీలోని ఏవీఐసీ చెంగ్డు ఎయిర్‌క్రాఫ్ట్ అత్యధికంగా 9.2 శాతం నష్టపోయింది.

బీఓఐలో 8.38 శాతానికి ఎల్ఐసీ వాటా

బ్యాంక్ ఆఫ్ ఇండియాలో బీమా దిగ్గజం ఎల్ఐసీ వాటా 8.38 శాతానికి పెరిగింది. 2021 సెప్టెంబరు 2 నుంచి 2025 మే 9 మధ్యలో తమ బ్యాంక్‌కు చెందిన 2.026 కోట్ల షేర్లను ఎల్ఐసీ కొనుగోలు చేసిందని బీఓఐ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు మంగళవారం వెల్లడించింది. దాంతో ఈ నాలుగేళ్లలో బీఓఐలోని ఎల్ఐసీ వాటా 6.35 శాతం నుంచి 8.38 శాతానికి చేరుకుంది. బీఎస్ఈలో బీఓఐ షేరు 2.27 శాతం పెరిగి రూ.112.55 వద్ద ముగిసింది.

విశాఖలో జిప్సమ్ ప్లాస్టర్ తయారీ ప్లాంట్

కోరమాండల్, సకర్ణి గ్రూప్ భాగస్వామ్యం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఫాస్ఫో జిప్సమ్ ఆధారిత హరిత భవన సామగ్రి తయారీ, విక్రయం కోసం సకర్ణి ప్లాస్టర్‌తో జాయింట్ వెంచర్ (జేవీ) ఏర్పాటు చేసుకునేందుకు కోరమాండల్ కెమికల్స్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ జేవీలో భాగంగా విశాఖపట్టణంలోని కోరమాండల్ ఫెర్టిలైజర్ ప్లాంట్‌కు సమీపంలోనే జిప్సమ్ ప్లాస్టర్ తయారీకి ఒక అత్యాధునిక ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తారు. ఎరువుల తయారీ ద్వారా అందుబాటులోకి వచ్చే అనుబంధ ఉత్పత్తి జిప్సమ్ ఈ ప్లాంట్‌కు ముడిసరకుగా ఉపయోగపడుతుంది. కేంద్రప్రభుత్వ సర్క్యులర్ ఎకానమీ లక్ష్యాలకు దీటుగా సుస్థిర హరిత భవన ఉత్పత్తుల తయారీ కోసం దేశంలో ఏర్పాటవుతున్న తొలి భారీ వెంచర్ ఇదే. కోరమాండల్ గ్రూప్ వ్యవసాయ ఉపకరణాల వ్యాపార విభాగం నుంచి తన పరిధిని విస్తరించుకుని ఇతర వ్యాపార విభాగాల్లోకి ప్రవేశించేందుకు, తద్వారా దీర్ఘకాలిక విలువ సృష్టించేందుకు ఈ ఒప్పందం సహాయకారి అవుతుంది. అలాగే సాకర్ణి గ్రూప్ తన ఉత్పత్తుల పోర్ట్‌ఫోలియోను విస్తరించి సరికొత్త మార్కెట్లలోకి విస్తరించేందుకు, జిప్సమ్ ప్లాస్టర్ పరిశ్రమలో తన ఆధిపత్యాన్ని సుస్థిరం చేసుకునేందుకు కూడా ఈ ఒప్పందం దోహదపడుతుంది. వేగంగా విస్తరిస్తున్న జిప్సమ్ ప్లాస్టర్ పరిశ్రమలోని అవకాశాలను రెండు కంపెనీలు కైవసం చేసుకునేందుకు వీలు కల్పిస్తుంది. కోరమాండల్ తయారీ సామర్థ్యాలు, సకర్ణి మార్కెట్ ఆధిపత్యం రెండింటినీ ఉపయోగించుకోవడం ద్వారా వేగంగా విస్తరిస్తున్న గృహనిర్మాణం, మౌలిక వసతుల రంగాలకు అత్యున్నత నాణ్యత గల, పర్యావరణ మిత్రమైన జిప్సమ్ సొల్యూషన్లు అందుబాటులోకి తేగలుగుతామని కోరమాండల్ ఇంటర్నేషనల్ సీఈఓ శంకర సుబ్రమణియన్ అన్నారు.

పవర్‌మెక్‌కు తెలంగాణ ప్రభుత్వ సంస్థ ప్రాజెక్టు

న్యూఢిల్లీ: పవర్‌మెక్ ప్రాజెక్ట్స్ తెలంగాణ పవర్ జెనరేషన్ కార్పొరేషన్ నుంచి ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ నిర్మాణం కోసం రూ.971.98 కోట్ల ఆర్డర్ సాధించింది. స్థలం స్వాధీనం చేసుకున్న నాటి నుంచి 30 నెలల కాలవ్యవధిలో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా తాము నల్గొండ జిల్లాలోని దామరచెర్లలో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ వద్ద టౌన్‌షిప్ నిర్మించాల్సి ఉంటుందని పవర్‌మెక్ రెగ్యులేటరీ సంస్థలకు పంపిన సందేశంలో తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

14వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	500
వరంగల్	502	గోదావరి	500
చిత్తూరు	593	విశాఖపట్నం	505
		దజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	115	విజయవాడ	119
వరంగల్	115	గుంటూరు	122
కరీంనగర్	115	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	124
కర్నూలు	115	నెల్లూరు	129
విశాఖపట్నం	116	అనంతపురం	129
గోదావరి	119		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	95,620 ▼	87,650 ▼	1,09,000 ▼
విజయవాడ	97,500 ▲	92,000 ▼	99,650 ▲
విశాఖపట్నం	97,080 ▲	88,550 ▼	1,09,000 ▼
రాజమండ్రి	96,600 ▼	88,550 ▲	97,900 ▼
ప్రొద్దుటూరు	95,500 ▼	87,860 ▼	99,000 ▲
ముంబై	94,340 ▲	86,420 ▲	96,820 ▲

ఎయిర్‌టెల్ లాభం ఐదింతలు

న్యూఢిల్లీ: భారతి ఎయిర్‌టెల్ మార్చి త్రైమాసికంలో రూ.47,876.2 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.11,022 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే కంపెనీ ఆదాయం 27 శాతం, నికర లాభం 432 శాతం పెరిగాయి. గత ఏడాది జూలై మొదటి వారంలో ప్రకటించిన టారిఫ్‌ల పెంపు ఇందుకు బాగా దోహదం చేసిందని కంపెనీ తెలిపింది. దీంతో ఒక్కో ఖాతాదారుడి నుంచి లభించే సగటు ఆదాయం 17 శాతం పెరిగి రూ.245కు చేరింది. ఆర్థిక సంవత్సరం మొత్తానికి చూసినా ఎయిర్‌టెల్ రూ.1,72,985.2 కోట్ల ఆదాయంపై రూ.33,556 కోట్ల నికర లాభం ప్రకటించింది. వాటాదారులకు ఒక్కో షేరుపై రూ.16 చొప్పున డివిడెండ్ చెల్లించాలని కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

టాటా మోటార్స్ లాభం 51% క్షీణత

న్యూఢిల్లీ: టాటా మోటార్స్ లాభాలకు నాలుగో త్రైమాసికంలో లాభాలకు భారీగా గండి పడింది. ఈ త్రైమాసికంలో కంపెనీ రూ.8,556 కోట్ల కన్సాలిడేటెడ్ లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 51 శాతం తక్కువ. ఇదే సమయంలో కంపెనీ స్థూల ఆదాయం రూ.1,19,033 కోట్ల నుంచి స్వల్పంగా పెరిగి రూ.1,19,503 కోట్లకు చేరింది. ఆర్థిక ఫలితాలు అంతంత మాత్రంగానే ఉన్నా వాటాదారులకు ఒక్కో షేరుపై రూ.6 చొప్పున తుది డివిడెండ్ చెల్లించాలని కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

పెరిగిన సువెన్ లైఫ్ నష్టాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : సువెన్ లైఫ్ సైన్సెస్ నష్టాలు మార్చి త్రైమాసికంలో మరింత పెరిగాయి. గత ఏడాది నాలుగో త్రైమాసికంతో పోల్చితే కన్సాలిడేటెడ్ నష్టం రూ.26.54 కోట్ల నుంచి రూ.43.95 కోట్లకు పెరిగింది. ఖర్చులు రూ.34.21 కోట్ల నుంచి రూ.46.63 కోట్లకు చేరడంతో కంపెనీ ఆదాయం సైతం రూ.2.39 కోట్ల నుంచి రూ.1.47 కోట్లకు పడిపోయింది.

టాప్‌గేర్‌లో హీరో మోటో లాభాలు

న్యూఢిల్లీ: ద్విచక్ర వాహన దిగ్గజం హీరో మోటోకార్ప్ నాలుగో త్రైమాసికానికి రూ.1,169 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 24 శాతం ఎక్కువ. ఇదే సమయంలో కంపెనీ ఆదాయం రూ.9,794 కోట్ల నుంచి రూ.10,244 కోట్లకు చేరింది. ఆర్థిక ఫలితాలు బాగుండంతో వాటాదారులకు ఒక్కో షేరుపై రూ.65 చొప్పున తుది డివిడెండ్ చెల్లించాలని కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. రూ.2 ముఖ విలువ ఉన్న ఒక్కో షేరుపై ఇది 3,250 శాతానికి సమానం.



అబద్ధాల ఫ్యాక్టరీ.. పాక్

'ఆపరేషన్ సిందూర్'పై తప్పుడు సమాచారం.. పాక్ ఆర్మీ అధికారుల నోట అబద్ధాలే అబద్ధాలు

(సెంట్రల్ డెస్క్)

నోరు తెరిస్తే అబద్ధాలు..! తిమ్మిని బమ్మి చేసే ప్రయత్నాలు..! నిజం గడప దాటేలోపు.. అబద్ధాన్ని విశ్వవ్యాప్తం చేయడం..! ఈ జాతీయాలన్నీ దాయాదీ దేశం పాకిస్థాన్‌కు అచ్చంగా నప్పుతున్నాయి. గతంలోనే కాదు.. 'ఆపరేషన్ సిందూర్'పైనా పాకిస్థాన్ అసత్యాలను ప్రచారం చేసింది. అవన్నీ అబద్ధాలేనని భారత ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో(పీఐబీ)తోపాటు.. ఫ్యాక్ట్‌చెక్కర్లు తేల్చిచెప్పారు. తాము భారత్‌కు చెందిన 20 వైమానిక స్థావరాలను ధ్వంసం చేశామని, దాంతో భారత్ కాల్పుల విరమణకు ప్రతిపాదించిందని స్వయానా పాక్ ఆర్మీకి చెందిన ఇంటర్ సర్వీస్ పబ్లిక్ రిలేషన్స్(ఐఎస్‌పీఆర్) డీజీ పేర్కొన్నారు. తమ దాడుల్లో అదంపూర్ ఎయిర్‌బేస్ రన్‌వే ధ్వంసమైందని, ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థలను నిర్వీర్యం చేశామని చెప్పారు. ప్రధాని మోదీ మంగళవారం స్వయంగా అదంపూర్ ఎయిర్‌బేస్‌కు వెళ్లి.. రన్‌వేపై సైనికులతో మాట్లాడారు. ఆ వెనకాలే ఎస్-400 వ్యవస్థ కనిపించింది. ఈ నేపథ్యంలో.. పాక్ అబద్ధాలపై ప్రత్యేక కథనం..

వైమానిక దాడులపైనా

'ఆపరేషన్ సిందూర్'కు ప్రతిఘటనగా తామూ వైమానిక దాడులు జరిపినట్లు ఐఎస్‌పీఆర్ ప్రకటించింది. అందుకు సంబంధించినదిగా చెబుతూ పాకిస్థానీ మీడియాకు వీడియోలను షేర్ చేసింది. పాకిస్థాన్ మీడియా వాటిని ప్రసారం చేసింది. అయితే.. జర్మనీకి చెందిన వార్తా సంస్థ డీడబ్ల్యూ అవి తప్పుడు వీడియోలు అంటూ కథనాన్ని ప్రచురించింది. పాక్ సైన్యం షేర్ చేసిన ఫుటేజీ 2023లో హమాస్‌పై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడులకు సంబంధించినదని తేల్చిచెప్పింది. ఏఎఫ్‌పీ వార్తా సంస్థ కూడా ఆ ఫుటేజీని తొలుత షేర్ చేసి, ఆ తర్వాత ఉపసంహరించుకోవడం గమనార్హం. ఇక, పాక్, పీవోకేలో భారత్ జరిపిన దాడుల్లో మరణించిన ఉగ్రవాదుల అంత్యక్రియల్లో సైనికాధికారులు పాల్గొన్నారు. ఆ సందర్భంగా నిర్వహించిన ప్రార్థనల్లో ఉగ్రవాది హఫీజ్ రవూఫ్ ముందు వరసలో నిల్చున్నాడు. అయితే.. అతను ఉగ్రవాది కాదని, సామాన్య పౌరుడని ఐఎస్‌పీఆర్ డీజీ విలేకరులకు తెలిపారు. దీన్ని పీఐబీ ఎండగట్టింది. అతను కరడుగట్టిన ఉగ్రవాది అని పేర్కొనే ఆధారాలను ఎక్స్‌లో పోస్టు చేసింది.



ఉదమ్‌పూర్ ఎయిర్‌బేస్ ధ్వంసమైనట్లు చూపుతున్న ఫేక్ ఫొటో.. అంతా సేఫ్ అంటున్న మాక్సర్ ఉపగ్రహ చిత్రం



మన డ్రోన్లను కూల్చేశారట!

పాకిస్థాన్ ఎయిర్ బేస్‌లపై భారత్ ఈ నెల 9వ తేదీ అర్ధరాత్రి దాటాక హరూప్ డ్రోన్లతో దాడి చేసిన విషయం తెలిసిందే..! 10వ తేదీ ఉదయం తమ వైమానిక రక్షణ వ్యవస్థలు 26 భారత డ్రోన్లను కూల్చేశాయని, భారత్‌కు చెందిన ఐదు యుద్ధ విమానాలను కూడా ధ్వంసం చేశామని పాక్ ఆర్మీ ప్రకటించింది. ఆ దేశ ప్రధాని షహబాజ్ షరీఫ్ కూడా దీనిపై ప్రకటనలు చేశారు. నిజానికి హరూప్ 'సూసైడ్ డ్రోన్' రకానికి చెందినవి. ఇవి తమ లక్ష్యాలను ఛేదించేందుకు పేలిపోతాయి. సోమవారం నాటి భారత డీజీఎంవోల ప్రెస్‌మీట్‌లో.. పాకిస్థాన్‌కు చెందిన 11 ఎయిర్‌బేస్‌లను ధ్వంసం చేసినట్లు శాటిలైట్ చిత్రాలతో సహా ఆధారాలను చూపించారు. దీన్ని బట్టి.. సూసైడ్ డ్రోన్లు తమ పనిని పూర్తిచేశాక.. మిగిలిన శకలాలను సీజ్ చేసిన పాక్ ఆర్మీ.. వాటిని తాము కూల్చివేసినట్లు తప్పుగా క్లెయిమ్ చేసుకుంది.

కశ్మీర్‌పై మధ్యవర్తిత్వం అక్కర్లేదు!

» ట్రంప్ వ్యాఖ్యలను తోసిపుచ్చుతూ తన వైఖరి స్పష్టం చేసిన భారత్

న్యూఢిల్లీ, మే 13: భారత్, పాకిస్థాన్ మధ్య అణు యుద్ధాన్ని తానే నివారించానన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వాదనను భారత్ ఖండించింది. అంతేకాదు, కశ్మీర్ అంశంలో మధ్యవర్తిత్వం వహిస్తామన్న ట్రంప్ ప్రతిపాదనను తోసిపుచ్చింది. ట్రంప్ వ్యాఖ్యలపై మంగళవారం విలేకరులు అడిగిన ప్రశ్నలకు విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ బదులిస్తూ భారత్ వైఖరిని స్పష్టం చేశారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) పరిష్కారానికి ద్వైపాక్షిక చర్చలు తప్ప ఎలాంటి మధ్యవర్తిత్వాన్ని భారత్ అంగీకరించదని తేల్చి చెబుతూ ట్రంప్ ప్రతిపాదనను పరోక్షంగా తోసిపుచ్చారు. పాకిస్థాన్ అక్రమంగా ఆక్రమించిన భారత భూభాగాన్ని ఖాళీ చేయాల్సిందేనని, ఈ డిమాండ్‌లో ఎలాంటి మార్పు ఉండదని పేర్కొన్నారు. కాల్పుల విరమణ, ద్వైపాక్షిక చర్చల కోసం పాకిస్థాన్ నుంచే భారత విదేశాంగ శాఖకు విజ్ఞప్తి వచ్చిందని తెలిపారు. కాల్పుల విరమణపై ఇరు దేశాల మధ్య డీజీఎంవోల స్థాయిలోనే చర్చలు జరిగాయని జైశ్వాల్ పేర్కొంటూ తన చొరవతోనే భారత్, పాక్ మధ్య యుద్ధం ఆగిందన్న ట్రంప్ ప్రకటనను కూడా పరోక్షంగా ఖండించారు. పాకిస్థాన్ దాడి చేస్తే.. భారత్ బదులిస్తుందని, పాకిస్థాన్ చేయకపోతే భారత్ కూడా చేయదని తెలిపారు. ఇదే విషయాన్ని పాక్ డీజీఎంవోకు తెలియజేశామని చెప్పారు. 'ఆపరేషన్ సిందూర్ మొదలైనప్పటి నుంచి ఈ నెల 10 వరకు జరిగిన సైనిక చర్యలపై భారత్-అమెరికా మధ్య చర్చలు జరిగాయి. యుద్ధ వాతావరణంలోనే చర్చలు జరిగాయి తప్ప వాణిజ్య అంశాలు ప్రస్తావనకు రాలేదని తెలిపారు. పాక్‌లోని కిరానా అణు స్థావరాన్ని భారత్ క్షిపణులు తాకడంతో నష్టం జరిగిందన్న వార్తలపై విలేకరులు అడిగిన ప్రశ్నకు జైశ్వాల్ స్పందిస్తూ.. దీనిపై పాకిస్థానే బదులివ్వాలన్నారు. సీమాంతర ఉగ్రవాదానికి పాక్ మద్దతు నిలిపివేసే వరకు సింధూ జలాల ఒప్పందం నిలిపివేత కొనసాగుతుందన్నారు. కాగా, అపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా నిర్వహించి తీరుపై 70 దేశాల రక్షణ శాఖ ప్రతినిధులకు రక్షణ శాఖ నిఘా విభాగం డీజీ డీఎస్ రాణా వివరించారు. ఢిల్లీ కంటోన్మెంట్‌లోని మాణిక్‌షా కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి 7పెద్ద దేశాలతో పాటు ఇస్లామిక్ దేశాల ప్రతినిధులు కూడా హాజరయ్యారు.



రణధీర్ జైశ్వాల్

2023 నాటి యుద్ధ నౌకల విన్యాసం

భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవల ఐఎస్‌పీఆర్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాక్ నేవీ అధికారి ఓ ప్రజెంటేషన్ ఇచ్చారు. భారత నౌకాదళాన్ని కట్టడి చేయడానికి జలాంతర్గాములతో పాటు.. అరేబియా సముద్రంలో నౌకలను మోహరించామంటూ ఓ చిత్రాన్ని విడుదల చేశారు. ఈ చిత్రంలో మూడు యుద్ధ నౌకలు, వాటిపై ఎగురుతున్న నిఘా విమానాలు ఉన్నాయి. నిజానికి ఆ ఫొటో 2023 నాటిదని ఫ్యాక్ట్‌చెక్కర్లు తేల్చారు. చైనా-పాకిస్థాన్ సంయుక్తంగా చేపట్టిన యుద్ధనౌకల విన్యాసాల ఫొటో(ద యురేషియన్ టైమ్స్‌లో ప్రచురితమైంది)ను పాక్ నౌకాదళ అధికారి ప్రజెంటేషన్‌లో చూపించారని పేర్కొన్నారు.



భారత్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో నౌకాదళం దాడికి సిద్ధంగా ఉందని ఐఎస్‌పీఆర్ ప్రెస్‌మీట్‌లో చెబుతున్న పాక్ నేవీ అధికారి



2023లో చైనా-పాక్ సంయుక్తంగా నిర్వహించిన విన్యాసాల్లోని ఫుటేజీ ఇది.. ఇదే చిత్రాన్ని పాక్ నేవీ అధికారి ఐఎస్‌పీఆర్ ప్రెస్‌మీట్‌లో చూపించారు

పాక్ ఎయిర్‌బేస్‌ల పైనా అబద్ధాలే

పాకిస్థాన్‌లోని నూర్‌ఖాన్, రహీంయార్‌ఖాన్, సర్గోదా వంటి ఎయిర్‌బేస్‌లు ధ్వంసమైనట్లు భారతీయ మీడియా ఈనెల 10న కథనాలను ప్రసారం చేసింది. దాన్ని ఫేక్‌న్యూస్‌గా చెప్పిన ఐఎస్‌పీఆర్.. తమ వైమానిక స్థావరాలు సురక్షితంగా ఉన్నట్లు చెప్పింది. కానీ, మాక్సర్ ఉపగ్రహ చిత్రాల ఆధారంగా భారత మీడియా నిజమే చెబుతోందని ఫ్యాక్ట్‌చెక్కర్లు నిర్ధారించారు. సర్గోదా ఎయిర్‌బేస్ రన్‌వే 14/32, 06/12 వద్ద ధ్వంసమైన శాటిలైట్ చిత్రాలను ఎక్స్‌లో పోస్టు చేశారు. భోలారీ ఎయిర్‌బేస్‌లో విమానాల హ్యాంగర్ ధ్వంసమైన చిత్రాలను ప్రదర్శించారు. భారత డీజీఎంవోలు కూడా సోమవారం నాటి ప్రెస్‌మీట్‌లో వాటికి ఆధారాలను చూపించారు.

గూఢచర్యం ఆరోపణలతో పాక్ హై కమిషన్ అధికారి బహిష్కరణ

» 24 గంటల్లో దేశం విడిచి వెళ్లాలని భారత్ ఆదేశం

న్యూఢిల్లీ, మే 13 : ఢిల్లీలోని పాకిస్థాన్ హై కమిషన్ కార్యాలయంలో పనిచేస్తోన్న ఆ దేశ అధికారి ఒకరిని భారత్ మంగళవారం బహిష్కరించింది. ఆయన తన హోదాకు తగని విధంగా వ్యవహరిస్తుండడంతో 24 గంటల్లో దేశం విడిచి వెళ్లాలని ఆదేశించినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. పంజాబ్ పోలీసులు విచారిస్తోన్న ఓ గూఢచర్యం కేసుకు సంబంధించే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పంజాబ్ పోలీసులు ఆదివారం గూఢచర్యం ఆరోపణలపై ఒక మహిళ, మరో పురుషుడిని అరెస్టు చేశారు. వీరికి పాక్ హై కమిషన్ కార్యాలయంలోని ఆ అధికారితో సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు. భారత సైన్యం కదలికలపై వీరు పాక్‌కు సమాచారం చేరవేస్తున్నట్లు పంజాబ్ డీజీపీ గౌరవ్ యాదవ్ వెల్లడించారు.

బ్యాన్ తుర్కియే

» ఆ దేశం నుంచి వచ్చే యాపిల్స్ వద్దన్న పుణె వ్యాపారులు

మే 13: భారత్-పాక్ ఉద్రిక్తతల వేళ తుర్కియే పాకిస్థాన్‌కు మద్దతు ఇవ్వడం పట్ల దేశంలో తీవ్ర నిరసనలు వ్యక్తం అయ్యాయి. దేశవ్యాప్తంగా బ్యాన్ తుర్కియే ఉద్యమం ఊపందుకుంది. తాజాగా పుణెలో పలువురు వ్యాపారులు ఆ దేశం నుంచి వచ్చే యాపిల్స్‌ను పూర్తిగా బహిష్కరించారు. ప్రస్తుతం అక్కడి మార్కెట్లలో తుర్కియే నుంచి దిగుమతి అయిన యాపిల్స్ కనిపించడంలేదు. బదులుగా హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఇరాన్ దేశాల నుంచి వాటిని వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. ఏటా పుణె మార్కెట్‌లో తుర్కియే నుంచి వచ్చిన యాపిల్స్ మార్కెట్ విలువ వందల కోట్లలో ఉంటుందని అంచనా.

సాంబా సెక్టార్‌లోకి ప్రవేశించింది పాక్ డ్రోన్లే

న్యూఢిల్లీ, మే 13 : జమ్మూ కశ్మీర్‌లోని సాంబా సెక్టార్‌లోకి సోమవారం సాయంత్రం ప్రవేశించిన పాకిస్థాన్ డ్రోన్లను కూల్చేశామని భారత ఆర్మీ మంగళవారం ప్రకటించింది. డ్రోన్ల ద్వారా ఎదురైన ముప్పుతో కొంత సమయం బ్లాక్ ఔట్ పాటించడం వల్ల ఆ ప్రాంతంలో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొందని పేర్కొంది. సాంబా సెక్టార్‌లో సోమవారం సాయంత్రం కనిపించిన కొన్ని డ్రోన్లు మినహా మరే ప్రాంతంలోనూ పాక్ డ్రోన్ల కదలికలు రికార్డు కాలేదని అధికారులు స్పష్టం చేశారు.

పహల్గాంపై రివ్యూకమిటీ వేయండి: కాంగ్రెస్

న్యూఢిల్లీ, మే 13: పహల్గాం ఉగ్రదాడి ఘటనకు దారితీసిన కారణాలపై లోతైన అధ్యయనం కోసం రివ్యూ కమిటీని నియమించాలని మోదీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. కార్గిల్ యుద్ధం ముగిసిన వెంటనే ఇలాంటి కసరత్తును అప్పటి వాజపేయీ ప్రభుత్వం చేసిందని ఏఐసీసీ సమాచార విభాగం ఇన్‌చార్జి జైరామ్ రమేశ్ గుర్తుచేశారు. "కార్గిల్ యుద్ధం ముగిసిన మూడోరోజున, 1999 జూలై 29న, అప్పటి కేంద్ర ప్రభుత్వం కార్గిల్ రివ్యూ కమిటీని ఏర్పాటుచేసింది" అని వివరించారు. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ తండ్రి, వ్యూహాత్మక వ్యవహారాల గురు కె.సుబ్రహ్మణ్యం ఆ రివ్యూ కమిటీకి నాయకత్వం వహించారని జైరామ్ రమేశ్ తెలిపారు.



ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో బీజేపీ దేశవ్యాప్తంగా 'తిరంగా ర్యాలీ'లకు సోమవారం పిలుపునిచ్చింది. ఈ పిలుపు మేరకు మంగళవారం అహ్మదాబాద్‌లో భారీ పతాకంతో ర్యాలీ నిర్వహించారు.

మా సైనికులు 11 మంది చనిపోయారు

» 78 మంది గాయపడ్డారు: పాక్ ఆర్మీ

ఇస్లామాబాద్, మే 13: భారత్ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌లో తమ స్క్వాడ్రన్ లీడర్ సహా 11 మంది సైనికులు చనిపోయారని, మరో 78 మంది గాయాలపాలయ్యారని పాక్ మిలటరీ ప్రకటించింది. అంతేకాక, మరో 40 మంది పౌరులు ప్రాణాలు కోల్పోగా 121 మంది గాయపడ్డారని పేర్కొంది. మృతుల్లో పాక్ వాయుసేనకు చెందిన స్క్వాడ్రన్ లీడర్ ఉస్మాన్ యూసఫ్, చీఫ్ టెక్నీషియన్ ఔరంగజేబ్, సీనియర్ టెక్నీషియన్ నజీబ్ తదితరులు ఉన్నారని వెల్లడించింది. కాగా, రావల్పిండిలోని మిలటరీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ మునీర్ సోమవారం స్వయంగా పరామర్శించారు. మరోపక్క, కాల్పుల విరమణ ఒప్పందానికి తాము కట్టుబడి ఉన్నామని పాకిస్థాన్ మంగళవారం ప్రకటించింది. ఆపరేషన్ సిందూర్‌పై ప్రసంగిస్తూ మోదీ సోమవారం చేసిన వ్యాఖ్యలను నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తున్నామని వెల్లడించింది. కాల్పుల విరమణ కోరుతూ భారత్ వద్దకు పాకిస్థాన్ పరుగెత్తుకుంటూ వచ్చిందనేది మరో పచ్చి అబద్ధం అని ఆరోపించింది. మోదీ వ్యాఖ్యలు, భారత్ తీరు ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలను పెంచేలా ఉన్నాయని విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది.

పహల్గాం ఉగ్రదాడి కుట్రదారు షాహిద్ కుట్టే హతం

» కశ్మీర్‌లోని షోపియాన్‌లో ఎన్‌కౌంటర్

» మరో ఇద్దరు ఉగ్రవాదులూ హతం



శ్రీనగర్, మే 13 : పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడికి కుట్ర పన్నిన 'ద రెసిస్టెన్స్ ఫ్రంట్(టీఆర్ఎఫ్) కమాండర్ షాహిద్ కుట్టే హతమయ్యాడు. భద్రతా దళాలు జమ్ము, కశ్మీర్‌లోని షోపియాన్‌లో మంగళవారం ఆపరేషన్ కెల్లర్ పేరిట జరిపిన సోదాల్లో మొత్తం ముగ్గురు ఉగ్రవాదులు హతమవ్వగా వారిలో ఒకరు షాహిద్ కుట్టే, మరొకరు అద్నాన్ షఫీ అని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. దక్షిణ కశ్మీర్ జిల్లాలోని షుక్రూ కెల్లర్ ప్రాంతంలో ఉగ్రవాదుల సంచారంపై సమాచారం అందడంతో భద్రతా దళాలు అక్కడ సోదాలు చేపట్టాయి. ఆ సమయంలో ఉగ్రవాదులు కాల్పులకు దిగడంతో భద్రతా సిబ్బంది తిరిగి కాల్పులు జరపగా ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. షోపియాన్ జిల్లా చోటిపోరా హీరాపోరా ప్రాంతానికి చెందిన షాహిద్ కుట్టే 2023 మార్చిలో లష్కరే తాయిబాలో చేరి కమాండర్‌గా ఎదిగాడు. ఇతడిని కేటగిరీ 'ఎ' ఉగ్రవాదిగా గుర్తించారు. షాహిద్ హీరాపోరాలో 2024 మే 18న బీజేపీకి చెందిన ఒక సర్పంచిని హత్య చేశాడు. కాగా షోపియాన్ జిల్లాలోని వందునా మెల్హోరా ప్రాంతానికి చెందిన షఫీ 2024 అక్టోబరులో ఉగ్రబాట పట్టాడు. అదే నెలలో షోపియాన్‌లో స్థానికేతర కార్మికుల హత్యలో పాల్గొన్నాడు.

ఆపరేషన్ సిందూర్.. పాక్‌కు లక్ష్మణ రేఖ

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడడం విశేషం. 'భారత్ మాతా కీ జై' అంటూ మోదీ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. "ఉగ్రవాదాన్ని అంతం చేయాలని మన సైన్యం శపథం చేసింది. మన బలగాలు చూపిన శక్తిసామర్థ్యాలను ఎంత ప్రశంసించినా తక్కువే. అణు బెదిరింపులను కూడా అపహాస్యం చేశాయి. భారతదేశ శక్తిసామర్థ్యాలు చూసి నా జీవితం ధన్యమైంది. యుద్ధక్షేత్రంలోనూ భారత్ మాతా కీ జై నినాదం చేశాం. ఆకాశం నుంచి పాతాళం వరకు ఆ నినాదం మార్మోగింది. ఈ గడ్డపై నుంచి వీర సైనికులందరికీ సెల్యూట్ చేస్తున్నా. మీ పరాక్రమంతో ఆపరేషన్ సిందూర్ నినాదం ప్రపంచమంతా మార్మోగుతోంది. ధర్మ సంస్థాపన కోసం ఆయుధం పట్టడం మన సంప్రదాయం, విధానం. మన అక్కాచెల్లెళ్ల నుదుటి సిందూరం తుడిచినవాడి నట్టింట్లోకి వెళ్లి నాశనం చేశాం. మీరు చరిత్ర సృష్టించారు. నేను మీ ఆశీస్సుల కోసం వచ్చా"అని మోదీ ఉద్వేగంగా చెప్పారు.

భారత్‌పై కుట్రలు చేస్తే.. విధ్వంసమే

"మన త్రివిధ దళాలు పాక్ సైన్యాన్ని మట్టికరిపించాయి. భారత్‌పై పన్నాగాలు పన్నితే తమ విధ్వంసాన్ని కొనితెచ్చుకోవడమేనని ఉగ్రగురువులు గ్రహించారు. మన సైనిక శక్తి పాక్‌కు నిద్రపట్టనివ్వడం లేదు. ఆపరేషన్ సిందూర్ విషయంలో మానవ వనరుల శక్తి, యంత్రాలు, త్రివిధ దళాల మధ్య సమన్వయం అద్భుతం. మనం ఉగ్రస్థావరాలను లక్ష్యంగా చేసుకుంటే.. పాక్ వాటిని కాపాడేందుకు పౌర విమానాలను పణంగా పెట్టింది. అమాయకుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టివేసింది. అలాంటి పరిస్థితుల్లో దాడులు ఎంత కష్టమో నాకు తెలుసు. కానీ, మీరు అత్యంత కచ్చితంగా, పౌర విమానాలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా.. కేవలం ఉగ్ర శిబిరాలపైనే అత్యంత కచ్చితత్వంతో దాడులు చేశారు. మీరు చేసిన అద్భుతాన్ని చూసి నేను గర్వపడుతున్నా. భారత్ ఎప్పుడూ శాంతినే కోరుకుంటుంది. కానీ, దాడి జరిగితే శత్రువును తుదముట్టిస్తుంది. మరోసారి దాడికి ప్రయత్నిస్తే వినాశనమే" అని మోదీ హెచ్చరించారు.



అదంపూర్ ఎయిర్ బేస్‌లో సైనికులతో ప్రధాని మోదీ

పాక్ తప్పుడు ప్రచారానికి చెక్

"ఈ ఉదయం నేను అదంపూర్ ఎయిర్‌బేస్‌కు వెళ్లాను. అక్కడ మన పోరాటయోధులను కలిశా" అని ప్రధాని 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. వారితో దిగిన చిత్రాలను, వీడియోలను షేర్ చేశారు. అక్కడ గంటన్నరకు పైగా గడిపారు. ఆ సమయంలో మోదీ త్రిశూల్ లోగోతో కూడిన పశ్చిమ ఎయిర్ కమాండ్ టోపీని ధరించారు. ప్రధాని మోదీ షేర్ చేసిన చిత్రాల్లో చెక్కు చెదరకుండా ఉన్న ఎస్-400 రక్షణ వ్యవస్థ కనిపించింది. దీంతో, అదంపూర్‌లోని ఎస్-400 స్థావరాన్ని ధ్వంసం చేశామన్న పాక్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టినట్లైంది. ఎస్-400 రక్షణ వ్యవస్థ ముందు నిల్చొని ప్రసంగించడం ద్వారా పాక్ చెప్పేవన్నీ అబద్ధాలేనని మోదీ ప్రపంచానికి తెలిసేలా చేశారు.

భారత్‌కు ప్రతిష్ఠాత్మక స్థావరం!

అందపూర్ వైమానిక స్థావరం.. పంజాబ్‌లోని జలంధర్, హోషియార్‌పూర్ మధ్య ఉంది. ఇది పాకిస్థాన్ సరిహద్దుకు 100 కిలోమీటర్లలోపే ఉంటుంది. భారత వాయుసేన (ఐఏఎఫ్)కు ఇది రెండో అతిపెద్ద ఎయిర్‌బేస్. ఇక్కడ 'బ్లాక్ ఆర్చ్స్'గా పేర్కొనే ఐఏఎఫ్ 47వ స్క్వాడ్రన్ ఉంటుంది. దీంతో పాటు 'తొలి సూపర్‌సోనిక్స్'గా పేర్కొనే 28వ స్క్వాడ్రన్ కూడా ఉంటుంది. ఈ స్క్వాడ్రన్‌లో సుఖోయ్-30ఎంకేఐ విమానాలు ఉంటాయి. 75 ఏళ్ల కిందట ఏర్పాటైన ఈ ఎయిర్ బేస్ భారత్‌కు అత్యంత కీలకం, వ్యూహాత్మకం కూడా. ఈ స్థావరంపై పాక్ ఎప్పుడూ కన్నేసి ఉంచుతుంది. 1965, 1971, కార్గిల్ యుద్ధం.. ఇలా పలుమార్లు పాకిస్థాన్ బలగాలు అదంపూర్ ఎయిర్‌బేస్‌పై దాడులకు ప్రయత్నించి, విఫలమయ్యాయి. ఈ నెల 9, 10 తేదీల్లో పాక్ ఈ స్థావరాన్ని లక్ష్యంగా చేసుకొని ఆరు క్షిపణులను ప్రయోగించగా.. ఎయిర్‌బేస్‌కు 7 కి.మీ. దూరంలోనే మన గగనతల రక్షణ వ్యవస్థ వాటిని కూల్చివేసింది.

రెక్కలు విరిగిన పాకిస్థాన్

» 20% వైమానిక ఆస్తులు ధ్వంసం

న్యూఢిల్లీ, మే 13: భారత వైమానిక దళం జరిపిన దాడుల్లో పాకిస్థాన్‌లోని 11 వైమానిక స్థావరాలు సహా పలు సైనిక స్థావరాలు ధ్వంసమయ్యాయి. పలు ఫైటర్ జెట్లు, మౌలికసదుపాయాలు కూడా నేలమట్టమయ్యాయి. వైమానిక స్థావరాల్లో ఎటు చూసినా లోతైన గుంతలు, ధ్వంసమైన హ్యాంగర్లు దర్శనమిచ్చాయి. దీంతో పాకిస్థాన్ రెక్కలు విరిగినట్లు అయింది. భారత్ జరిపిన దాడితో తమకేమీ పెద్దగా నష్టం కలగలేదని దాయాది దేశం బుకాయించే ప్రయత్నం చేసినా.. హైరిజొల్యూషన్ శాటిలైట్ ఫొటోలు మాత్రం ఊహకు సైతం అందని రీతిలో పాక్‌కు జరిగిన భారీ నష్టాన్ని కళ్లకు కట్టాయి. ఆపరేషన్ సిందూర్‌లో రావల్పిండిలోని నూర్ ఖాన్, సింధ్‌లోని సుక్కూర్, పంజాబ్‌లోని రహీం యార్ ఖాన్ మిలిటరీ స్థావరాలు నాశనమయ్యాయి. అదేవిధంగా సర్గోదాలోని ముషాఫ్, ఉత్తర సింధు ప్రాంతంలోని షహ్‌బాజ్ జకోబాబాద్, ఉత్తర ఠట్టాలోని భొలారీ వైమానిక స్థావరాలు ధ్వంసమయ్యాయి. అమెరికాకు చెందిన ఏరోస్పేస్ సంస్థ 'మాక్సర్ టెక్నాలజీస్' విడుదల చేసిన హైరిజొల్యూషన్ చిత్రాలు ఈ ధ్వంసాన్ని కళ్లకు కట్టాయి. ఆపరేషన్ సిందూర్‌తో పాక్ వైమానిక స్థావరాల్లోని 20% ఆస్తులు, మౌలిక సదుపాయాలు ధ్వంసమయ్యాయి. ఆయా వైమానిక స్థావరాల్లోని ఎఫ్-16, జేఎఫ్-17 యుద్ధ విమానాలు, ఆయుధాగారాలే లక్ష్యంగా ఈ దాడులు చేసినట్లు ఉన్నతస్థాయి అధికారి ఒకరు తెలిపారు.



సర్గోదా ఎయిర్‌బేస్‌లో దాడిని నిర్ధారిస్తున్న ఉపగ్రహ చిత్రం

మరిన్ని ఎస్-400లు కావాలి

» రష్యాను కోరిన భారత్

న్యూఢిల్లీ, మే 13: ఆపరేషన్ సిందూర్‌లో రష్యాకు చెందిన ఎస్-400 క్షిపణి వ్యవస్థ కీలక పాత్ర పోషించిన నేపథ్యంలో మరిన్ని ఎస్-400లు కావాలని భారత్ రష్యాను కోరినట్లు రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. దీనికి రష్యా కూడా సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ క్షిపణులు, డ్రోన్లను సమర్థంగా పేల్చేసిన ఎస్-400ను ఇండియాలో 'సుదర్శన్ చక్ర'గా అభివర్ణిస్తున్నారు. ఎస్-400 ఆయుధ వ్యవస్థ 600 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. శత్రుదేశాలకు చెందిన క్షిపణులు, డ్రోన్లను 400కిలోమీటర్ల దూరంలో ఉండగానే గుర్తించి పేల్చివేయగలదు. భారత దేశం 2018లో 5.43బిలియన్ డాలర్లతో ఐదు ఎస్-400లను కొనుగోలు చేసింది. కాగా, ఆపరేషన్ సిందూర్‌లో భారత్ సొంత ఆయుధాలు చక్కని పనితీరును కనబర్చాయని అమెరికా ఆర్మీ మాజీ అధికారి ప్రశంసించారు. అదే సమయంలో చైనా ఆయుధాలు విఫలమయ్యాయన్నారు.



లాడ్‌బజార్‌లో చాయ్, బిస్కెట్‌ను ఆస్వాదిస్తున్న మిస్ వరల్డ్ పోటీదారులు



చార్మినార్ చెంత..

అందాల పుంత

ప్రపంచ సుందరి పోటీదారుల హెరిటేజ్ వాక్

- మినార్లను ప్రత్యక్షంగా తిలకించి తన్మయత్వం
- నేడు ఓరుగల్లు పర్యటనకు సుందరీమణులు

హైదరాబాద్/సిటీ/చార్మినార్, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోని అందమంతా ఒక్కచోటకు చేరింది.. ప్రఖ్యాతి గాంచిన చార్మినార్ వద్ద సందడి చేసింది. మిస్ వరల్డ్ పోటీల కోసం పలు దేశాల నుంచి తరలివచ్చిన అందగత్తెలు మంగళవారం సాయంత్రం చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్‌లో పాల్గొన్నారు. ఇక్కడి చారిత్రక కట్టడాలు, వ్యాపార, వాణిజ్య కేంద్రాలను పరిశీలిస్తూ ఉత్సాహంతో ఉరకలేశారు. ఆయా దేశాల సంప్రదాయ దుస్తులను ధరించి చార్మినార్‌కు వచ్చిన ముద్దుగుమ్మలకు అరబిక్ సంప్రదాయ వాయిద్యాలు, మర్ఫా సంగీతంతో కళాకారులు స్వాగతం పలికారు. లయబద్ధంగా చేసిన మర్ఫా సంగీతానికి పలువురు సుందరీమణులు ఆనందోత్సాహంతో అభివాదం చేస్తూ స్టెప్పులేస్తూ ప్రత్యేక వేదికపైకి చేరుకున్నారు. వేదిక వద్ద తెలుగు సంప్రదాయం ప్రకారం పర్యాటక అధికరారుల బృందం వారికి స్వాగతం పలికింది. ఓవైపు మర్ఫా సంగీతం, మరోవైపు స్థానికుల కేరింతల మధ్య ముద్దుగుమ్మలు చేసిన సందడితో చార్మినార్ పరిసరాలు సరికొత్త అందాన్ని సంతరించుకున్నాయి. అమెరికా, యూరప్, ఆఫ్రికా, ఆసియా దేశాలకు చెందిన 109 మంది అందగత్తెలు చార్మినార్ ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక మెట్ల వేదికపై వరుస క్రమంలో చేరుకుని చిరునవ్వులు చిందిస్తూ ఫొటో షూట్‌కు హాజరయ్యారు. అనంతరం చార్మినార్‌లోకి ప్రవేశించి అద్భుత కట్టడాన్ని పరిశీలించారు. ఉత్తర-దక్షిణ భారత రాష్ట్రాల సంస్కృతి, సమ్మిళిత సంప్రదాయాలకు కేంద్రంగా నిలిచిన హైదరాబాద్ నగర వైభవ ప్రాభవాన్ని ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేస్తూ ఐకాన్‌గా నిలిచిన చార్మినార్ నిర్మాణంలోని సుందర లతామల్లికల కుడ్య చిత్రాలు, నగిషీలను చూసి ముగ్ధులయ్యారు. సొగసైన కట్టడం నిర్మాణ శైలిని పరిశీలించి.. చారిత్రక ప్రాశస్త్యాన్ని తెలుసుకుని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

లాడ్‌బజార్ దుకాణాల సందర్శన

చార్మినార్‌ను పరిశీలించిన అనంతరం ప్రపంచ సుందరి పోటీదారులు లాడ్‌బజార్‌లోకి ప్రవేశించారు. అక్కడి వ్యాపారులు తమ దుకాణాల్లో ముత్యాలు, రత్నాలు పొదిగిన రంగు రంగుల డిజైన్‌ల లక్కగాజులను అందంగా అలంకరించారు. ఈ దుకాణాలను సందర్శించిన సుందరీమణులు అక్కడ ప్రదర్శించిన లక్కగాజులు, మేలిమి ముత్యాల హారాలు, అలంకరణ వస్తు సామగ్రిని పరిశీలించారు. హైదరాబాద్ ప్రత్యేక డిజైన్ మట్టిగాజులు, పెళ్లి, పేరంటాళ్ల సందర్భంలో వినియోగించే ప్రత్యేక అలంకరణ వస్తు సామగ్రి వివరాలను, వాటిని ధరించే తీరును వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా డిజైన్ గాజులను కొనుగోలు చేసేందుకు సుందరీమణులు ఎంపిక చేసుకోగా.. వ్యాపారులు వారి వద్ద డబ్బు తీసుకోకుండా కానుకగా అందించారు. అక్కడే లక్కగాజుల తయారీ ప్రక్రియను ముద్దుగుమ్మలు పరిశీలించారు. హస్త కళాకారులతో చేయి కలిపి అభినందించారు. కాగా, చార్మినార్ వద్ద మిస్‌వరల్డ్ పోటీదారులతో ఏర్పాటు చేసిన హెరిటేజ్‌వాక్‌తో హైదరాబాద్ నగర సాంస్కృతిక వారసత్వం, వైభవ ప్రాభవ సౌందర్యాన్ని ప్రపంచానికి మరోసారి తెలియజేసినట్లయింది.

వామపక్ష మహిళా నేతల హౌస్ అరెస్టు

చార్మినార్ వద్ద ప్రపంచ సుందరి పోటీదారుల హెరిటేజ్ వాక్ నేపథ్యంలో మంగళవారం వామపక్ష ప్రజాసంఘాలకు చెందిన పలువురు మహిళా నేతలను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. అందాల పోటీలను వామపక్ష విద్యార్థి, యువజన, మహిళా సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తుండడంతో పోలీసులు ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. హిమాయత్‌నగర్‌లోని పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య, నగర కార్యదర్శి వరలక్ష్మిని గృహ నిర్బంధం చేశారు. రాంనగర్‌లోని మార్క్స్ భవనం, బాగ్‌లింగంపల్లి ఐద్వా కార్యాలయం, ఖైరతాబాద్‌లోని ఏఐఎంఎస్ఎస్ ఆఫీసుల వద్ద కూడా పోలీసులు పహారా కాశారని ప్రజాసంఘాల నేతలు తెలిపారు.



చార్మినార్ వద్ద సెల్ఫీ తీసుకుంటున్న వివిధ దేశాల భామలు

చేతికి గాజులు తొడుక్కుని.. మెడలో దండలు వేసుకుని..

లక్కగాజులకు పెట్టింది పేరుగా నిలిచే పాతబస్తీలోని లాడ్ బజార్‌ను మిస్‌వరల్డ్ పోటీదారులు సందర్శించారు. ఇరుకు గల్లీలో రెండు వైపులా ఉన్న గాజుల షాపులు, ముత్యాలహారాల దుకాణాలు, సంప్రదాయ పెళ్లి దుస్తులు, మెహిందీ కోన్లను కొనుగోలు చేసి సందడి చేశారు. అయా దుకాణాల్లో తమకు నచ్చిన వస్తువులను కొనుగోలు చేశారు. అధికారులు ముందస్తుగా ఎంపిక చేసిన దుకాణాలకు వెళ్లిన ముద్దుగుమ్మలు.. వాటిలోని వస్తువులను తిలకించి పులకించారు. ప్రధానంగా లక్కగాజులు, మట్టిగాజులను చేతికి తొడుక్కుని సంతోష పడ్డారు. మరికొందరు ముత్యాల దండలను మెడలో వేసుకుని తన్మయత్వం పొందారు. మరికొందరు సంప్రదాయ దుస్తులు, దుపట్టా, లెహంగాలను కొనుగోలు చేశారు. తమ వద్ద ఇండియన్ కరెన్సీ లేకపోవడంతో డెబిట్ కార్డుల ద్వారా గాజులు, ముత్యాల దండలను తీసుకున్నారు. కాగా, తమ దుకాణానికి వచ్చిన విదేశీ వనితలకు పలువురు నిర్వాహకులు బహుమతిగా చిన్నపాటి ముత్యాల దండలను ఇచ్చారు. అంతకుముందు పలువురు ఉస్మానియా బిస్కెట్లు తిని, ఇరానీ చాయ్ తాగారు. మిస్‌వరల్డ్ పోటీదారుల పర్యటన నేపథ్యంలో లాడ్‌బజార్ రోడ్డును అందంగా తీర్చిదిద్దారు. నాలుగు రోజుల వరకు గతుకులుగా ఉన్న రోడ్డుపై బీటీ వేశారు. అలాగే మధ్యలో ఆకర్షణీయమైన వస్తువులను ఉంచారు.

పోలీసుల భారీ బందోబస్తు..

చార్మినార్, లాడ్‌బజార్‌లో మిస్‌వరల్డ్ పోటీదారుల హెరిటేజ్ వాక్ నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. చార్మినార్ నలుదిక్కులైన గుల్జార్‌హౌస్, లాడ్ బజార్, సర్దార్ మహల్‌చౌరస్తా, చార్మినార్ బస్టాండ్ వరకు బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనదారులు, సందర్శకులను కట్టడి చేశారు. చార్మినార్ ప్రాంగణంలోకి ఎక్కువ మందిని రాకుండా అడ్డుకున్నారు. కేవలం కొన్ని దుకాణాలకు మాత్రమే అనుమతించారు. కాగా, హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ పోలీసు అధికారులతో వచ్చి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మధ్యాహ్నం 3.15 గంటల నుంచి చార్మినార్ ప్రాంగణంలో అప్పటికే ఉన్న సందర్శకులు, కొనుగోలుదారులను పోలీసులు బయటికి పంపించారు. మొత్తంగా మూడంచెల భద్రత చేపట్టారు. అందాలభామలు చార్మినార్ నుంచి వెళ్లిన తర్వాత సాయంత్రం 6.30 గంటల నుంచి సందర్శకులను అనుమతించారు.

నేడు ఓరుగల్లుకు సుందరీమణులు

వరంగల్: ప్రపంచ సుందరి పోటీదారులు బుధవారం ఓరుగల్లును సందర్శించనున్నారు. కాకతీయుల కళా వైభవానికి నిదర్శనంగా నిలుస్తున్న వరంగల్ నగరంలో పర్యటించనున్నారు. అందాలభామల రాక కోసం అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. వరంగల్ కోట, వెయ్యి స్తంభాల ఆలయం, రామప్ప ఆలయాలను విద్యుత్ కాంతులతో అలంకరించారు. ఈ సందర్భంగా భారీ భద్రత ఏర్పాటు చేశారు.



చౌమహల్లా ప్యాలెస్‌లో విందుకు హాజరైన వివిధ దేశాల సుందరీమణులు

హైదరాబాద్ ఆతిథ్యం అదుర్స్

అందాల భామలకు చౌమహల్లా ప్యాలెస్‌లో ప్రభుత్వ విందు

- మిస్‌వరల్డ్ పోటీదారులను మైమరిపించిన తెలంగాణ రుచులు
- కుటుంబసమేతంగా విచ్చేసిన సీఎం రేవంత్
- హాజరైన మంత్రులు, సినీ నటుడు నాగార్జున

హైదరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): మిస్ వరల్డ్ -2025 పోటీదారుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విందులో ఘుమఘుమలాడే హైదరాబాద్ ప్రత్యేక వంటకాలను ఆరగించిన వివిధ దేశాల సుందరీమణులు, ప్రతినిధులు.. హైదరాబాద్ ఆతిథ్యం అదుర్స్ అన్నారు. హైదరాబాద్ ఆతిథ్యం, తెలంగాణ ప్రజల ఆదరణ తమను మైమరిపించిందని, ఈ పర్యటనను జీవితాంతం గుర్తు పెట్టుకుంటామని పలువురు పేర్కొన్నారు. ఇక, 'తెలంగాణ.. జరూర్ ఆనా' నినాదాన్ని తమ దేశంలో వినిపిస్తామని చెప్పారు. మిస్‌వరల్డ్ పోటీదారులకు, ఆయా దేశాల ప్రతినిధులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం.. హైదరాబాద్‌లోని చౌమహల్లా ప్యాలెస్‌లో మంగళవారం సాయంత్రం స్వాగత విందు ఏర్పాటు చేసింది. చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్ అనంతరం మిస్‌వరల్డ్ ప్రతినిధులు షాపింగ్ ముగించుకుని సమీపంలోని చౌమహల్లా ప్యాలెస్‌కు చేరుకున్నారు. వారందరికీ ప్యాలెస్ ప్రధాన ద్వారం వద్ద షెహనాయ్ సంగీతంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్యాలెస్‌లో హైదరాబాద్‌తో పాటు చార్మినార్, చౌమహల్లా ప్యాలెస్ తదితర చారిత్రాత్మక నిర్మాణాలు, కట్టడాలపై మిస్‌వరల్డ్ పోటీదారులకు వీడియో ప్రజంటేషన్ ఏర్పాటు చేశారు. నిజాం హయాంలో వినియోగించిన గద్దె ఇతర రాజ సంహాసనం, నిజాం పాలకులు వినియోగించిన వస్తు సామగ్రిని ప్యాలెస్‌లోని దర్బార్ హాల్‌లో ఉంచగా వాటిని అందాల భామలు పరిశీలించారు. 300 ఏళ్ల క్రితం అప్పటి హైదరాబాద్ అసఫ్ జాహి పాలకులు నిర్మించిన నాలుగు ప్యాలె స్‌ల చరిత్ర (చౌమహల్లా) ప్రాశస్త్యాన్ని పర్యాటక శాఖ గైడ్లు వారికి వివరించారు. నిజాం పాలకులు, వారి కుటుంబసభ్యుల ఫొటోలను మిస్ వరల్డ్ పోటీదారులు, ప్రతినిధులు ఆసక్తిగా తిలకించారు. చౌమహల్లా ప్యాలెస్ అద్భుతమని ఈ సందర్భంగా పలువురు పోటీదారులు పేర్కొన్నారు. ఇక, చౌమహల్లా ప్యాలెస్‌లో జరిగిన ఈ విందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబసమేతంగా హాజరయ్యారు. అలాగే, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ కూడా విందులో పాల్గొన్నారు. వీరితో పాటు ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జున, సినీ నిర్మాతలు అల్లు అరవింద్, సురేశ్ బాబు, మిస్ వరల్డ్ క్రిస్టినా పైజ్కోవా, వివిధ దేశాల రాయబారులు పాల్గొన్నారు. హైదరాబాద్‌లో హిందూ, ముస్లిం సామరస్యత తనకు బాగా నచ్చిందని నమీబియా ప్రతినిధి పేర్కొన్నారు. ఇక, మిస్‌వరల్డ్ పోటీకి ఆతిథ్యం ఇవ్వడం వల్ల హైదరాబాద్ ప్రపంచ పటంలో నిలుస్తుందని నాగార్జున అన్నారు. పలువురు పోటీదారులతో ఆయన మాట్లాడారు.



సీఎం రేవంత్‌రెడ్డికి నమస్కరిస్తున్న మిస్ ఇండియా

కళకళలాడిన చౌమహల్లా ప్యాలెస్

హైదరాబాద్‌లోని చౌమహల్లా ప్యాలెస్ దశాబ్దాల తర్వాత మంగళవారం కళకళలాడింది. హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో విలీనమైన తర్వాత ప్రాభవం కోల్పోయిన చౌమహల్లా ప్యాలెస్.. మళ్లీ ఇన్నాళ్లకు మిస్ వరల్డ్ పోటీల వల్ల సందడిగా కనిపించింది. మిస్ వరల్డ్ పోటీదారులకు విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్యాలెస్‌కు మరమ్మతులు చేయించడంతోపాటు రంగులు కూడా వేయించింది. ఇక, విద్యుత్ దీపాల అలంకరణతో భవనం మెరిసిపోగా ప్యాలెస్‌కు పూర్వ వైభవం వచ్చినట్టు అయింది.



చౌమహల్లా ప్యాలెస్‌లో జరిగిన విందులో సీఎం రేవంత్, మంత్రులు ఉత్తమ్, దుద్దిళ్ల, జూపల్లి, పొన్నం, ఎమ్మెల్యే పద్మావతి

చెంచులకు సర్కారు తీపి కబురు


- రాష్ట్ర వ్యాప్తంగా 10 వేల ఇందిరమ్మ ఇళ్లు: పొంగులేటి

హైదరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆదిమ గిరిజన తెగల్లో అతి బలహీన వర్గం చెంచులు. సంచార జీవనం సాగిస్తూ తరతరాలుగా సొంతింటికి నోచుకోని చెంచులకు సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని ఇందిరమ్మ ప్రభుత్వం తీపి కబురందించనున్నది. రాష్ట్రంలోని పదివేల మంది చెంచులకు తమ ప్రభుత్వం సొంతింటి కల సాకారం చేయనున్నదని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని 4 సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థల(ఐటీడీఏ) పరిధిలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడానికి 10 వేల చెంచు కుటుంబాలను గుర్తించినట్లు వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు తీరును మంగళవారం సచివాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు మేరకు గిరిజన ప్రాంతాల్లోని చెంచులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామన్నారు. అడవుల్లో చిన్నచిన్న గుడిసెలు తప్ప చెంచులకు పక్కా ఇల్లు ఎలా ఉంటుందో ఊహకందని విషయమన్నారు. అటవీ ప్రాంతాల్ని వదలి వారు బతక లేరని అందుకే వారు జీవించే ప్రదేశంలోనే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి పొంగులేటి వివరించారు. ఈ ఏడాది ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తే.. ఐటీడీఏ పరిధిలోని గిరిజన అసెంబ్లీ సెగ్మెంట్లకు అదనంగా 500-700 ఇళ్లు కేటాయించాలని నిర్ణయించినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. ఇక రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఓ కొలిక్కి వచ్చిందన్న మంత్రి పొంగులేటి.. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో 20 శాతం ఇళ్లు బఫర్ కింద చేపట్టామన్నారు. పట్టణాలు, ప్రత్యేకించి జీహెచ్ఎంసీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.

టిమ్స్ పనుల నాణ్యతలో రాజీపడొద్దు

- అలసత్వం వహిస్తే చర్యలు: మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణంలో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సూచించారు. పనుల్లో అలసత్వం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణ పనుల పురోగతిపై ఆయన రాష్ట్ర సచివాలయంలో మంగళవారం సమీక్షించారు. హాస్పిటల్ నిర్మాణం త్వరగా పూర్తయితే పేదలకు వైద్య ఖర్చుల నుంచి ఉపశమనం లభిస్తుందన్నారు. సూపర్ స్పెషాలిటీ హంగులు, అధునాతన వైద్య పరికరాలతో పాటు ఆధునిక ఆపరేషన్ థియేటర్లు నిర్మాణం, ఇ- సూపర్ స్పెషాలిటీ సామగ్రి అంతా బయట దేశాలనుంచి రావాల్సి ఉండటం వల్ల టిమ్స్ నిర్మాణంలో కొంత ఆలస్యం జరుగుతుందని అంచనా వేశారు. ఉస్మానియా ఆస్పత్రి పునర్నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి అంగీకరించారని తెలిపారు. సనత్ నగర్ హాస్పిటల్ పనులు ఆగస్టు నెలాఖరు వరకు పూర్తిచేస్తామని చెప్పారు. ఎల్బీనగర్, అల్వాల్ హాస్పిటల్స్‌ను వీలైనంత తొందరలో నిర్మాణాలు పూర్తి చేసుకుని ప్రారంభించనున్నట్లు చెప్పారు.



నామినేటెడ్లకు పదవుల్లేవ్?

పార్టీ పదవి కావాలంటే.. నామినేటెడ్ పోస్టుకు రాజీనామా తప్పదు

- ఎక్కువ మందికి చాన్స్ ఇచ్చేందుకు కార్యవర్గం కూర్పులో టీపీసీసీ నిబంధన
- సీనియర్ల కోసం సలహా కమిటీ ఏర్పాటు!
- క్రమశిక్షణ, సంవిధాన్ బచావ్, డీ-లిమిటేషన్ కమిటీలు సైతం
- 35 మంది ఉపాధ్యక్షులు, 75 మంది ప్రధాన కార్యదర్శులతో జంబోకార్యవర్గం!
- నేడు ఖర్గేతో టీపీసీసీ చీఫ్ భేటీ
- వారంలోపే టీపీసీసీ కొత్త కార్యవర్గం



హైదరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ కొత్త కార్యవర్గం ఏర్పాటు ప్రక్రియలో మళ్లీ కదలిక వచ్చింది. కొత్త కార్యవర్గం కూర్పుపై అధిష్ఠానం పెద్దలతో తుది చర్చల కోసం టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ మంగళవారం ఢిల్లీకి వెళ్లారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో బుధవారంనాడు ఆయన భేటీ కానున్నారు. ఈ భేటీలో పార్టీ రాష్ట్రవ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్ సైతం పాల్గొంటారు. టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, వివిధ కమిటీలకు సంబంధించిన ప్రతిపాదనలపైన ఈ భేటీలో తుది చర్చను పూర్తిచేసి.. నిర్ణయాలను వెలువరించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. వారంలోపే అధిష్ఠానం.. టీపీసీసీ కార్యవర్గాన్ని ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి టీపీసీసీ కార్యవర్గం కూర్పుపై కొద్ది రోజులుగా సీఎం రేవంత్‌రెడ్డి, మహేశ్‌కుమార్‌గౌడ్, మీనాక్షీ నటరాజన్, ఇతర ముఖ్య నాయకులు పలు దఫాలు కసరత్తు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, పార్టీ పదవుల్లో వీలైనంత ఎక్కువ మంది నాయకులకు అవకాశం కల్పించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారిని టీపీసీసీ కార్యవర్గంలోకి తీసుకోవద్దని నిర్ణయించారు. ఒకవేళ ఎవరినైనా తీసుకోవాల్సి వస్తే.. వారు తమ నామినేటెడ్ పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుందని నియమం పెట్టుకున్నారు. ఈ నియమానికి లోబడే టీపీసీసీ కార్యవర్గం కూర్పుపై కసరత్తు జరిగింది. ఇటీవల భేటీ అయిన సీఎం, టీపీసీసీ చీఫ్.. కార్యవర్గంపై కూర్పుపై చర్చించి, ఆయా పదవులకు ప్రతిపాదిత పేర్ల జాబితాను సిద్ధం చేశారు. ఆ జాబితాపైనే ఖర్గేతో భేటీలో తుది చర్చ ఉంటుందని సమాచారం.

జంబో కార్యవర్గం..!

వీలైనంత మంది నేతలకు అవకాశం కల్పించేందుకు.. జంబో కార్యవర్గాన్నే ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. నలుగురు కార్యనిర్వాహక అధ్యక్షులు, 35 మంది ఉపాధ్యక్షులు, 75 మంది ప్రధాన కార్యదర్శులతో కార్యవర్గం ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. అలాగే సీనియర్ నాయకులకు అవకాశం కల్పించేందుకు టీపీసీసీ రాజకీయ సలహా కమిటీనీ ఏర్పాటు చేయనున్నారు. క్రమశిక్షణా చర్యల అమలు, సంవిధాన్ బచావ్ కార్యక్రమం అమలు తదితర కమిటీలనూ ఏర్పాటు చేయనున్నారు. నియోజకవర్గ పునర్విభజన అంశంపైన పని చేసేందుకూ ప్రత్యేకంగా టీపీసీసీ కమిటీని నియమించనున్నారు. కార్యవర్గంతో పాటుగా ఇలా పలు కమిటీల నియామకమూ చేపట్టి వీలైనంతమంది నేతలకు అవకాశం కల్పించనున్నారు.

నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు

అధిష్ఠానంతో గతంలో జరిగిన చర్చల్లో రెడ్డి, ఎస్సీ మాదిగ, ఎస్టీ లంబాడ, ముస్లిం మైనార్టీల నుంచి ఒక్కొక్కరు చొప్పున నలుగురు కార్యనిర్వాహక అధ్యక్షులను నియమించాలన్న నిర్ణయం జరిగింది. దానికి అనుగుణంగానే ఆయా సామాజికవర్గాల నుంచి ప్రతిపాదిత పేర్ల జాబితాను రాష్ట్ర నాయకత్వం సిద్ధం చేసింది. రెడ్డి వర్గం నుంచి ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి, పార్టీ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్లు పరిశీలనలో ఉన్నాయి. ఎస్సీ మాదిగ నుంచి ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్ పేర్లను పరిశీలిస్తున్నారు. ఎస్టీ లంబాడా నుంచి ఎంపీ బలరాంనాయక్, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్ రేసులో ఉన్నారు. మైనార్టీల నుంచి వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా, మైనార్టీ గురుకులాల విద్యాసంస్థ వైస్ చైర్మన్ ఫహీమ్ ఖురేషీ, పార్టీ నేత ఫిరోజ్ ఖాన్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. అయితే ప్రీతం, బెల్లయ్యనాయక్‌ను, ఫహీమ్ ఖురేషీ, అజ్మతుల్లాలు ప్రస్తుతం నామినేటెడ్ పోస్టుల్లో కొనసాగుతున్నారు. టీపీసీసీ పెట్టిన నియమం ప్రకారం వారిలో ఎవరికి కార్యనిర్వాహక అధ్యక్ష పదవి దక్కినా.. వారు తమ నామినేటెడ్ పోస్టుకు రాజీనామా చేయాల్సి ఉంటుంది.

8 నెలలుగా కసరత్తు..!

టీపీసీసీకి చీఫ్‌గా మహేశ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించి, 8 నెలలు గడిచినా.. ఆయన టీమ్ ఇంకా సిద్ధం కాలేదు. సీఎం రేవంత్‌రెడ్డి టీపీసీసీ చీఫ్‌గా ఉన్నప్పటి కార్యవర్గమే ఇప్పటికీ కొనసాగుతోంది. అధిష్ఠానం వద్ద పలు దఫాలుగా భేటీలు జరిగినా.. కొత్త కార్యవర్గం ఏర్పాటు మాత్రం జరగలేదు. దీపా మున్షీ దాస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా ఉన్నప్పుడు కసరత్తు పూర్తయినా.. ఆమె స్థానంలో మీనాక్షీ రాకతో మళ్లీ మొదటికి వచ్చింది. ఆ తర్వాత పలు దఫాలుగా కసరత్తు చేసిన రాష్ట్ర నాయకత్వం.. ఎట్టకేలకు ప్రతిపాదిత జాబితాలను సిద్ధం చేసింది.

ఫోన్ ట్యాపింగ్ నిందితుడు..

శ్రవణ్ రావు అరెస్టు

- చీటింగ్ కేసులో 14 రోజుల రిమాండ్
- తన సంస్థ నుంచి ఇనుప ఖనిజం కొనుగోలు చేస్తే భారీగా లాభాలు వస్తాయని బురిడీ
- అఖండ కంపెనీ నుంచి రూ.7.8 కోట్లు స్వాహా



శ్రవణ్‌రావు

హైదరాబాద్ సిటీ, మే 13(ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ నిందితుడు శ్రవణ్ రావును చీటింగ్ కేసులో సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. బెంగళూరులోని తన కంపెనీ నుంచి ఇనుప ఖనిజం కొనుగోలు చేస్తే అధిక లాభాలు ఇస్తానని నమ్మించిన శ్రవణ్‌రావు.. హైదరాబాద్‌లోని అఖండ ఇన్‌ఫ్రాటెక్ కంపెనీకి రూ.7.8 కోట్లు టోపీ పెట్టాడు. ఈ కేసులో మంగళవారం శ్రవణ్‌రావును విచారించిన సీసీఎస్ పోలీసులు, ఆయనను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీసీఎస్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్‌లోని మిథిలా నగర్‌లో ఉన్న అఖండ ఇన్‌ఫ్రాటెక్ సంస్థ ప్రధాన కార్యాలయానికి ఇన్‌రిథ్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ డైరెక్టర్‌గా ఉన్న శ్రవణ్ రావు 2022 జూన్‌లో వెళ్లారు. అక్కడ అఖండ డైరెక్టర్ ఆకర్ష్ కృష్ణను కలిశారు. బెంగళూరులోని సండూరులో ఉన్న ఎకోర్ ఇండస్ట్రీస్ తన ఆధీనంలోనే ఉందని, దానికి ప్రతినిధిగా వ్యవహరిస్తున్నట్లు బురిడీ కొట్టించారు. ఎకోర్ ఇండస్ట్రీస్ నుంచి ఇనుప ఖనిజం(ముడి ఇనుము) కొనుగోలు చేస్తే టన్నుకు రూ.300 లాభం ఉంటుందని నమ్మబలికారు. శ్రవణ్ మాటలు నమ్మిన అఖండ సంస్థ.. విడతల వారీగా రూ.కోట్ల విలువైన ఖనిజాన్ని కొనుగోలు చేసింది. తన అకౌంటెంట్ ద్వారా మెయిల్ చేయించి అఖండ నుంచి రూ.7కోట్ల పై చిలుకు డబ్బును తన ఖాతాలకు మళ్లించుకున్నారు. ఆ తర్వాత సరుకు సరఫరా చేయలేదు. దీనిపై 2024 జూలైలో అఖండ సంస్థ ప్రతినిధులు ఆరా తీయగా.. శ్రవణ్ రావుతో పాటు ఎకోర్ ఇండస్ట్రీస్ డైరెక్టర్‌గా కొనసాగుతున్న ఉమా మహేశ్వర్‌రెడ్డి, శ్రవణ్‌రావు అనుచరుడు వేదమూర్తితో కలిసి అఖండ సంస్థకు రూ.7.8 కోట్లకు పైగా టోపీ పెట్టినట్లు గుర్తించారు. ఈ విషయమై వారిని నిలదీయగా.. శ్రవణ్ రావు విదేశాలకు వెళ్లారని, ఆయన భార్య స్వాతి రావు కంపెనీ బాగోగులు చూస్తున్నారని చెప్పారు. దాంతో బాధితులు ఆమెను కలవగా.. ఆ డబ్బులు ఇస్తానని హామీ ఇచ్చింది. ముందుగా రూ.50 లక్షలు అఖండ సంస్థ ఖాతాకు బదిలీ చేసింది. ఆ తర్వాత మిగిలిన డబ్బు రూ.6.58 కోట్ల గురించి మాట్లాడటానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న శ్రవణ్‌రావు విదేశాల నుంచి వచ్చిన విషయం తెలుసుకున్న బాధితులు గత నెల 24న సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు శ్రవణ్‌రావుకు నోటీసులు జారీ చేశారు. మంగళవారం సీసీఎస్‌లో శ్రవణ్‌రావును విచారించారు. ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసుకుని, అరెస్టు చేశారు. కోర్టు ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. కాగా, ఈ కేసులో శ్రవణ్‌రావు భార్య స్వాతిరావును ఏ-4గా చేర్చారు.

సిబిల్ స్కోర్‌తో సంబంధం లేదు

» యువ వికాసం ఎంపికలకు అది వర్తించదు: భట్టి



ఇల్లెందు, మే 13(ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారుల ఎంపికకు సిబిల్ స్కోర్‌తో సంబంధం లేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నిరుద్యోగులకు వరంగా రూపొందించిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2 నుంచి అమలు చేస్తామని తెలిపారు. ఈ పథకం లబ్ధిదారుల ఎంపికలో సిబిల్ స్కోర్ చూస్తారని కొన్ని సామాజిక మాధ్యమాల ద్వారా దుష్ప్రచారం జరుగుతోందన్నారు. ఈ ప్రచారాలను నిరుద్యోగులు నమ్మవద్దని సూచించారు. లబ్ధిదారుల ఎంపికకు సిబిల్ స్కోర్, ట్రాక్ రికార్డు, రికవరీ లాంటి అంశాలను పరిగణనలోకి తీసుకోరని స్పష్టం చేశారు. గతంలో ఎస్సీ, బీసీ, ఐటీడీఏ తదితర సంస్థల రుణాలు పొందిన వారు ఉన్నారని, రాజీవ్ యువ వికాసంలో కొత్త వారికి అవకాశం లభించాల్సి ఉందని భట్టి వెల్లడించారు.

లక్డీకాపూల్‌లో రోశయ్య కాంస్య విగ్రహం

» ఏర్పాటుకు జీహెచ్ఎంసీ నిర్ణయం

హైదరాబాద్ సిటీ, మే 13 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి, దివంగత కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. లక్డీకాపూల్‌లోని మెట్రో స్టేషన్ సమీపంలోని చౌరస్తాలో తొమ్మిది అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాటు కోసం బిడ్‌లు ఆహ్వానిస్తూ మంగళవారం టెండర్ నోటిఫికేషన్ ప్రకటించారు. 450కిలోల బరువైన విగ్రహం, దాన్ని ఏర్పాటు చేసేందుకు పీఠం, విగ్రహం తరలింపు, నిర్ణీత ప్రాంతంలో క్రేన్ ద్వారా ఏర్పాటు వంటివి ఎంపికైన ఏజెన్సీ చేయాల్సి ఉంటుంది. విగ్రహంలో ఏ మెటీరియల్ ఎంత వాడాలి? ఎంత మందం ఉండాలి? తదితర వివరాలు టెండర్ డాక్యుమెంట్‌లో పేర్కొన్నారు. జూలై 4న రోశయ్య జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరించాలని భావిస్తున్నారు. ఆలోపు విగ్రహం ఏర్పాటు చేయడంతోపాటు.. ఆ ప్రాంతంలో సుందరీకరణ పూర్తి చేయనున్నట్టు అధికారులు తెలిపారు. బుధవారం నుంచి 17వ తేదీ వరకు బిడ్‌ల దాఖలుకు అవకాశముందని పేర్కొన్నారు.

హాస్టళ్లలో నాణ్యమైన భోజనం అందించాలి: సీఎస్

హైదరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. సాంఘిక సంక్షేమ, బీసీ, గిరిజన, మైనారిటీ సంక్షేమ గురుకుల విద్యాలయాలు, హాస్టళ్ల నిర్వహణపై మంగళవారం ఆయన సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. వసతి గృహాల్లో మెరుగైన సేవలు అందించడానికి తగిన ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సీఎస్ సూచించారు. విద్యార్థుల కాస్మెటిక్ చార్జీలను వారి బ్యాంకు ఖాతాల్లోనే నేరుగా జమ చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సొమ్మును డ్రా చేసుకోవడానికి ఇచ్చే డెబిట్ కార్డుల వల్ల విద్యార్థులకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన ఏర్పడుతుందని తెలిపారు. విద్యార్థులకు కావాల్సిన సబ్బులు, కాస్మెటిక్ వస్తువులను కొనుగోలు చేయడానికి మహిళా సంఘాలు నిర్వహిస్తోన్న మొబైల్ విక్రయ కేంద్రాలతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఎన్.శ్రీధర్, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఎ.వర్షిణి, సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఇ.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బదులు చెప్పలేకే ఈటలపై ఎదురుదాడి

» కాంగ్రెస్ నేతలపై బీజేపీ ఎమ్మెల్యేల ఫైర్

హైదరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పేరిట గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పేదల ఇళ్లను కూల్చివేస్తున్న అంశంపై ఎంపీ ఈటల రాజేందర్ లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా కాంగ్రెస్ నేతలు ఎదురుదాడి చేయడంపై బీజేపీ ఎమ్మెల్యేలు మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి చేతకానితనానికి ఇదే నిదర్శనమని విమర్శించారు. ఈ మేరకు బీజేపీ ఎమ్మెల్యేలు ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా, రామారావు పవర్, పైడి రాకేష్ రెడ్డి, పాల్వాయి హరీష్ బాబు ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంపీ ఈటల రాజేందర్ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డితో ఎదురుదాడి చేయించడం సరికాదన్నారు. పేదలకు ఎలాంటి పునరావాసం కల్పించకుండా వారి నివాసాలను హైడ్రా కూల్చివేస్తుందని ఈ అంశంపై సీఎం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.

ఈటల.. నకిలీ బీసీ: టీపీసీసీ

ఈటల రాజేందర్ నకిలీ బీసీ అని, ఓట్ల కోసమే ఆయన బీసీ కార్డు వాడుతున్నాడని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ ఆరోపించారు. బీజేపీలో అధ్యక్ష పదవి రాలేదన్న మానసిక క్షోభలో ఉన్న ఈటల.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై నోరు జారుతున్నారని విమర్శించారు. రియల్ ఎస్టేట్ ఏజెంట్ల కోసం హైడ్రాను విమర్శిస్తున్నారని ధ్వజమెత్తారు.

గురుకుల విద్యార్థులకు 3 నుంచి నైపుణ్య శిక్షణ

హైదరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఉన్నతి ఫౌండేషన్ సహకారంతో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులకు జూన్ 3 నుంచి నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ ఏడాదిలో 36వేల మంది విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా 15 కొత్త వృత్తి విద్య కోర్సులు మొదలు పెడుతున్నామన్నారు. 6వ తరగతి నుంచి 9 వరకు, ఇంటర్ విద్యార్థులకు కోడింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు అలుగు వర్షిణి పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులకు విద్యాసంవత్సరం నుంచి ఫ్రెంచ్ భాష నేర్పిస్తామని తెలిపారు. ఈ విద్యాసంవత్సరంలో 57,523 సీట్లకుగానూ 55,504 సీట్లు భర్తీ చేశామని, మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 20న కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. సీటు వచ్చిన విద్యార్థులు జూన్ 10వ తేదీలోపు ఆయా పాఠశాలల్లో రిపోర్ట్ చేయాలని సూచించారు.

రామానంద తీర్థ సంస్థలో నిరుద్యోగులకు శిక్షణ

హైదరాబాద్ సిటీ, మే 13(ఆంధ్రజ్యోతి): స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో మేధా చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భోజన, వసతి కల్పిస్తామని పేర్కొన్నారు. 18-25 సంవత్సరాల మధ్య వయసు ఉండి ఆసక్తిగల గ్రామీణ, పట్టణ ప్రాంత అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9133908000, 9133908111, 9133908222, 9948466111 నెంబర్లలో సంప్రదించవచ్చు.

అవంతి కళాశాలకు అటానమస్ హోదా

అబ్దుల్లాపూర్‌మెట్, మే 13 (ఆంధ్రజ్యోతి) : అటానమస్ హోదాతో ప్లేస్‌మెంట్ అవకాశాలు మెరుగవుతాయని ఏపీ మాజీమంత్రి, అవంతి కళాశాల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గుంతపల్లిలోని అవంతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు యూజీసీ అటానమస్ హోదాను కల్పించిందని తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచి 2034-35 సంవత్సరం వరకు 10 ఏళ్ల పాటు ఈ హోదా కొనసాగుతుందని పేర్కొన్నారు. హోదా వచ్చిన సందర్భంగా మంగళవారం కళాశాలలో అధ్యాపక బృందంతో కలిసి ఆయన కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. అటానమస్ హోదాతో విద్యార్థులకు ప్లేస్‌మెంట్ అవకాశాలు మెరుగవుతాయన్నారు. అదేవిధంగా విద్యా ప్రమాణాలు పెరుగుతాయన్నారు. దశాబ్దాల కాలంగా తమ విద్యా సంస్థల ద్వారా లక్షలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దినట్లు తెలిపారు. తమ కళాశాలల్లో చదివిన విద్యార్థులు దేశ, విదేశాల్లో మంచి రంగాల్లో స్థిరపడ్డారని తెలిపారు. రానున్న రోజుల్లో యూనివర్సిటీ హోదానూ సాధిస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ జయప్రద, ప్రిన్సిపాల్స్ శేషతల్పసాయి, రాంచంద్రారెడ్డి, క్యాంపస్ ఇన్‌చార్జి బోసుబాబు, పీఆర్‌వో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ ఫీజు రూ.2.5 లక్షలా?

మూడేళ్ల తర్వాత రూ.5 లక్షలు చేస్తారా?

ఇష్టానుసారంగా పెంచుతామంటే ఎలా..!

కొన్ని కాలేజీల తీరుపై అధికారుల అసంతృప్తి

ఇంజనీరింగ్ ఫీజుల పెంపు నిర్ణయం వాయిదా



హైదరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): "ఇప్పుడు రూ.1.5 లక్షలుగా ఉన్న ఫీజును.. రూ.2.5 లక్షలకు పెంచాలంటున్నారు. ఇలా ఇష్టానుసారంగా పెంచుకుంటూ పోతే.. మూడేళ్ల తర్వాత రూ.5లక్షలు కావాలంటారా..?" అని ఇంజనీరింగ్ కాలేజీలపై ఏర్పాటైన ఉన్నతస్థాయి కమిటీ ప్రశ్నించింది. ఫీజుల ఖరారుకు సంబంధించిన కీలక సమావేశం మంగళవారం సచివాలయంలో జరిగింది. మూడేళ్లకోసారి ఫీజులు పెంచాల్సి ఉండగా.. ఇప్పటికే కాలేజీలు సమర్పించిన ఆడిటర్ నివేదికల ఆధారంగా ఫీజు నియంత్రణ కమిటీ(ఎఫ్ఆర్‌సీ) ఫీజులను సిద్ధం చేసింది. దీనిపై విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితారాణా, సాంకేతిక విద్య కమిషనర్ శ్రీదేవసేన, ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు ఆచార్య బాలకిష్టారెడ్డి, ఇతర ఉన్నతాధికారులు సమీక్షించారు. నగర శివార్లలోని కొన్ని కాలేజీలు ప్రతిపాదించిన ఫీజులపై అధికారులు ఆశ్చర్యం వ్యక్తంచేశారు. "మూడేళ్లలో ఒక సీటుకు రూ.లక్ష పెంచాలంటున్నారు. దీనికి ప్రాతిపదికత ఏమిటి..? ఖర్చులు పెరిగాయని, ఆడిటర్ నివేదికలు ఇస్తే పెంచేయాలా..?" అని ప్రశ్నించారు. చాలా కాలేజీల్లో సీట్లు 1,500కి పైగానే ఉన్నాయి. ఈ లెక్కన 1,600 సీట్లున్న ఓ కాలేజీ ఇప్పుడు ఏడాదికి రూ.24 కోట్లు వసూలు చేస్తుండగా.. ఫీజులు పెంచితే రూ.40కోట్లు వస్తాయని అధికారులు పేర్కొన్నారు. దీంతో విద్యార్థులతోపాటు ఫీజు రియింబర్స్‌మెంటు చెల్లించే ప్రభుత్వ ఖజానాపైనా తీవ్ర ప్రభావం ఉంటుందని యోగితారాణా, శ్రీదేవసేన అన్నట్టు తెలిసింది. కొన్ని ప్రముఖ కాలేజీలు ఏకంగా రూ. 2లక్షలకు ఫీజులను పెంచాలని ప్రతిపాదించడంపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎఫ్ఆర్‌సీ సిఫారసులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించలేనమని స్పష్టం చేశారు. ప్రస్తుత ఫీజులతో పోలిస్తే.. 30శాతానికి మించి పెంచేది లేదన్నారు. ఎఫ్ఆర్‌సీ ప్రతిపాదిత ఫీజులను సవరించాలని, కొత్త జాబితా సిద్ధమైతే మళ్లీ సమావేశం నిర్వహించి, ఖరారు చేస్తామని యోగితారాణా పేర్కొన్నారు.

ఈ సారీ గోదారి సముద్రం పాలేనా?

ఎన్‌డీఎస్ఏ నివేదిక అందినా మేడిగడ్డకు మరమ్మతులు ప్రారంభించని సర్కారు

» అన్నారం, సుందిళ్లలో నీటి నిల్వ ఇబ్బందే

» మరో 2 నెలల్లో ప్రాజెక్టులకు వరదలు

» తుమ్మిడిహెట్టిని కడతామని మ్యానిఫెస్టోలో ప్రకటించిన కాంగ్రెస్

» 17 నెలలైనా ఒక్క అడుగు పడని వైనం



హైదరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకంలో తుమ్మిడిహెట్టి బ్యారేజీని నిర్మిస్తుందా? కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బ్యారేజీని జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్ఏ) నివేదిక ప్రకారం పునరుద్ధరిస్తుందా? మరమ్మతులు చేసి, మళ్లీ వినియోగంలోకి తెస్తుందా? అనేది అంతుచిక్కని ప్రశ్న గా మారింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 17 నెలలు గడుస్తున్నా తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణ దిశగా ఒక్క అడుగు కూడా పడలేదు. ఇక, కాళేశ్వరంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై ఎన్‌డీఎస్ఏ నివేదిక వచ్చిన తర్వాత తదుపరి అడుగులు వేయాలని భావించారు. తగిన పరిశోధనలు చేసి, పునరుద్ధరణ/మరమ్మతులకు కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) ఆమోదం తీసుకొని, పనులు చేపట్టాలని ఎన్‌డీఎస్ఏ సిఫారసు చేసింది. 2 నెలల్లో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులకు వరదలు వస్తే నవంబరు దాకా మరమ్మత్తుకు అవకాశం ఉండదు. ఈ సీజన్‌లో కూడా కాళేశ్వరంలోని కీలక బ్యారేజీలు నిరుపయోగంగా మిగిలే ప్రమాదం ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం రూ.లక్ష కోట్లకు పైగా వెచ్చించగా.. అందులో లింక్-1లో ఉన్న సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీలు, పంప్‌హౌస్‌లు తప్ప మిగిలిన బ్యారేజీలు, పంప్‌హౌస్‌లు బాగానే ఉన్నాయి. వీటిని ప్రభావవంతంగా వాడుకోవాలంటే ప్రత్యామ్నాయంగా తుమ్మిడిహెట్టిపై దృష్టి పెట్టాల్సిందేనని నిపుణులు సూచిస్తున్నారు.

ఇదే సరైన సమయం

కాళేశ్వరం పథకంలో అదనపు టీఎంసీకి సంబంధించి సవరణ డీపీఆర్‌ను సమగ్ర వివరాలతో మళ్లీ సమర్పించాలని సీడబ్ల్యూసీ ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వాన్ని కోరింది. దీన్ని అవకాశంగా తీసుకొని కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో తుమ్మిడిహెట్టి బ్యారేజీని కొత్తగా చేర్చి సమగ్ర డీపీఆర్‌ను సమర్పించడానికి ప్రభుత్వానికి వీలు దొరికినా నిర్ణయం తీసుకోక పోవటం విమర్శలకు కారణమవుతోంది.

మరమ్మతులకు ఏడాదైనా పడుతుంది

మేడిగడ్డకు మరమ్మతులు/పునరుద్ధరణ పనులకు ఏడాదిపైగా సమయం కావాల్సిందే. ఈ బ్యారేజీలో ఏడో బ్లాకు కుంగిన ప్రభావం 6, 8 బ్లాకులపై కూడా పడినట్లు గుర్తించిన నీటిపారుదల శాఖ నిపుణులు.. వాటి 32 పిల్లర్లు కొత్తగా కడితేనే బ్యారేజీ పూరిగా అందుబాటులోకి వస్తుందని చెప్తున్నారు. దీనికి దాదాపు ఏడాది పట్టనుంది. ఆ లోపు మేడిగడ్డ ఎగువన రబ్బర్‌డ్యామ్/ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తే కన్నెపల్లి(మేడిగడ్డ) పంప్‌హౌస్ నుంచి అన్నారం, సిరిపురం(అన్నారం) పంప్‌హౌస్ నుంచి సుందిళ్ల బ్యారేజీలోకి నీటిని పంపింగ్ చేయవచ్చు.

కాళేశ్వరంలో ఏటా ఏదో ఒక సమస్య

మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాకు కుంగిపోగా ఒక గేటును ఇప్పటికే కత్తిరించి తొలగించారు. దీంతో ఇక్కడ నీటి నిల్వకు అవకాశం లేదు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు పాక్షిక మరమ్మతులతో నీటి నిల్వకు వీలుంది. అయితే, ఈ రెండు బ్యారేజీలతో పోల్చితే మేడిగడ్డకు భారీగా వరద వస్తుంది. అన్నారం, సుందిళ్లలు ప్రధాన గోదావరిపై ఉండగా.. ప్రాణహిత కలిసిన తర్వాత మేడిగడ్డ ఉంది. దీనికి ఏటా 20 లక్షల క్యూసెక్కులకు పైగా వరద దీనికి వస్తోంది. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టులో ఏటా ఏదో సమస్య ఏర్పడుతోంది. 2022 జూలైలో కన్నెపల్లి(మేడిగడ్డ), సిరిపురం(అన్నారం) పంప్‌హౌస్‌లు నీట మునిగాయి. కన్నెపల్లి పంప్‌హౌస్ పూర్తిగా ధ్వంసమైంది. ఆ తర్వాత 2023 అక్టోబరులో మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాకు కుంగింది. ఆ బ్యారేజీలో నీటి నిల్వ ఏ మాత్రం సురక్షితం కాదని ఎన్‌డీఎస్ఏ తేల్చడంతో బ్యారేజీని పూర్తిగా ఖాళీ చేసేశారు. ఆ వెనువెంటనే అన్నారం, సుందిళ్లలో భారీగా సీపేజీలు బయటపడ్డాయి.

ఎందుకు అలా చేశారు?

» 15 ఏళ్లుగా ఒక్కరికే లేబుల్స్ వేసే కాంట్రాక్టు ఇవ్వడంపై ప్రభుత్వం సీరియస్

» నివేదిక అడగడంతో 'ఎక్సైజ్'లో హడావుడి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హైదరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి) : మద్యం సీసాల మీద అతికించే లేబుల్స్ కాంట్రాక్టు అబ్కారీ శాఖ 15 ఏళ్లుగా ఒకే వ్యక్తికి కట్టబెట్టడాన్ని రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఎందుకు అలా చేయాల్సి వచ్చిందో నివేదిక ఇవ్వాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించింది. దీంతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు హైరానా పడుతున్నారు. మద్యం సీసాలపై లేబుల్స్ అతికించే పనికి 2010లో బీవోటీ ప్రాతిపదికన ఎక్సైజ్ శాఖలో అడుగుపెట్టిన వ్యక్తి అప్పటి నుంచీ కొనసాగుతునే ఉన్నారు. టీజీ ఆన్‌లైన్, ఎస్‌ఐసీ వంటి సంస్థలు ప్రభుత్వ అవసరాల కోసం పని చేస్తున్నా.. ప్రభుత్వం టు ప్రభుత్వం ప్రాతిపదికన ఈ కాంట్రాక్టును అప్పగించేందుకు అవకాశం ఉన్నా.. ఎక్సైజ్ శాఖ కొంతమంది ఉన్నతాధికారుల ప్రయోజనాల కోసం.. ప్రభుత్వ సంస్థలను కాదని.. ప్రైవేటు వ్యక్తుల మీదనే ఆధారపడుతుంది. ఈ విషయంపై ఈ నెల 11న '15ఏళ్లుగా ఒక్కరికే కాంట్రాక్టా?' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఆ కథనానికి ప్రభుత్వం స్పందించింది. కథనంలోని అంశాలను పేర్కొంటూ.. ఎందుకు అలా చేశారో నివేదిక ఇవ్వమని కోరింది. దీంతో ఆ శాఖ కమిషనర్.. మిగిలిన అధికారులతో వివరాలు సేకరిస్తున్నారు.

ఎడ్‌సెట్ దరఖాస్తు గడువు పెంపు

» ఈనెల 24 వరకు అవకాశం

కేయూ క్యాంపస్, మే 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎడ్‌సెట్- 2025 గడువును పొడిగించినట్లు ఎడ్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ బైరు వెంకట్రామిరెడ్డి తెలిపారు. అపరాధ రుసుం లేకుండా మే 20 వరకు, రూ.500 అపరాధ రుసుంతో మే 24 వరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. పూర్తి వివరాలకు ఎడ్‌సెట్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు. కాగా, గతంలో ప్రకటించిన షెడ్యూల్ గడువు మంగళవారంతో ముగిసింది.

రక్షణ ఎగుమతుల్లో 34 రెట్ల వృద్ధి

» 11 ఏళ్లలో సాధించిన ఘనత ఇదీ

న్యూఢిల్లీ, మే 13: రక్షణ ఉత్పత్తుల ఎగుమతుల్లో భారత్ గణనీయమైన ప్రగతి సాధించింది. గత 11 ఏళ్లలో 34 రెట్ల వృద్ధి నమోదయింది. 2013-14లో రూ.868 కోట్లు విలువ చేసే ఉత్పత్తులను ఎగుమతి చేయగా, 2024-25లో వాటి విలువ రూ.23,622 కోట్లకు పెరిగింది. ఇందులో ప్రయివేటు రంగం వాటా అధికంగా ఉంది. 2024-25లో ప్రయివేటు సంస్థలు రూ.15,233 కోట్లు విలువ చేసే ఉత్పత్తులను ఎగుమతి చేశాయి. ప్రభుత్వ రంగానికి చెందిన డిఫెన్స్ పబ్లిక్ సెక్టర్ యూనిట్స్ (డీపీఎస్‌యూ) రూ.8,389 కోట్ల ఉత్పత్తులను విదేశాలకు విక్రయించాయి. 11 ఏళ్లలో వీటి ఎగుమతుల్లో 42.85 శాతం వృద్ధి నమోదయింది. 2029లో 80 దేశాలకు రూ.50వేల కోట్ల విలువ చేసే ఉత్పత్తులను ఎగుమతి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా నమ్మకమైన ఎగుమతిదారుగా విశ్వసనీయత పొందినట్టు పేర్కొంది. ఇదే సమయంలో రక్షణ శాఖ బడ్జెట్ కూడా భారీగా పెరిగింది. 2013-14లో రూ.2.53 లక్షల కోట్లను కేటాయించగా, 2025-26లో కేటాయింపులు రూ.6.81 లక్షల కోట్లకు పెరిగాయి. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో రక్షణ శాఖ ఈ వివరాలను వెల్లడించింది.

బాలాజీ గోవిందప్ప అరెస్టు

ఏపీ మద్యం స్కామ్ కేసులో కీలక మలుపు

అమరావతి, మే 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జరిగిన రూ.వేల కోట్ల లిక్కర్ స్కామ్ కేసు కీలక మలుపు తిరిగింది. ఈ కేసులో మరో ప్రధాన నిందితుడు, జగన్ కుటుంబానికి చెందిన భారతీ సిమెంట్స్ శాశ్వత డైరెక్టర్ బాలాజీ గోవిందప్పను కర్ణాటకలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అదుపులోకి తీసుకుంది. మద్యం ముడుపులను షెల్ కంపెనీల్లోకి మళ్లించిన వ్యవహారంలో బాలాజీ పాత్రే కీలకమని సిట్ ఇప్పటికే గుర్తించింది. చార్టర్డ్ అకౌంటెంట్‌గా (సీఏ) తన తెలివితేటలను వాడి తాడేపల్లి ప్యాలెస్‌కు ఆయన సొమ్ములు తరలించారనేందుకు ఆధారాలు సేకరించింది. ఈ నెల 11వ విచారణకు రావాల్సిందిగా సిట్ ఈ నెల తొమ్మిదో తేదీన ఇచ్చిన నోటీసును తోసిపుచ్చి, బాలాజీ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆయన ఆచూకీని కర్ణాటకలో గుర్తించిన సిట్ బృందం మంగళవారం అక్కడకు వెళ్లింది. మైసూరులోని ఓ రిసార్టులో సేద తీరుతున్న బాలాజీని అదుపులోకి తీసుకుంది. బీఆర్ హిల్స్‌లో ఒక్కసారిగా సిట్ అధికారులను చూడటంతో ఆయన అవాక్కయ్యారు. ఆ వెంటనే స్థానిక కోర్టుకు బాలాజీని తరలించారు. కోర్టు అనుమతితో విజయవాడకు తీసుకొస్తున్నారు.

రేపటి నుంచి వీఐపీ బ్రేక్ దర్శనం

తిరుమల, మే 13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి వీఐపీ బ్రేక్ సిఫారసు దర్శనాలను టీటీడీ పునరుద్ధరించింది. వేసవి సెలవుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఈ నెల 1 నుంచి జూలై 15దాకా సిఫారసు లేఖలు తీసుకోబోమని గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే రద్దీ తగ్గుముఖం పట్టడంతో పునరుద్ధరిస్తున్నారు. 15వ తేదీ నుంచి సిఫారసు లేఖలను స్వీకరించి 16నుంచి దర్శనాలను కొనసాగిస్తారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల సిఫారసు లేఖలను మాత్రమే ప్రస్తుతం అనుమతిస్తారు. ఇతర విభాగాలు, శాఖల సిఫారసు లేఖలపై ఆంక్షలుంటాయని టీటీడీ స్పష్టం చేసింది.

సరస్వతి పుష్కరాలకు సర్వం సిద్ధం

రేపు పుష్కరాలను ప్రారంభించనున్న శ్రీ మాధవానంద సరస్వతి

» 17 అడుగుల ఏకశిల సరస్వతీ విగ్రహాన్ని ఆవిష్కరించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

» భక్తులకోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

హైదరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): జయశంకర్-భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరంలోని త్రివేణి సంగమంలో గురువారం అద్భుత ఘట్టం ఆవిష్కృతం కానుంది. తెలంగాణ ఏర్పాటైన తర్వాత రాష్ట్రంలో తొలిసారి జరుగనున్న సరస్వతి నది పుష్కరాల ప్రారంభానికి సర్వం సిద్ధమైంది. ముందుగా నిర్ణయించిన ముహూర్తం ప్రకారం గురువారం తెల్లవారుజామున 5:44 గంటలకు శ్రీ గురు మదనానంద సరస్వతీ పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి ప్రత్యేక పూజలతో పుష్కరాలు లాంఛనంగా ప్రారంభమవుతాయి. ప్రధానఘాట్ వద్ద మహబలిపురం నుంచి తీసుకొచ్చిన 17 అడుగుల సరస్వతి ఏకశిలా విగ్రహాన్ని సాయంత్రం నాలుగు గంటలకు సీఎం ఎ.రేవంత్‌రెడ్డి ఆవిష్కరిస్తారు. అటుపై సరస్వతి నదిలో పుష్కర స్నానం చేసి, కాళేశ్వర ముక్తీశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. సాయంత్రం 5:30 గంటలకు పుష్కర ఘాట్‌లో సరస్వతి హారతి కార్యక్రమంలో పాల్గొంటారు. గురువారం సూర్యోదయం నుంచి ఈ నెల 26 వరకూ 12 రోజులు పుష్కరాలు జరుగుతాయి. పుష్కరాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామన్న రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ.. పుష్కరాల ప్రతి రోజూ ఒక పీఠాధిపతి పుణ్యస్నానాలు ఆచరిస్తారని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి లక్షల మంది భక్తులు పుష్కరాల్లో పాల్గొనే అవకాశముంది. పుష్కర ఏర్పాట్ల కోసం కేటాయించిన రూ.35 కోట్లతో వివిధ శాఖలతో సమన్వయం చేసుకుంటూ దేవాదాయశాఖ పుష్కర ఘాట్లు, మరుగుదొడ్లు, మంచినీటి వసతి, టెంట్ సిటీ, రోడ్ల మరమ్మత్తులు, పార్కింగ్, పారిశుద్ధ్యం తదితర పనులు చేపట్టింది. హైదరాబాద్ మొదలు రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపనున్నది. ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు చోటు లేకుండా పోలీసుశాఖ కట్టుదిట్టమైనభద్రతా ఏర్పాట్లు చేస్తోంది.



గోదావరి తీరంలో ఏర్పాటు చేసిన సరస్వతి విగ్రహం

యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు

సీఎం పర్యటన నేపథ్యంలో అధికార యంత్రాంగం కాళేశ్వరంలో యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యంగా సరస్వతి ఘాట్ సమీపంలో సీఎం రేవంత్‌రెడ్డి వచ్చే హెలికాప్టర్ దిగడానికి హెలీప్యాడ్ నిర్మిస్తున్నారు. సాయంత్రం సరస్వతి హారతి ఆలస్యమయ్యేఅవకాశాలుండటంతో రోడ్డు మార్గంలో హైదరాబాద్‌కు వెళ్లడానికి పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం రాక నేపథ్యంలో జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే నేతృత్వంలో వందల మంది పోలీసులు కాళేశ్వరం పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. పుష్కర ఘాట్ల నుంచి బస్టాండ్ వరకూ 200 సీసీటీవీ కెమెరాలు ఏర్పాట్లు చేస్తున్నారు. విపత్తు నిర్వహణ శాఖ ప్రత్యేక అధికారి అరవింద్ కుమార్, కలెక్టర్ రాహుల్ శర్మ మకాం వేసి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. సరస్వతి విగ్రహప్రతిష్ఠాపన ప్రాంతంలో సుందరీకరణ పనులు తుది దశకు చేరుకున్నాయి.

రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు

» ఇప్పటికే 43 లక్షల టన్నుల ధాన్యం సేకరణ: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 43 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రస్తుత రబీ సీజన్ (2024-25)లో ధాన్యం కొనుగోలు గణనీయంగా పెరిగిందని వివరించారు. ఈ మేరకు మంత్రి మంగళవారం సోషల్ మీడియాలో పోస్టు చేశారు. 2024-25 రబీ సీజన్‌లో మే 12 వరకు రాష్ట్ర ప్రభుత్వం 43.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ చరిత్రాత్మక రికార్డును సృష్టించిందని తెలిపారు. వానాకాలం సీజన్‌లో 153.5లక్షల టన్నులు, ప్రస్తుత యాసంగిలో 127 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అయిందని తెలిపారు. ఇది తెలంగాణ చరిత్రలోనే కాకుండా, దేశంలో అరుదైన విజయంగా నిలిచిందని అన్నారు.

హరీశ్ రావు ఆరోపణలన్నీ అసత్యాలు

ధాన్యం కొనుగోళ్లపై బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ప్రతి రోజూ అసత్య ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అసత్యాలు చెప్పడం మానుకోవాలని సూచించారు. ప్రభుత్వం రైతుల పక్షపాతిగా నిలిచి, వారి శ్రేయస్సు కోసం అనేక కార్యక్రమాలను చేపడుతోందన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు అండగా నిలిచి, ధాన్యం కొనుగోలు, ఉత్పత్తిలో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిన నేపథ్యంలో.. ఈ విజయం రాష్ట్ర వ్యవసాయ రంగానికి కొత్త ఊపిరిని ఇస్తుందని ఉత్తమ్ పేర్కొన్నారు.

ప్రతి జిల్లాలో నైపుణ్య శిక్షణ కేంద్రం

» అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్యూచర్ సిటీ: దుద్దిళ్ల



హైదరాబాద్, కందుకూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' మార్గ నిర్దేశంలో రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రంలో నైపుణ్య శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట్‌లో 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' నిర్మాణ పనుల పురోగతిని ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి... పనులు సకాలంలో పూర్తి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. పనుల్లో వేగం పెంచాలని చెప్పారు. పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య ఏర్పడిన అంతరాన్ని తగ్గించి, తెలంగాణ యువతకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతోనే అంతర్జాతీయ ప్రమాణాలతో 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేశామని వివరించారు. తొలిదశలో భాగంగా మీర్‌ఖాన్‌పేట్‌లోని స్కిల్స్ యూనివర్సిటీ శాశ్వత క్యాంపస్‌లో అకడమిక్ బ్లాక్, ప్రయోగశాలలు, వసతి గృహాలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. వీటిని ఈ ఏడాది డిసెంబరు 9న లాంఛనంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఏడాది వ్యవధిలోనే 57 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని స్పష్టం చేశారు. భావితరాల అవసరాల కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో నాలుగో నగరంగా 'ఫ్యూచర్ సిటీ'ని అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలోనే ఫ్యూచర్ సిటీ అథారిటీ కార్యాలయాన్ని స్థానికంగా ప్రారంభిస్తామన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.